సంగీత బోధిని

సంత్ హరిప్రియానంద సరస్వతి

అంకితం

తొలి గురువు

మా అమ్మకు

(శ్రీమతి పాల్వాది ప్రభావతి)

సంగీత బోధిని

సంత్ హరిప్రియానంద సరస్వతి

సంగీత బోధిని

సమయ దాతలు

1) పాల్వాది పావని కిరణ్మయి

2) ఎం.బి.ఎస్.వి.వి. సత్యనారాయణమూర్తి

ద్వారకమాయి
103, సౌందర్య అపార్ట్‌మెంట్,
1వ లైను, రాజేంద్రనగరు (సౌత్),
గుంటూరు - 522 006

ముఖచిత్రం
అవధూత, తత్వశిరోమణి
శ్రీశ్రీశ్రీ భగవాన్ వెంకయ్య స్వామి,
గొలగమూడి, నెల్లూరు జిల్లా

ముద్రణ
స్వప్న ఆర్ట్ హోమ్
విజయవాడ - 520 002
ఫోన్ : 92464 64115

ముందుమాట

'సంగీత జ్ఞానము భక్తివినా - సన్మార్గము గలదే ఓ మనసా' అని ధన్యాసి రాగములో, నాదబ్రహ్మ శ్రీ త్యాగరాజస్వామి ఆ కీర్తనను సంగీత రసిక ప్రియులకు అందించారు. జ్ఞానము, భక్తి, వైరాగ్యములను సంగీతము ద్వారా వృద్ధి చేసుకొనవచ్చును. శారీరక, మానసిక రుగ్మతలకు సంగీత సాధన ఒక దివ్యౌషధము. నేటి సమాజములో ప్రతి మానవుడు ఏదోవిధమైన కలతతో, దుఖ: కంపితుడౌతున్నాడు. యవ్వనులు ఒంటరి బ్రతుకుల్లో అలసి సొలసి, అమ్మపాడే జోల పాటకు కూడా వారి చిన్నారులను దూరం చేస్తున్నారు. ఈ రోజుల్లో ఎంతమంది తల్లులు "జో అచ్యుతానంద జోజో ముకుందా" అని చిన్నారులకు పాడి నిద్ర పుచ్చుతున్నారో తెలియదుగాని, శిశువులు, పశువులు, కడకు సర్పములు కూడా గానా మృతమును గ్రోలి ఆనందిస్తున్నాయని మనకు "శిశుర్వేత్తి పశుర్వేత్తి, వేత్తి గానరసం ఫణి" అనే నానుడి ద్వారా తెలుస్తుంది. భర్తృహరి చెప్పినట్లు మంచి కృతులను రచించిన వారు చిరస్మరణీయులు. వారి కీర్తికాయమునకు జనన మరణాదులుండవు. అది శాశ్వతము, ఆచంద్రతారార్కము. అట్టి వారిలో సంగీత త్రిమూర్తులైన శ్రీ త్యాగరాజస్వామి, శ్రీ ముత్తుస్వామి దీక్షితులు, శ్రీశ్యామశాస్త్రి మరియు పురంధరదాసు, అన్నమా చార్యులు, స్వాతి తిరునాళ్, సదాశివ బ్రహ్మేంద్రులేగాక అనేక అజ్ఞాత వాగ్గేయకారులున్నారు. సంగీత సాధనకోసం, చిన్నారులకు అర్థమయ్యే భాషలో, నేటి తరానికి అందుబాటులో నుండే విధముగా సంగీత జ్ఞానమును ఈ చిన్ని పుస్తకము ద్వారా పరిచయం చేయుట జరిగినది. ప్రాథమిక సూత్రాలు విపులముగా, అర్థమయ్యే రీతిలో అచ్చతెలుగులో రచన సాగింది. ఈపుస్తకము ప్రతి చిన్నారి సంగీత సాధనకు పునాదిరాయి వంటిది. ధనుర్మాసమునందు భరద్వాజ పక్షులు ప్రాత:కాలమున లేచి 'కీశు' 'కీశు' అని అరుస్తుంటాయట. 'కీశు' అంటే కేశవ. ఆ కేశవ నామాలు కూడా సంగీతములో ఒక భాగమే. అందుకే త్యాగరాజస్వామి తనకీర్తనలో "సామ వేదసారం వారం వారం నాదతను మనిశం" అంటారు. సామవేద సారమే నాదము, దానిని మరలా మరలా పాడుకొమ్మని లోకానికి అందించారు. గురుపరంపరలో అనేక మంది అందించిన గ్రంథములనుండి సేకరించి, సంకలనము చేయుట జరిగినది. వీరందరికి మనసా, శిరసా వందనములు. గోదావరి మాత కుంభమేళ పుష్కరాల సందర్భమున, శిరిడిలో ఆవిష్కరిస్తు, మీ అందరికి సత్‌గురువు ఆశీస్సులు అందజేస్తున్నాను.

శిరిడి
15-07-2015

(సంత్‌హరిప్రియానంద సరస్వతి)

గురుపాదుకా స్తోత్రము

ఆదిశంకరాచార్య విరచితము

అనంతసంసార సముద్రతార నౌకాయితాభ్యాం గురుభక్తిదాభ్యామ్ ।
వైరాగ్యసామ్రాజ్యదపూజనాభ్యాం నమో నమ: శ్రీగురుపాదుకాభ్యామ్ ॥ 1 ॥

కవిత్వవారాశినిశాకరాభ్యాం దౌర్భాగ్యదావాం బుదమాలికాభ్యామ్ ।
దూరికృతానమ్ర విపత్తితాభ్యాం నమో నమ: శ్రీగురుపాదుకాభ్యామ్ ॥ 2 ॥

నతా యయో: శ్రీపతితాం సమీయు: కదాచిదప్యాశు దరిద్రవర్యా ।
మూకాశ్చ వాచస్పతితాం హి తాభ్యాం నమో నమ: శ్రీగురుపాదుకాభ్యామ్ ॥ 3 ॥

నాలీకనీకాశ పదాహృతాభ్యాం నానావిమోహాది నివారికాభ్యామ్ ।
నమజ్జనాభీష్టతతిప్రదాభ్యాం నమో నమ: శ్రీగురుపాదుకాభ్యామ్ ॥ 4 ॥

నృపాలి మౌలీప్రజరత్న కాంతి సరిద్విరాజత్ ఝషకన్యకాభ్యామ్ ।
నృపత్వదాభ్యాం నతలోకపంకతే: నమో నమ: శ్రీగురుపాదుకాభ్యామ్ ॥ 5 ॥

పాపాంధకారార్క పరంపరాభ్యాం తాపత్రయాహీంద్ర ఖగేశ్వరాభ్యామ్ ।
జాడ్యాబ్ధి సంశోషణ వాడవాభ్యాం నమో నమ: శ్రీగురుపాదుకాభ్యామ్ ॥ 6 ॥

శమాదిషట్క ప్రదవైభవాభ్యాం సమాధిదాన వ్రతదీక్షితాభ్యామ్ ।
రమాధవాంద్రిస్థిరభక్తిదాభ్యాం నమో నమ: శ్రీగురుపాదుకాభ్యామ్ ॥ 7 ॥

స్వార్చాపరాణామ్ అఖిలేష్టదాభ్యాం స్వాహాసహాయాక్షధురంధరాభ్యామ్ ।
స్వాంతాచ్ఛభావప్రదపూజనాభ్యాం నమో నమ: శ్రీగురుపాదుకాభ్యామ్ ॥ 8 ॥

కామాదిసర్ప వ్రజగారుడాభ్యాం వివేకవైరాగ్య నిధిప్రదాభ్యామ్ ।
బోధప్రదాభ్యాం దృతమోక్షదాభ్యాం నమో నమ: శ్రీగురుపాదుకాభ్యామ్ ॥ 9 ॥

విషయ సూచిక

1.	సంగీతము	01
2.	స్వరాక్షరములు - వాటి పుట్టుక	01
3.	స్వర స్థాయి - దాని ప్రాముఖ్యత	02
4.	పారిభాషిక పదములు	02
5.	కీర్తన పాడు కాలపరిమితి	07
6.	తాళము - దాని ప్రాముఖ్యత	07
7.	35 తాళముల పట్టిక	09
8.	నాదము - దాని ప్రాముఖ్యత	10
9.	మేళకర్త రాగముల పుట్టుక	11
10.	రాగత్రయోదశ లక్షణములు	11
11.	వాది స్వరము లక్షణములు	13
12.	ద్వావింశతి శృతిజాతి పధకము	14
13.	సంగీత రచన లక్షణములు	16
14.	కర్నాటక సంగీత రాగములు - వాటి విభజన	28
15.	మేళకర్త ఏర్పడు పధకము	30
16.	చక్రములవారీగా మేళకర్తల శృతుల పట్టిక	31
17.	వివాది మేళకర్తలు	33
18.	గ్రహ భేదము	34
19.	మేళకర్తల సంఖ్యను కనుగొను విధానము	34
20.	తాళములు-తాళదశ ప్రాణములు	36
21.	పంచదశ గమకములు	45
22.	సంగీత వాయిద్యములు	47
23.	కొన్ని మేళకర్త రాగములు - వాటి లక్షణములు	52

24.	వివిధ జనక జన్యరాగముల మూర్ఛనలు	60
25.	రాగ వంశ వృక్షము	69
26.	మనోధర్మ సంగీతము	69
27.	సంప్రదాయ గాన కచ్చేరి చేయుపద్ధతి	71
28.	వాగ్గేయకారుల లక్షణములు - ముద్రలు	72
29.	వాగ్గేయకారుల జీవిత చరిత్రలు	73
30.	ఆరోగ్య పరిరక్షణలో రాగములు - వాటి ప్రాశస్త్యము	87
31.	భారతీయ సంగీతమునకు గల ప్రత్యేక విశిష్టత	87
32.	లలిత కళలో ఒకటైన సంగీతమునకు, మానవ దైనందిన జీవితములో సంస్కృతిపరంగా, విజ్ఞానపరంగా, భావపరంగా, ఆధ్యాత్మకపరంగా గల విలువలు	89
33.	స్వర ప్రస్తారము	92
34.	రచనలను స్వరపరిచి వ్రాయుపద్ధతి	93
35.	సంగీతమును ప్రథమముగా నేర్చుకొను విద్యార్థులు పాటించవలసిన నిబంధనలు	93

1. సంగీతము

మానసిక ఉల్లాసమును కలిగించు ప్రకృతి సిద్ధమైన ధ్వని తరంగాలే సంగీతమనబడును. ఈ ధ్వని తరంగాలను కంఠము ద్వారాగాని, వాయిద్యముల ద్వారాగాని జనియించిన, శ్రోతలకు ఉత్ప్రేరకముగా పనిచేసి ఉల్లాసమును కలుగజేయును.

ప్రాధాన్యత

భారతీయ సంగీతము అతి ప్రాచీనమైనది. నాలుగు వేదములలో నొకటైన 'సామవేదము' సంగీత ప్రాధాన్యమైనది. మహా ఋషులైన నారదులు, తుంబురులు ఈ గాన విద్యలో ఆద్యులని చెప్పదగును.

సంగీతము మానసిక ఆనందమును కలిగించి శారీరక/మానసిక రుగ్మతలను తొలగించు దివ్యౌషధముగా పరిగణింతురు. ఎందుకనగా సంగీతము నందలి ధ్వని ప్రకంపనలు మానవుని మెదడులోని నాడీమండల వ్యవస్థనుత్తేజపరచి ఈ రుగ్మతలనుండి విముక్తి కలిగించును. అంతేకాకుండా గాత్రధారులు పాటను ఆలపించునప్పుడు ఉచ్ఛ్వాస-నిశ్వాసములు క్రమబద్ధీకరించబడి ఒక ప్రాణాయామ స్థితికి చేరును. దానివలన శరీరమునకు కావలసిన ప్రాణవాయువు రక్తముతో అనుసంధానింపబడి రక్తశుద్ధి జరిగి, ఈ దేహము రోగముల బారిన పడకుండా కాపాడును. పాడునప్పుడు, నోటియందలి దవడలు, అనేక కండరములు, స్వరపేటిక యందలి కంఠస్వర నాళములు, ముఖమునందుండు అనేక లఘు కండరములు, ఉదరకోశము నందుండు అన్ని అవయవములు, ఊపిరి తిత్తులు మంచి వ్యాయామమును పొంది ఆరోగ్యముగా నుండును. శిరస్సు, ఉదరమునందుకల చక్రములు, గ్రంధులు కూడా క్రియా రూపమును పొంది, శరీరమునకు కావలసిన నాళ-వినాళ గ్రంధుల రసమును విడుదల చేసి మానవుని వికాసమునకు తోడ్పడును. సంగీతము మానవుని మెదడుపైన ప్రభావము చూపుటచే శిశువులు సైతము స్పందించి, ఆనందించుట మనకు తెలుసు. అమ్మ పాడే జోలపాటకు పాపాయి ఏడుపు మాని, ఆనందముతో హాయిగా ఉయ్యాలలో నిద్రపోతుంది. అందుకే "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగానరసం ఫణి" అన్న నానుడి వచ్చింది. అమ్మ పాడే ప్రతి పాటకు గర్భస్థ శిశువు స్పందించి, దాని ఆనవాళ్ళ ప్రతిరూపమే, శిశువు పెరిగి పెద్దదైన పిదప ప్రస్ఫుటమౌతుంది. అందుకే సంగీతము దైవాంశ సంభూతముగా చెప్పబడింది. సంగీతమునకు కుల గోత్రాదులుగాని, లింగభేదములు గాని, వయో తారతమ్యములు గాని, జాతి మత భేదములు గాని, భౌగోళిక విభేదములు గాని అడ్డమురావు.

భారత దేశము నందుండు సంగీతము రెండు రకములు. ఒకటి కర్నాటక సంగీతము, రెండవది హిందుస్తాని సంగీతము. పాశ్చాత్య కర్నాటక సంగీత మిశ్రమమే హిందుస్థాని అని చెప్పవచ్చును. ఇది ఉత్తర భారతమందును, కర్నాటక సంగీతము దక్షిణ భారతదేశమందును, మిక్కిలి ప్రాచుర్యము పొందినవి.

2. స్వరాక్షరములు - వాటి పుట్టుక

సంగీతమునందు మాతువు, ధాతువు అని రెండు భాగములు. మాతువు అంటే పాటలోని సాహిత్యము, ధాతువు అంటే పాటకు రాగయుక్తంగా స్వరముల అమరిక. దీనివలన రాగభావన, రాగము నిబిడీకృతము గావించుట, రాగచ్ఛాయను పాటకు అనుసంధానించుట వలన, పాట రక్తి కట్టి విను

వారికి ఆనందదాయకముగా నుండును. ఈ స్వరాక్షరములు ఏడు. అవి సరిగమపదని. వీటిని ప్రకృతిలోని పశు పక్ష్యాదుల ధ్వనుల నుండి మన పెద్దలు సేకరించి, ఈ ఏడు శబ్ద తరంగములే సంగీతమునకు పునాది రాళ్ళని నిర్దేశించిరి.

స్వర సంకేతము	నామము	సేకరించిన జంతువు/పక్షి
స	షడ్జమము	నెమలి కూత
రి	రిషభము	వృషభము (ఎద్దు) రంకె
గ	గాంధారము	మేక అరుపు
మ	మధ్యమము	క్రౌంచ పక్షి కూత
ప	పంచమము	కోకిల కూత
ద	దైవతము	గుఱ్ఱపు సకిలింపు
ని	నిషాదము	ఏనుగు ఘీంకారము

3. స్వర స్థాయి - దాని ప్రాముఖ్యత

కీర్తనలు పాడునప్పుడు కొన్ని ఘనముగా మరికొన్ని మంద్రముగా, రాగము ననుసరించుచు, భావ ప్రకటన కొరకు, స్వర స్థాయిలలో పాడవలెను. అటుల పాడినచో రాగ ప్రకటన, భావ ప్రకటన ప్రస్ఫుటమగును. అట్టి కీర్తన మనోరంజకముగా నుండి సంగీత కచ్చేరి రక్తి కట్టును.

4. పారిభాషిక పదములు

అ. సంగీతము

అనగా సత్+గీతము. మంచి పాటయని అర్థము. గాత్ర, వాయిద్యముల, నృత్య కలయికనే సాధారణముగా సంగీతమనబడును. కొందరు రాగ, స్వర, తాళముల సమ్మేళనమే సంగీతమని చెప్పిరి. మనోరంజకమైన రాగ, స్వర, తాళ, నృత్య కలయికనే సంగీతమని చెప్పవచ్చును. సామవేదము నుండి జనించిన ఈ సంగీతమును భగవత్ కటాక్షముచే మనము నేర్చుకొందుము. ఇది భగవంతుని శబ్ద రూపమనియు, అనేక వాగ్గేయకారులచే కొనియాడబడినదై, భగవంతుని నిత్య కైంకర్యములలో నాదమే మోదముగా పరిగణింపబడి కీర్తింపబడినది. భక్తి యోగములో సంగీతమే ముక్తికి కారణమని మన పెద్దలు వివరించి యున్నారు. ఈ నేపద్యములోనే బహుముఖ ప్రజ్ఞాశాలురైన వాగ్గేయకారులు భక్త జయదేవులు, అన్నమాచార్యులు, పురంధరదాసు, నారాయణ తీర్థులు, భద్రాచల రామదాసు, శ్యామశాస్త్రి, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, సదాశివ బ్రహ్మేంద్రులు మరియు స్వాతి తిరునాళ్, వీరంతా సంగీతమునకు అనంతమైన సేవచేసి జన్మ ధన్యత పొందిరి. పండిత పామరులందరుకును సులభ శైలిలో అనేక రచనలు చేసి, అందరూ పాడుకొని జన్మ ధన్యత నొందురీతిని సన్మార్గమును చూపిన దైవాంశ సంభూతులు వీరు.

ఆ. స్వరము – ప్రాముఖ్యత

'స్వ' అంటే సొంతగా లేక స్వకీయముగా 'రం' అంటే రంజింప చేయునది అని అర్థము. స్వరములు ఆధారముగా చేసి, ధ్వనింపచేయుటనే శృతి యందురు.

ఇ. శృతి – లయ

శృతి : సంగీతమునందు శృతి చాలా ముఖ్యమైనది. స్వరారంభము చేయు ధ్వని లేక శబ్ధమును శృతి అందురు. కీర్తన పాడుటకు మనము ఏ స్వర సాంద్రతను ఎంచుకొంటామో, కీర్తన చివరి వరకు అదే శృతిలో పాడవలెను. హెచ్చు తగ్గులు వచ్చిన కీర్తనలో అపశృతులు దొర్లి వినుటకు ఆహ్లాదముగా నుండదు. కావున ధ్వని శృతికి మూలాధారమగును. ఇంతకుముందు మనము చెప్పుకొన్నట్లు, మంద్ర స్థాయిలో, మధ్యమ స్థాయిలో, హెచ్చు స్థాయిలో, సప్త స్వరములకు ఒక్కొక్క దానిలో 22 శృతులు కలవు. కాబట్టి మొత్తము శృతుల సంఖ్య 22×3=66 అని చెప్పవచ్చును. వీటినే 'ద్వావింశతి' శృతులందురు. స్త్రీ, పురుషుల స్వరపేటికల ననుసరించి, శృతిని ఎంచుకొని గానము చేసినచో మనోరంజకముగా నుండును. సాధారణముగా పురుషుల శృతి స్త్రీల శృతికన్నా తక్కువగా నుండును.

లయ : తాళము యొక్క దశ ప్రాణములలో లయ ప్రాణము చాలా ముఖ్యమైనది. తాళమును నడిపెడి కాల ప్రమాణమునే 'లయ' అందురు. సాధకులు లయను తప్పని సరిగా గుర్తించి తాళము వేయుట వలన గానము రక్తి కట్టును. శృతి - లయలు సరిగా లేనప్పుడు గానము రంజింపదు. లయను మూడు రకములుగా విభజించిరి. ద్రుతము, మధ్యము, విళంబితము. గాయకునకు ఎంత వీలుగా తాళము వేసుకొని పాడవచ్చునో దానిని ద్రుతమనియు, దానికి రెట్టింపు మధ్యమ మనియు, దానికి రెట్టింపు విళంబితమనదగును. సాధారణ గాత్రకచేరీలలో గాయకులు తమ కనుగుణమైన కాలమును చూచుకొని కచేరి చేయుదురు. భజనలయందు మధ్యము, కోలాటములందు విళంబితములను ఎంచుకొందురు. గాయకునకు శృతి ఎంత ముఖ్యమో, లయ కూడా అంతే ప్రధానము. మంచి శృతి-లయ అబ్బుట దైవదత్తము.

ఈ. సప్త స్వరములు – మూర్ఛన

కీర్తన పాడునప్పుడు స్వర సంహితముగాను, స్వరములను పట్టి రాగ ప్రక్రియను విశదపరచును. ఒక రాగము రక్తి కట్టుటకు, రాగచ్ఛాయను నిబిడీకృతము చేసి పాడవలసి యుంటుంది.

స రి గ మ ప ద ని అనునవి సప్తస్వరములు. వీటిగురించి ఇంతకు ముందు విపులీకరింప బడినది. రాగములోని స్వర స్థాయిలను ఆరోహణ, అవరోహణలో పొందుపరచుటను మూర్ఛన అందురు.

ఉ. స్వర స్థానములు

కీర్తనలో స్వర స్థానములు పాడుట చాలా ముఖ్యమైనది. ప్రతి ఒక్క విద్యార్థిచే బాగుగా అభ్యాసము చేయించవలయును. సంగీతము నందు రాణించవలెనన్న స్వరస్థానగ్రాహక శక్తి బాగుగా అలవరచుకొనవలెను. సప్త స్వరములను ప్రకృతి మరియు వికృతి స్వరములుగా విభజించడమైనది. స్వరములను ఆలపించునప్పుడు దాని మృదుత్వమును, గంభీరతలనుపట్టి స్థానములను

ఏర్పరచియున్నారు. సప్త స్వరములందు, స (షడ్జమము), ప (పంచమము) లకు స్థానాంతరములు లేవు కావున వీనిని ప్రకృతి స్వరములని, వీటినే ఆధార షడ్జమ, పంచమములని అందురు.

రి గ మ ద ని స్వరములు స్థానాంతరము చెందుట వలన వీటిని వికృతి స్వరములందురు. ఈ స్థానములు స్థూలముగా శుద్ధ, చతు శృతి, షట్ శృతిలుగా విభజించపడినవి.

స్వర నామము	స్వర సంకేతము	శుద్ధ-వికృతి స్వర స్థానములు
షడ్జమము	స	శుద్ధ
రిషభము	రి	శుద్ధ - చతుశృతి - షట్‌శృతి
గాంధారము	గ	శుద్ధ - సాధారణ - అంతర
మధ్యమము	మ	శుద్ధ - ప్రతి
పంచమము	ప	శుద్ధ
ధైవతము	ద	శుద్ధ - చతుశృతి - షట్‌శృతి
నిషాదము	ని	శుద్ధ - కైసికి - కాకలి

సాధారణముగా కృతిలో స్వర స్థానములు (శృతులు) వ్రాయునప్పుడు పైవిధముగా వ్రాయుదురు. కొందరు 1, 2, 3 అను సంకేతములను కూడా యిచ్చెదరు.

ఉదా : 1 శు 2 చ 3 ష

షోడశ స్వర స్థానములు : ప్రకృతి స్వరములతో కలసి, స్థానాంతరములు చెందిన స్వరములు (వికృతి) మొత్తము 16 స్వర స్థానములు కలవు. వీటినే షోడశ స్వర స్థానములందురు. వీటిని పట్టిక పూర్వకముగా

స	శు రి	చ రి	శు గా	సా గా	అం గా	శు మ	ప్ర మ	పం	శు ధై	చ ధై	శు ని	కై ని	కా ని
			ష రి								ష ధై		

ద్వాదశ స్వర స్థానములు : కొందరు సంగీత కోవిదులు షట్‌శృతి రిషభమును, షట్‌శృతి ధైవతమును, అంతర గాంధారమును, శుద్ధ నిషాదములను వివాద శృతులుగా పరిగణించి షోడశ స్థానముల నుండి తొలగించి, మిగిలిన 12 శృతులను, ద్వాదశ స్వర స్థానములుగా పరిగణించిరి.

స	శు రి	చ రి	శు గా	సా గాం	శు మ	ప్ర మ	పం	శు ధై	చ ధై	కై ని	కా ని

ఊ. ఆరోహణ

సప్త స్వరములు ఒకదానికొకటి హెచ్చు స్థాయిని కలిగియుండి, గానము చేయునప్పుడు ఒకదానికొకటి కంటే హెచ్చు శబ్ద తరంగములను విడుదల చేయును. (అల్పత్వము నుండి ఘనమునకు)

ఉదా : సరిగమపదని

ఎ. అవరోహణ

సప్తస్వరములు చివరి నుండి అంటే 'ని' దగ్గర నుండి 'స' వరకు తగ్గుస్థాయిని కలిగియుండి గానము చేయునప్పుడు ఒకదానికంటే ఇంకొకటి తగ్గు తరంగములను విడుదల చేయును. (ఘనము నుండి అల్పత్వమునకు)

ఉదా : ని ద ప మ గ రి స

పటపూర్వకంగా



సప్త స్వరములు ఏడు అయినను, షడ్జమమును (స) ఆధారముగా తీసుకొని, ఎనిమిది అక్షరములను పలుకుట ఆనవాయితి. ఇది తాళప్రక్రియలో విశేషముగా రాణించును.

ఏ. స్వరస్థాయి

1. మధ్యస్థాయి

ఆధార షడ్జమము మొదలుకొని, సప్త స్వరములను ఆరోహణ లేక అవరోహణ ద్వారా ఆధార షడ్జమము నొందుటనే స్థాయి అందురు. ఈ స్థాయిని మధ్యమ స్థాయి అందురు. అంటే శబ్ద తరంగములను డెసిబుల్స్‌లో కొలిచెదరు కావున దీనికి మనము × డెసిబుల్స్ అనుకొందుము. ఈ స్థాయికి క్రింద రెండు స్థాయిలు కలవు.

2. మంద్ర స్థాయి

మధ్యమ స్థాయికి ఒక స్థాయి తగ్గించి పాడటము అంటే - 1 × డెసిబుల్స్ అన్నమాట. దీనికి సంకేతము స్వరములకు క్రింద ఒక చుక్క పెట్టుట.

స	రి	గ	మ	ప	ద	ని
•	•	•	•	•	•	•

3. అనుమంద్ర స్థాయి

మధ్యమ స్థాయికి రెండు స్థాయిలు తగ్గించి పాడుట. అనగా - 2 × డెసిబుల్స్. దీనికి సంకేతము స్వరముల క్రింద రెండు (జంట) చుక్కలను పెట్టుట.

స	రి	గ	మ	ప	ద	ని
••	••	••	••	••	••	••

4. తారాస్థాయి

మధ్యమ స్థాయినుండి ఒక స్థాయిని పెంచి స్వరములు పాడుట. అంటే + 2 × డెసిబుల్స్. దీనికి సంకేతము స్వరములపై ఒక చుక్క పెట్టుట.

స రి గ మ ప ద ని

5. అతి తారాస్థాయి

మధ్యమ స్థాయినుండి రెండు స్థాయిలు పెంచి స్వరములు పాడుట. అంటే + 3 × డెసిబుల్స్. దీనికి సంకేతము స్వరములపై జంట చుక్కలను పెట్టుట.

స రి గ మ ప ద ని

ఐ. ఆవర్తనము

కీర్తన పాడునప్పుడు కాలపరిమితికి లోబడి తాళము వేయుదురు. తాళములోని అంగములన్నియు ఒకసారి వేయుటను ఆవర్తనము అందురు.

ఉదా : రూపక తాళము : ఒక దృతము ననుసరించు ఒక లఘువు : ఇది ఒక ఆవర్తనము.

ఉదా : గగ । పాపా ॥
వర । వీణా ॥

ఒ. ధాతువు

కీర్తనలోని స్వర రచనను ధాతువందురు.

ఓ. మాతువు

కీర్తనలోని సాహిత్య భాగమును మాతువందురు.

ఉదా :

ధాతువు : గగ । పాపా ॥ దప । సాసా ॥
మాతువు : వర । వీణా ॥ మృదు । పాణీ ॥

ఔ. తౌర్య త్రికమం

గాత్రము, వాయిద్యము, నాట్యముల కలయికనే తౌర్యత్రికమందురు.

5. కీర్తన పాడు కాలపరిమితి

అ. ప్రధమ కాలము

ఒక హ్రస్వాక్షర కాలములో పాడిన, దానిని ప్రధమ కాలమందురు. దీనికే విళంబిత కాలమని మరియొక పేరు

ఉదా : స రి గ మ (4 అక్షర కాలము)

ఆ. ద్వితీయ కాలము

ప్రధమ కాలమందలి హ్రస్వాక్షర కాలమందు రెట్టింపు అక్షరములను పాడుట ద్వితీయ కాలమని లేక మధ్యమ కాలమని అందురు. వీటిలో రెండు హ్రస్వక్షరములు కలిపి క్రింద గీత గీచిన అది ద్వితీయ కాలమందు ఒక అక్షర కాలమునకు సమానము.

ఉదా : సరి గమ (ఒక అక్షర కాలము)

ఇ. తృతీయ కాలము

ద్వితీయ కాలమందలి ఒక అక్షర కాలమునకు అనగా 'సరి' కు రెట్టింపు అక్షరములు పాడుట : దీనినే దురిత కాలము లేక ధ్రుత కాలమని కూడా అందురు.

ఉదా : సరిగమ (ఒక అక్షరకాలము)

6. తాళము - దాని ప్రాముఖ్యత

కాలమును తెలియచేయు కొలతనే తాళము అందురు. గాత్రమునందు చేతి వ్రేళ్ళను అనునయించుచూ కాలగతిని లెక్కవేయుదురు. అంతేగాక తాళయంత్రమునుపయోగించి కూడా కీర్తనను పాడవచ్చును. వీటిని ముఖ్యముగా నృత్యమందు, నట్టువాంగమందు నుపయోగించెదరు. తాళములను కర్రలతోగాని, లోహములతో గాని చేయుదురు.

కీర్తన పాడునప్పుడు కీర్తన నడక తాళము ననుసరించి యుండుటవలన రక్తి కట్టును. తాళము అస్తవ్యస్తముగా యున్న రాగచ్ఛాయరాక, అపశృతులతో కీర్తన మనోరంజకముగా నుండదు.

అ. సప్త తాళములు

తాళము వేయు పద్ధతులు 7. వీటినే సప్త తాళములందురు. సంగీతమునందు స్వరముల ననుసరించి కీర్తన పాడెదము. ఆ విధముగనే కీర్తనను తాళములకు అన్వయించి పాడవలెను. కీర్తనలోని లఘువు, ద్రుతములను మనసునందుంచుకొని తాళము వేయుచు, స్వరములనను సరించి కీర్తనను పాడవలెను. సప్త తాళములు, మరియు ఒక ఆవర్తనము నందలి అంగములను క్రింద పట్టికలో చూడవచ్చును.

వ.సం.	తాళము పేరు	ఒక ఆవర్తనమునందలి అంగముల సంకేతములు
1.	ధృవతాళము	$I_4 O_2 I_4 I_4$
2.	మధ్యతాళము	$I_4 O_2 I_4$
3.	రూపకతాళము	$O_2 I_4$
4.	ఝంపెతాళము	$I_7 O_1 O_2$ (O_1 = అనుద్రుతము)
5.	త్రిపుటతాళము	$I_3 O_2 O_2$
6.	అటతాళము	$I_5 I_5 O_2 O_2$
7.	ఏకతాళము	I_4

గమనిక : I_4 అంటే ఒక దెబ్బవేసి, చిటికెన వేలు నుండి మధ్య వేలుదాకా లెక్కించవలెను.

I_3 ఒక దెబ్బ 2 వేళ్ళ లెక్క

I_4 ఒక దెబ్బ 3 వేళ్ళ లెక్క

I_5 ఒక దెబ్బ 4 వేళ్ళ లెక్క

I_7 ఒక దెబ్బ 6 వేళ్ళ లెక్క

O_1 ఒక దెబ్బ మాత్రం

O_2 ఒక దెబ్బ + ఒక ఊసి

దెబ్బ : అరచేతిని కొట్టుట

ఊసి : అరచేతిని త్రిప్పి కొట్టుట

అయితే ఒక లఘువునకు ఒక దెబ్బ మరియు వేళ్ళలెక్క మారుటలో తాళగతిలో మార్పు వచ్చును. వాటిని జాతులు అందురు. ఇందులో పంచ జాతులు కలవు. వాటిని, వాటి వేళ్ళ లెక్క క్రింద గమనించగలరు.

వ.సం.	తాళజాతి	లఘువులోని కదలికలు	
1.	చతరస్ర జాతి	1+3 = 4	ఒక దెబ్బ 3 వేళ్ళు
2.	తిశ్ర జాతి	1+2 = 3	ఒక దెబ్బ 2 వేళ్ళు
3.	మిశ్ర జాతి	1+6 = 7	ఒక దెబ్బ 6 వేళ్ళు
4.	ఖండ జాతి	1+4 = 5	ఒక దెబ్బ 4 వేళ్ళు
5.	సంకీర్ణ జాతి	1+8 = 9	ఒక దెబ్బ 8 వేళ్ళు

7. 35 తాళముల పట్టిక

సంగీతమునందు కాల ప్రమాణమునకు సూచికగా నుపయోగించునది తాళము. పాటయొక్క కాల ప్రమాణమును చేతితో దెబ్బకొట్టి వేళ్ళతో నెంచుట వల్లగాని, తాళ యంత్రముల నుపయోగించి గాని తెలుసుకొనవచ్చును. తాళములు 7 రకములు. వీటినే సప్త తాళములందురు. జాతి ననుసరించి లఘువునకు నిర్దేశిత అక్షరములను పాడవలయును. ఈ 7 తాళములు లఘువు అను అంగమునకు సంబంధము కలిగి యున్నది కావున 7×5=35 తాళములగు చున్నవి. దీనినే పంచ త్రింశతి తాళములందురు. ఒక్కొక్క తాళముకు ఒక్కొక్క జాతిలో ఒక్కొక్క పేరు పెట్టిరి. ఈ క్రింది పట్టికలో చూడవచ్చును.

35 తాళముల పట్టిక

తాళము / జాతి	ధ్రువ 1011	మత్య 101	రూపక 01	ఝంపె 100	తిపుట 100	అట 1100	ఏక 1
చతురస్ర	4+2+4+4 = 14 శ్రీకర	4+2+4 = 10 సమ	2+4 = 6 పత్తి	4+1+2 = 7 మధుర	4+2+2 = 8 ఆది	4+4+2+2 =12 లేఖ	4 = 4 మాన
తిశ్ర	3+2+3+3 = 11 మణి	3+2+3 = 8 సార	2+3 = 5 చక్ర	3+1+2 = 7 కదంబ	3+2+2 = 7 శంఖ	3+3+2+2 =10 గుప్త	3 = 3 సుధ
మిశ్ర	7+2+7+7 = 23 పూర్ణ	7+2+7 = 16 ఉదీర్ణ	2+7 = 9 కుల	7+1+2 = 10 సుర	7+2+2 = 11 లీల	7+7+2+2 =16 లోయ	7 = 7 రాగ
ఖండ	5+2+5+5 = 17 ప్రమాణ	5+2+5 = 12 ఉదయ	2+5 = 7 రాజ	5+1+2 = 8 చణ	5+2+2 = 9 దుష్కర	5+5+2+2 =14 విదళ	5 = 5 రత
సంకీర్ణ	9+2+9+9 = 29 భువన	9+2+9 = 20 రావ	2+9 = 11 బిందు	9+1+2 = 12 కర	9+2+2 = 13 భోగ	9+9+2+2 =22 ధీర	9 = 9 వసు

8. నాదము - దాని ప్రాముఖ్యత

నాదము అనగా మానవుని కంఠమునుండి గాని, సంగీత ధ్వని పరికరము నుండి గాని, ప్రకృతి సిద్ధముగా వెలువరించబడిన శబ్దము. 'న' అంటే ప్రాణమనియు, 'ద' అంటే అగ్ని అనియు అర్థము. అనగా ప్రాణము + అగ్ని సంయోగమే నాదము. మనుష్యుని శరీరములోనున్న షట్చక్రములలో గుదము క్రిందుగా నున్న మూలాధార చక్రమునందు గల చతుర్దశ దళములకు బ్రహ్మగ్రంధి అని పేరు. ఈ గ్రంధిలోని ప్రాణము అగ్నిచే ప్రేరేపింపబడిన ప్రాణవాయువు మణిపూరక చక్రం (నాభి), అనాహత చక్రం (హృదయము), విశుద్ధి చక్రం (కంఠం), ఆజ్ఞాచక్రం (ముఖము), సహస్రార చక్రం (శిరస్సు) ద్వారా బయటకు వెడలునప్పుడు నాదము జనించును. మూలాధారములో మొదలైన సూక్ష్మాతి సూక్ష్మ అగ్ని, మణిపూరక మందు అతి సూక్ష్మ నాదముగాను, అనాహతమందు, సూక్ష్మముగాను, విశుద్ధియందు పుష్టముగాను, ముఖము నందు కృత్రిమముగాను, సహస్రారమందు అపుష్టముగాను చెప్పబడినది.

నాదోత్పత్తిలో (సంగీతములో) చక్రముల ప్రాధాన్యత:

1. మూలాధార చక్రం - ప్రాణాగ్నిచే ప్రేరేపింపబడును
2. స్వాధిష్టాన చక్రం - సృజనాత్మక శక్తి
3. మణిపూరక చక్రం - సంతృప్తి
4. అనాహత చక్రం - ప్రేమ తత్వము
5. విశుద్ధి చక్రం - సాక్షీ తత్వము
6. ఆజ్ఞా చక్రం - క్షమా తత్వము
7. సహస్రార చక్రం - సామూహిక తత్వము



సాహిత్యము పాడునప్పుడు భావ ప్రకటన చాలా ముఖ్యము. వీటి వలన సంతోషము, విచారము, దు:ఖము, విపరీత దు:ఖములను ప్రకటన చేయుటలో ముఖ్య పాత్ర పోషించును. త్యాగరాజ స్వామి, పైన చెప్పిన ప్రక్రియలన్నియు తన గళమునందు వినిపించి, సంగీత సాహిత్యలోకములకు అతి విలువైన కానుకగా అందించిరి. అందుకనే ఆయనకు 'నాదబ్రహ్మ' అని పేరు.

ఈ నాదమును రెండు తరగతులుగా విభజించిరి.

అ. ఆహత నాదము

ఆ. అనాహత నాదము

(అ) ఆహత నాదము

మనోరంజకమైనదియును, పండిత పామరులను అలరించును, సంగీత వ్యాకరణము ననుసరించి యుండును.

(ఆ) అనాహత నాదము

గురు ముఖమున ఉపదేశింపబడును. మనోరంజకముగా నుండదు. ముక్తియే ప్రధానముగా భావించే యోగులు ఉపాసించెదరు.

9. మేళకర్త రాగముల పుట్టుక

స్వరము అనగా తనంతట తాను (స్వకీయముగా) రంజింపచేయునదని అర్థము. అటువంటి సప్తస్వరముల ('సరిగమపదని') ప్రకృతి-వికృతి స్వరస్థానముల కలయికవలన ఏర్పరచిన రాగములను మేళకర్త రాగములందురు. ఈ మేళకర్త రాగములు 72. ఇందులో 1 నుండి 36వ మేళకర్త వరకు శుద్ధ మధ్యమ మేళకర్తలనియు, 37 నుండి 72 వరకుకల మేళకర్తలను ప్రతిమధ్యమ మేళకర్తలని నిర్వచించిరి. ఈ శుద్ధ-ప్రతిమధ్యమ మేళకర్తలలోను స్వరస్థానములు (ఒక్క మధ్యమము తప్పించి) ఒకేవిధముగా నుండును. అనగా 1వ మేళకర్త స్వరస్థానములు 37వ మేళకర్త స్వరస్థానములు మధ్యమము తప్ప ఒకేవిధముగా నుండును. 1 నుండి 36వ మేళకర్తలలోని మధ్యమము శుద్ధ మధ్యమముగాను, 37 నుండి 72వ మేళకర్తలలోని మధ్యమము ప్రతిమధ్యమముగా నుండును. అయితే 1 నుండి 36, 37 నుండి 72 మేళకర్తల రాగములు వేరు వేరుగానుండును. ఈ రాగములు నిర్దిష్టమైన లక్షణములు కలిగియుండును. ఇటువంటివి 13 లక్షణములని లక్షణకారులు నిర్దేశించిరి.

10. రాగత్రయోదశ లక్షణములు

ప్రతి రాగము సప్తస్వరములచే అలంకరింపబడినదై, శ్రోతలకు మనోరంజకముగా నుండును. రాగము రక్తి కట్టించుటకు వాగ్గేయకారులు అనేక రాగలక్షణములను నిర్దేశించిరి. అట్టివారిలో సార్ఙ్గదేవుడు 13 లక్షణములను విశదపరచగా, భరతముని 10 లక్షణములను విశదీకరించెను. ఈ 13 లక్షణములనే రాగత్రయోదశ లక్షణములుగా ప్రస్తుతించబడినవి. అవి 1) గ్రహము 2) అంశము 3) మంద్రము 4) తారము 5) న్యాసము 6) అపన్యాసము 7) సన్యాసము 8) విన్యాసము 9) బహుత్వము 9(1) అలంఘనము 9(2) అభ్యాసము 10) అల్పత్వము 10(1) లంఘనము 10(2) అనభ్యాసము 11) ఔడవము 12) షాడవము 13) అంతరమార్గములు. వీటి వివరణను క్రింద ఇవ్వబడినది.

1) గ్రహము

ఒక రాగమును పాడునప్పుడు, దానిలోని సంగతులు పాడుటకు ఏ స్వరముతో ఆరంభింపబడినదో, ఆ స్వరమును గ్రహ స్వరము అందురు. నిర్దేశించిన గ్రహస్వరమునందే తప్పనిసరిగా రాగమును పాడవలయును.

2) అంశము

ఒక రాగకళను చూపుటకై, అందులోని సంగతులు పాడునప్పుడు, మనోరంజకము కొరకై, పలుమార్లు పాడు స్వరమును 'అంశము' అందురు. దీనికే అంశస్వరమనియు, జీవస్వరమనియు పేర్లు. ఈ అంశస్వరము రాగమునందు రాజువలె ప్రకాశించు చుండెను.

3) మంద్రము లేక మంద్రస్థాయి స్వరము

మధ్యస్థాయికి ఒక స్థాయి తగ్గించి పాడుటకు మంద్రస్థాయి ఆలాపన అందురు. ఇది ఒకరకమైన గమకము. రాగరక్తికొరకు ఇటువంటి గమకములను ఎంచుకొనుట పరిపాటి.

4) తారము లేక తారాస్థాయి స్వరములు

మధ్యమస్థాయి నుండి ఒక స్థాయి పెంచి పాడుటను తారము లేక తారాస్థాయి అందురు. ఇదికూడ ఒకరకమైన గమకము. రాగరక్తికై మంద్ర - తారాస్థాయిలను ఎంచుకొనుట పరిపాటి.

5) న్యాసము

రాగమును పాడిన తర్వాత, చివరి సంగతిలోని ముగింపు స్వరమును 'న్యాసస్వర'మందురు.

6) అపన్యాసములు

ఒక రాగమునుగాని, దానియందలి సంగతులు గాని పాడునప్పుడు, మధ్య ముగింపు స్వరమును అపన్యాసమందురు. న్యాసము చివరి ముగింపు స్వరమైతే, అపన్యాసము మధ్య ముగింపు స్వరమని గుర్తించవలెను. భరతుడు అపన్యాసమునందు 1. సన్యాసము 2. విన్యాసములు నిక్షిప్తమైనవని తెలిపెను.

7) సన్యాసము

ఒక రాగమును మనోరంజకముగా పాడునప్పుడు, రాగరక్తికై దానిని పలు భాగములుగా చేసి, ఒక్కొక్క భాగమును ముగించు స్వరమును 'సన్యాస'స్వరమందురు.

8) విన్యాసము

ఒక రాగముయొక్క కళలను చూపుటకు దానిని పలు భాగములుగా విభజించి ఆ భాగములో పలుమార్లు వచ్చు స్వరమును విన్యాస స్వరమందురు. మనోరంజకముగా విన్యాస స్వరములు వేసి పాడు ప్రక్రియను విన్యాసమందురు.

9) బహుత్వము

ఒక రాగమునందు ఒకే స్వరమును పలుమార్లు పాడుటను బహుత్వమందురు. ఇందులో అలంఘనము, అభ్యాసమని రెండు విధములు గలవు.

9(1) అలంఘనము

ఒక రాగమును పాడునప్పుడు, ఒక స్వరమును విడువక పదే పదే పాడు పద్ధతిని అలంఘనమందురు.

9(2) అభ్యాసము

ఒక రాగమునునందు ఒకే స్వరమును ఎడతెరిపిలేక ఏకధాటిగా గాని, మాటిమాటికి మార్చి పాడు విధానమును అభ్యాసమందురు.

10) అల్పత్వము

ఒక రాగమునందు ఒక స్వరమును అతి తక్కువగా ఉచ్చరించి పాడుటను అల్పత్వమందురు. ఇందు లంఘనము, అనభ్యాసమని రెండు విధములుగలవు. ఇది బహుత్వమునకు ప్రతి దిశలో నుండును.

10(1) లంఘనము

ఒక రాగమును పాడునప్పుడు ఒక స్వరమును, ఏమాత్రము నుపయోగించక దాని మీదిస్వరముపై లంఘించుటను (దాటుటను) లంఘనమందురు.

10(2) అనభ్యాసము

ఒక రాగమునందు ఒక స్వరమును ఒక సమయమందునే ఉపయోగించుటను అనభ్యాస మందురు.

11) ఔడవము

ఔడవమనగా ఐదు స్వరముల కూడిక. ఆరోహణయందుగాని అవరోహణయందుగాని ఐదు స్వరములుండుటను ఔడవ రాగమందురు.

12) షాడవము

షాడవమనగా ఆరు స్వరముల కూడిక. ఒక ఆరోహణయందుగాని లేక అవరోహణయందుగాని ఆరు స్వరములుండుట. ఆరోహణ-అవరోహణయందు 6 స్వరములున్న యెడల దానిని షాడవ రాగమందురు. రాగములనుబట్టి వాటి మూర్ఛనలో ఆరోహణ - అవరోహణలయందు సప్తస్వరములుగాని, షాడవములుగాని, ఔడవములుగాని యుండును.

13) భాషాంగ రాగము (అంతర మార్గము)

రాగ మూర్ఛనలో, అన్యస్వరమును రాగరంజితమునకై చేర్చి, అలంకారము సరిగా నుండునట్లు చేయు క్రియను భాషాంగ రాగము లేక అంతరమార్గమని యందురు.

14) రాగాంగ రాగము

సంపూర్ణమైన రాగమందు ఆరోహణ-అవరోహణయందు ఒకే స్వర స్థానములున్న జన్యరాగములను రాగాంగ రాగములందురు.

11. వాది స్వరము లక్షణములు

వాది స్వరమనగా ఒక రాగములోని జీవస్వరము వలె పలుమార్లు ప్రయోగింపబడిన స్వరము. దీనినే అంశస్వరమని కూడ అందురు. ఇది రాజువలె ప్రకాశించును.

ఉదా : స రి గ మ ప ద ని స·
రి గ మ ప ద ని స·
గ మ ప ద ని స·
మ ప ద ని స·
ప ద ని స·
ద ని స·
ని స·
స·

వాది స్వరము నాలుగు లక్షణములును కలిగియుండును.

1. సంవాది స్వరము

ఒక రాగమునందు రెండు స్వరముల మధ్యన 8 గాని, 12 గాని శృతులు ఉన్నచో అట్టి స్వరములను సంవాది స్వరములుగా గ్రహించవలెను. ఇవి మంత్రివలె ప్రకాశించుచుండును.

ఉదా :

శుద్ధ రిషభము - శుద్ధ దైవతము

సాధారణ గాంధారము - కైశికి నిషాదము

2. వివాది స్వరము

ఒక రాగమునందు రెండు స్వరముల మధ్య ఒక్క శృతి యున్నచో, ఆ రెండు స్వరములు ఒకదానికొకటి వివాదులగును. ఇవి శత్రువువలె రాణించును.

ఉదా:

శుద్ధ రిషభము - శుద్ధ గాంధారము

శుద్ధ దైవతము - శుద్ధ నిషాదము

3. అనువాది స్వరము

ఒక రాగము నందు, వాది, వివాది, సంవాది కాని స్వరములను అనువాది స్వరములందురు. ఇవి సేవకుని వలె రాణించును.

4. సంవాది ద్వయము

షడ్జమమునకు శుద్ధ మధ్యమము, షడ్జమమునకు పంచమము సంవాదులగుటచే, ఈ రెండింటిని సంవాది ద్వయమందురు.

12. ద్వావింశతి శృతిజాతి పధకము

శృతుల సంఖ్య	స్వరస్థానము	శృతి స్థానము	శృతుల పేర్లు	జాతులు
1	స	1	తీవ్ర	దీప్త
2	స	2	కుముద్వతి	ఆయత
3	స	3	మంద	మృదు
4	స	4	ఛందోవతి	మధ్య
5	రి	1	దయావతి	కరుణ
6	రి	2	రంజని	మధ్య
7	రి	3	రతిక	మృదు
8	గ	1	రౌద్రి	దీప్త
9	గ	2	క్రోధ	ఆయత

శృతుల సంఖ్య	స్వరస్థానము	శృతి స్థానము	శృతుల పేర్లు	జాతులు
10	మ	1	వజ్రిక	దీప్త
11	మ	2	ప్రసారిణి	ఆయత
12	మ	3	ప్రీతి	మృదు
13	మ	4	మార్జని	మధ్య
14	ప	1	క్షితి	మృదు
15	ప	2	రక్త	మధ్య
16	ప	3	సందీపిని	ఆయత
17	ప	4	ఆలాపిని	కరుణ
18	ద	1	మదంతి	కరుణ
19	ద	2	రోహిణి	ఆయత
20	ద	3	రమ్య	మధ్య
21	ని	1	ఉగ్ర	దీప్త
22	ని	2	క్షోభిణి	మధ్య

నియత శృతులు

షడ్జమమందు 4వ శృతి
రిషభమందు 7వ శృతి
గాంధారమందు 9వ శృతి
మధ్యమమందు 13వ శృతి
పంచమమందు 17వ శృతి
దైవతమునందు 20వ శృతి
నిషాదమునందు 22వ శృతి

శుద్ధ-వికృత స్వర లక్షణములు

స్వరములు శుద్ధ స్వరములని, వికృత స్వరములని రెండు రకములు. శుద్ధములనగా నియతములైన శృతులతో కూడుకొన్న స్వరములు. వికృతములనగా నియత శృతులకు ఎక్కువగాని తక్కువగాని అయిన స్వరములు.

13. సంగీత రచన లక్షణములు

వాగ్గేయకారులు సంగీత సాధకులను దృష్టియందుంచుకొని అతి సులభశైలిలో రచనలు మొదలుపెట్టి, పోనుపోను గాయకుని సంగీత సాధనను ఒక మెట్టు నుండి ఇంకొక మెట్టుపైకి ఎక్కించి, సాధకులను తారాస్థాయికి ఎక్కించుటకు చేసిన రచనలే ఇవి. వీటియందు మొదటిదిగా 1) పిళ్ళారి గీతములు 2) జతి స్వరములు 3) స్వర జతులు 4) వర్ణములు 5) కీర్తనలు 6) కృతులు 7) పదములు 8) జావళీలు 9) తిల్లానలు 10) అష్టపదులు 11) తరంగములు 12) దరువు 13) ప్రబంధము 14) తత్వములు 15) అభంగములు. వీటిని అనేక రాగములందు పదబంధన-విచ్ఛేదనములతో సంగీత వ్యాకరణమున కనుగుణముగా, భాషాపటిమతో, నిగూఢార్థములతో జరిగిన ఒక గొప్ప ప్రక్రియ.

1. గీతములు :- రచన లక్షణములు

గీతములనగా పాటలుయని అర్థము. సంగీతము నేర్చుకొనువారు మొదట సరళీ స్వరములు, జంట స్వరములు, దాటు స్వరములు, హెచ్చు స్థాయి స్వరములు, అలంకారములు నేర్చుకొనిన తర్వాత గీతములను నేర్చుకొందురు.

ఇందలి సంగీతము మిక్కిలి సులభశైలిలో నుండి, రాగముయొక్క మాధుర్యము ప్రస్ఫుటముగా కనిపించును. ప్రతి స్వరమునకు సరిపడ సాహిత్యాక్షరము యుండి, సాధకునికి మంచి ఉత్తేజమునిచ్చి, సాధనకు సులభముగా నుండును. గీతములలో పల్లవి, అనుపల్లవి, చరణములవంటి భాగములుండవు. ముఖ్యముగా గీతములందు దైవస్తుతి గాని గురుస్తుతి గాని యుండును. వీటియందు 1) సాధారణ గీతములని 2) లక్షణ గీతములని రెండు రకములు.

సాధారణ గీతములు : గీతములయొక్క అన్ని లక్షణములు కలిగియుండును. ఇవి సామాన్య గీతములు, లక్ష్య గీతములు లేక సంచారి గీతములుగా ప్రసిద్ధి నొందినవి. ఇవి బాండీర, తెలుగు, కన్నడ, సంస్కృత భాషలయందు రచింపబడినవి.

లక్షణ గీతములు : ఇవి సామాన్య గీతములయొక్క లక్షణములను కలిగియుండును. సాహిత్యమునందు మాత్రమే కొంతమేర వైవిధ్యముగా నుండును. లక్షణ గీతములలోని సాహిత్యము దైవ స్తోత్రముతోగాని ఒక మహనీయుని స్తుతించుచూగాని యుండును., ఆ రాగ సంపూర్ణ లక్షణములను సాహిత్యమునందు చేర్చి రచించు రచనలను లక్షణ గీతములందురు.

గీతము యొక్క ముఖ్య లక్షణములు

1. ఇందు పల్లవి, అనుపల్లవి, చరణములు అను పూర్వాంగముల గాని ఉత్తరాంగములు గాని యుండవు.
2. క్లిష్టమైన రాగ సంచారములు స్వర ప్రస్తారములు సంగ్రహముగా నుండును.
3. రాగ స్వరములు, రాగ ప్రకటన, భావ ప్రకటన బాగుండును.
4. లయ సామాన్యముగా నుండి, విద్యార్థులకు అనువుగా నేర్చుకొనుటకు సులభముగా యుండును.
5. ప్రతిస్వరమునకు సాహిత్యాక్షరముండును.
6. ఈ సాహిత్యము దైవ సంబంధమైనదిగా నుండును.

7. గీతము రక్తి కట్టుటకు కొన్ని అలంకారములు వాగ్గేయకారులు వాడిరి.
8. రాగ ప్రస్తారమునకు కొంత వీలుగా యుండును.
9. సంస్కృత శ్లోకములను గీతములుగా గానము చేయవచ్చును.
10. గీతములు మొదట బాండీర భాషలోను, తదుపరి సంస్కృతము, తెలుగు, కన్నడ భాషలలో వ్రాయబడినవి.

ఉదా: వరవీణ -- మోహనరాగం -- రూపకతాళం
శ్రీగణనాథం -- మలహరి -- రూపకతాళం
శ్రీగోవింద -- శంకరాభరణం -- మత్యతాళం
కమలజొదళ -- కల్యాణి -- త్రిపుటతాళం
ఆనలేకర -- శుద్ధ సావేరి -- త్రిపుటతాళం

లక్షణగీతం :
ఆరేరె జయజయ -- శ్రీరంజని -- త్రిపుటతాళం
రవికోటి తేజ -- మాయా మాళవ గౌళ -- మత్యతాళం

2. స్వర పల్లవి / జతి స్వరము

పిళ్ళారి గీతములను నేర్చుకొనిన తదుపరి, స్వర పల్లవిని నేర్చుకొందురు.

స్వర పల్లవి లక్షణములు :

1. వినుటకు చాలా ఇంపుగా నుండును.
2. వీటియందు పల్లవి, అనుపల్లవి, చరణములుండును.
3. సంగీతము తప్ప సాహిత్యముండదు.
4. నృత్యము చేయుటకు అనువైన రచనలు.
5. నడక తాన వర్ణములను పోలి, మధ్యమ కాలములో నుండును.
6. జతి స్వరమునే స్వర పల్లవిగా వ్యవహరింతురు.
7. ఇందు సంగీతము జీవము కలదియై యుండును.
8. నృత్య ప్రస్తారక్రమములందు ఉత్తరాంగమును పలుమార్లు పలు విధములుగా పాడుటచే దీనికి స్వరపల్లవి అని పేరు వచ్చినది.
9. స్వాతి తిరునాళ్, పొన్నయ్య పిళ్ళై, వడివేలు పిళ్ళై ప్రఖ్యాతిగాంచిన వాగ్గేయకారులు.

హిందోళం - ఆదితాళం
బిలహరి - ఆదితాళం
వసంత - చాపుతాళం
కేదారగేళ - ఆదితాళం
మోహన - ఆదితాళం

3. స్వరజతి :- రచన లక్షణములు

వరుస క్రమములో పిళ్ళారి గీతములు, స్వరపల్లవుల తర్వాత స్వరజతిని అభ్యాసము చేయుదురు. ఈ స్వరజతియందు పల్లవి, అనుపల్లవి, చరణములు యుండును. వీటిలో తక, తకిట, తరికిట మొదలగు జతులు సాహిత్యమునందుండి గానము చేయునప్పుడు గాయకునికి, శ్రోతలకు మనోరంజకముగా నుండును. వీటియందు దైవస్తుతినిగాని, వీరగాథలనుగాని ప్రమాణముగా తీసుకొని రచనలు సాగించిరి. ముఖ్యముగా స్వరజతులను నృత్య సంగీతమునందుపయోగించెదరు. అభినయమునకు ఎంతగానో రాణించును. స్వరజతిగానము చేయునప్పుడు మొదట పల్లవి, అనుపల్లవి, స్వర సాహిత్యములను పాడి, తరువాత చరణములో మొదటి ఆవర్తముయొక్క స్వర సాహిత్యము పాడి మరల పల్లవిని పాడవలయును. తదుపరి 2, 3, 4 చరణముల స్వర సాహిత్యము పాడి, పల్లవి పాడి ముగించవలెను.

ఉదా : భైరవి రాగములో శ్యామశాస్త్రి రచించిన స్వరజతియందు 8 చరణములు 8 స్వరములతో ప్రారంభగును.

కామాక్షీ అంబ కంచి - భైరవి - మిశ్రచాపు

కామాక్షీ నీపదయుగ - యదుకుల కాంభోజి - చాపు

రావే హిమగిరి - తోడి - ఆదితాళం

వాగ్గేయకారులు: శ్యామశాస్త్రి, పచ్చిమిరియం ఆది అప్పయ్య, పొన్నయ పిళ్లై, స్వాతి తిరునాళ్ మొదలగువారు

4. వర్ణములు :- రచన లక్షణములు

వర్ణములు లేక తానవర్ణములను స్వరజతులను అభ్యసించిన తరువాత అభ్యసించెదరు. తానము అనగా స్వర ప్రస్థారము. వర్ణములు రచించిన వాగ్గేయకారులు చాల అరుదు.

వర్ణములు రచించుటకు వాగ్గేయకారునికి రాగము మీదను, సంగీత వ్యాకరణము మీద మంచి జ్ఞానము కలిగియుండవలెను. వర్ణములు రాగభరితమై, గంభీరముగాను, మనోరంజకముగాను, రాగ ప్రస్థారమునకు అనువైనదిగా యుండును. వీటియందు విశిష్టమైన సంగీత ప్రస్థారము కలిగియుండి, సాహిత్యము అతి తక్కువగా యుండును. గాత్ర కచ్చేరిలయందు మొదటగా దైవస్తుతి చేసిన పిదప, తప్పనిసరిగా తానవర్ణము పాడెదరు. దీనివలన రాగాలాపనయందు, స్వర ప్రస్థారములందు మంచి పట్టు లభించి, తదుపరి గానకచ్చేరి మృదు మధురముగా సాగును. తానవర్ణములందు భక్తి లేక శృంగార రసపోషణ కలిగి మనోరంజకముగానుండును.

వర్ణములయందు పూర్వాంగము మరియు ఉత్తరాంగములుండును. పూర్వాంగమునందు పల్లవి, అనుపల్లవి, ముక్తాయి అను భాగములుండును. ఉత్తరాంగమునందు చరణములు, చరణ స్వరము, చిట్టస్వరము ఉండి వాటి సాహిత్యము అతి తక్కువగాయుండును. ఈ చిట్టస్వరములను చిట్టపల్లవి, లేక ఉపపల్లవి లేక ఎత్తుగడ పల్లవి అని కూడ అందురు.

వర్ణ రచనలయందు అకార, ఇకార, ఉకార, ఎకార, ఓకారములను సాహిత్యముతో చేర్చి రచించెదరు. ఇందలి పల్లవి రెండు ఆవృత్తములుగాను, అను పల్లవి రెండు లేక నాలుగు ఆవృత్తములుగాను, చరణము ఒక ఆవృత్తముగా నుండును. చిట్ట స్వరములు ఒకటి నుండి నాలుగు ఆవృత్తములతో నుండును. వర్ణములలో మూడు రకములు కలవు. 1) పద వర్ణములు 2) పదజతి వర్ణములు 3) రాగమాలికా వర్ణములు.

వర్ణములు రచించిన వాగ్గేయకారులు: 1) వీణ కుప్పయ్యర్ 2) తిరువత్తియ్యూరు త్యాగయ్యర్ 3) పచ్చిమిరియం ఆది అప్పయ్యర్ 4) సుబ్బరామ దీక్షితులు 5) రామస్వామి 6) ముత్తుస్వామి దీక్షితులు 7) పొన్నయ్య పిళ్లై.

వర్ణములు :
1. విరిబోణి - భైరవి - అటతాళం - పచ్చిమిరియం ఆది అప్పయ్య
2. సామినిన్నే - కల్యాణి - ఆదితాళం - వీణా కుప్పయ్యర్
3. జలజాక్షి - హంసధ్వని - ఆదితాళం - మానాంబు చావడి వెంకటసుబ్బయ్య
4. చలమేల - శంకరాభరణం - అటతాళం - స్వాతి తిరునాళ్
5. వనజాక్షి - కల్యాణి - అటతాళం - పల్లవి గోపాలయ్యర్

5. కీర్తన - రచన లక్షణములు

వర్ణముల తరువాత కీర్తనల నభ్యసించెదరు. భక్తిమార్గములో భగవంతుని ప్రస్తుతించుటకు అలవోక పదములతో ఆలపించు గానమునే కీర్తనలనదగును. పదకవిత పితామహుడైన, కీర్తనాచార్యుడు అన్నమయ్య భక్తిమార్గమునందు శ్రీ వేంకటేశ్వరుని మీద అనేకానేక కీర్తనలు రచించెను. వీటియందు ధార్మిక, నైతిక, వైదిక, ఆధ్యాత్మిక, శృంగార, వేదాంత, తార్కిక, సంఘ దురాచారములను ఇతివృత్తములుగా చేసుకొని పరిభాషిక పదములతో, మాండలీకములతో రచనలు సాగించిన మహోన్నత కీర్తనాచార్యులు.

కీర్తనల ముఖ్య లక్షణములు

1. కీర్తనలన్నియును భగవంతుని స్తుతించుట లేక కీర్తించుట కొరకే వ్రాయబడినవి.
2. ఇందు సాహిత్యము ప్రధాన భూమికగాను సంగీతము మిక్కిలి తక్కువగానుండును.
3. కీర్తనలు సాధారణ రాగములో యుండి పండిత పామరులు పాడుకొనుటకు అనువుగానుండును.
4. వీటియందు పల్లవి, చరణములు మాత్రమే యుండి, అనుపల్లవి యుండదు.
5. కీర్తనలయందు సంగీత ప్రధానమైన సంగతులుండవు.
6. కీర్తనలోని పల్లవి ఒకస్థాయిలో నుండి, చరణములన్నియును ఒకే రీతిలోనుండును.
7. కీర్తనలో నెరవల్, స్వర కల్పనకు అవకాశముండదు.
8. కీర్తనలు దేశ, భౌగోళిక, సామాజిక, వేదాంత, వైరాగ్య, శృంగార, భక్తి తత్వముల సారాంశములతో రక్తి కట్టించును.
9. పరిభాషిక పదములతోను మాండలికములతోనుండుట వలన, పండిత పామరులు పాడుకొనుట కనువుగా యుండును.

వాగ్గేయకారులు : అన్నమాచార్యులు, పురంధరదాసు, భద్రాచల రామదాసు, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, సదాశివ బ్రహ్మేంద్రులు.

ఉదా : ముద్దుగారే - కురంజి - ఆదితాళం
నారాయణతే - మధ్యమావతి - రూపకతాళం
లాలి శ్రీకృష్ణయ్య - ద్విజావంతి - ఆదితాళం
శ్రీరామ నీనామమేమి - పంతువరాళి - ఆదితాళం
రామ కోదండరామ - భైరవి - ఆదితాళం

6. కృతులు - రచన లక్షణములు

కృతుల రచనకు త్యాగరాజు ఆద్యుడని చెప్పవచ్చును. భక్తిపారవశ్యముతో భగవంతునియందు లీనమై, సంగీత ప్రాధాన్యమైన రచన కృతియని చెప్పవచ్చును. ఇందు వాగ్గేయకారులు ఇష్టమైన రాగము, తాళము, గతి, శైలి ఎంచుకొని, తనదైన నడకతో రచించెదరు. కృతులలో రాగ, భావ ప్రకటనకు అనంతమైన అవకాశములు కలవు.

కృతియొక్క ముఖ్య లక్షణములు

1. భక్తి, వైరాగ్య, వేదాంత తత్వములను ధాతువుగా తీసుకొని సాగే రచనలు.
2. స్వకీయముగా రాగ ప్రకటనకు, భావ ప్రకటనకు అనువుగా నుండును.
3. సాహిత్యముకన్నా సంగీతము మిక్కిలి ప్రకటితమై యుండును.
4. కృతులను సాధారణ మరియు అపూర్వ రాగములందు రచించిరి.
5. కృతులయందు పూర్వాంగములు మరియు ఉత్తరాంగములుండును.
6. ఉత్తరాంగమును సంగీత స్వర ప్రక్రియలతో గానము చేయుట పరిపాటి. దీనినే సంగతులు వేసి పాడుటయందురు. సంగతులు రాగ ప్రకటనకు, భావ ప్రకటనకు మిక్కిలి అనువుగా యుండి మనోరంజకముగానుండును.
7. కృతియందు 'నెరవల్, స్వరకల్పన' చేసి గాయకుని ప్రతిభను వ్యక్తపరచవచ్చును.
8. కృతులను ఒకరుగాని ఇద్దరుగాని (యుగళ) కలసి పాడెదరు. సామూహిక గానమునకు పనికిరావు.
9. కృతియందు ముఖ్యాంగములుగా పల్లవి, అనుపల్లవి, చరణములుండి, అ ముఖ్యాంగములైన 1) చిట్ట స్వరము 2) శోల్ కట్టు స్వరము 3) స్వర సాహిత్యము 4) స్వరాక్షరము 5) మధ్యమకాల సాహిత్యము 6) మణిప్రవాళ సాహిత్యమను భాగములు కలిగి, మంచి శోభనిచ్చును.
10. కృతి కర్తలు : త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితులు, రామ్నాడ్ శ్రీనివాసాచార్యులు, మైసూరు సదాశివరావు, శ్యామశాస్త్రి, సుబ్బరామశాస్త్రి, స్వాతి తిరునాళ్ మొ॥వారు.

కృతులు ఉదా : జగదానందకారక - నాటరాగం - ఆదితాళం
శ్రీరామ పాదమా - అమృత వాహిని - ఆదితాళం
సామజవరగమన - హిందోళము - ఆదితాళం
రఘువంశ సుధాంబుధిచంద్ర - కదనకుతూహలము - ఆదితాళం
శృంగారలహరి - నీలాంబరి - ఆదితాళం
ఆనందనటనప్రకాశం - కేదార - ఆదితాళం

కృతిలోని అముఖ్యాంగములు

1) చిట్ట స్వరము : చిట్ట స్వరములందు సంగీతమేకాక కొన్నింటియందు సాహిత్యము చేరియుండును. దీనిని చిట్ట స్వర సాహిత్యమందురు. సాధారణముగా చిట్ట స్వరమును 2 లేక 4 ఆవృత్తములలో రచించెదరు. ఇది మధ్యమ కాలములో ఉండి, అనులోమ, విలోమ క్రమములో కూడా పాడెదరు. చిట్ట స్వరమును అనుపల్లవి తర్వాత, చరణముల చివర పాడుట సాంప్రదాయము.

ఉదా : పరిదానమిచ్చితే - బిలహరి - త్రిశ్రరూపకం, రఘువంశ సుదాంబుధి - కదనకుతూహలం - ఆదితాళం

2) సోల్ కట్టు స్వరము : ఇది చిట్ట స్వరములను పోలియున్న రచన అయినను కొన్ని స్వరములకు 'జతు'లను స్వరపరచి, రచించెదరు. అటువంటి రచనలలో స్వరముల బదులు 'జతుల'ను పాడవలయును. దీనిలో సాహిత్యముతో పాడిన, దానిని సోల్ కట్టు స్వర సాహిత్యమందురు. ఈ సోల్ కట్టు స్వర సాహిత్యము ముత్తుస్వామి దీక్షితార్ రచనలయందు కనిపించును.

ఉదా : ఆనంద నటన ప్రకాశం - కేదారం - త్రిపుటతాళం

3) స్వర సాహిత్యము : ఒక కృతిలోని చిట్ట స్వరమునకు సరియగు అర్థమునిచ్చు సాహిత్యము రచింపబడి, వానిక్రింద జతపరచిననప్పుడు, ఆ రెంటిని కలిపి స్వర సాహిత్యమందురు. దీనిని కూడా అనుపల్లవి మరియు చరణముల చివరగా పాడెదరు. ఈ రచనలవలన, కృతికి ఒక రకమైన శోభనిచ్చి, శ్రోతలకానందమగును.

స్వర సాహిత్య రచనలో ముఖ్యులు : శ్యామ శాస్త్రి, సుబ్బరామశాస్త్రి, మైసూరు సదాశివరావు.

ఉదా : ఓ జగదాంబి (ఆనంద భైరవి), జననీ నినువినా (రీతిగౌళి) కృతులందు స్వర సాహిత్యము కానదగును.

4) స్వరాక్షరము : ఇది ఒక సాహిత్య ప్రక్రియ. స్వర రచననుసరించి దానిక్రింది సాహిత్యములో కూడా, పై స్వరములను పోలిన అక్షరములు వచ్చునట్లుగా, అర్థము చెడకుండునట్లు సాగే రచన.

ఉదా : స్వరములు : పదనిద'పాదమా'
సాహిత్యాక్షరము : శ్రీరామ'పాదమా'
వీటిలో శుద్ధ స్వరాక్షరములు, సూచిత స్వరాక్షరములని రెండు రకములు కలవు.

శుద్ధ స్వరాక్షరములు : పైనుండు స్వరములవలె, అచ్చు మార్పులేకుండా, అవే అక్షరములు వచ్చిన వాటిని శుద్ధ స్వరాక్షరములందురు.

సూచిత స్వరాక్షరములు : ధాతువు, మాతువులలోనుండు అక్షరములు ఒకటైనను, అచ్చులలో తేడా కనిపించును. అటువంటి వానిని సూచిత స్వరాక్షరములందురు. ధాతువు నందుండు స్వరమునకు సూచనగా అదే అక్షరముండక దానికి సంబంధించిన అక్షరముండును.

5) మధ్యమకాల సాహిత్యము : కృతియందు ధాతు మాతువులు రెండు మధ్యమకాల సాహిత్యమునందు రచింపబడిన, అట్టివానిని మధ్యమకాల సాహిత్యమందురు. మధ్యమకాల సాహిత్యమును రచించిన వాగ్గేయకారులు త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు.

ఉదా : దీక్షితులుగారి కృతులలో ఈ మధ్యమకాల సాహిత్యము ఎక్కువగా కనిపించును.

వాతాపి గణపితం, స్వామినాథ, త్యాగరాజం భజరే, యోచన కమలలోచన కృతులందు చూడవచ్చును.

6) మణి ప్రవాళ సాహిత్యం : ఒక కృతిలోని సాహిత్యమునందు అచ్చటచ్చట రెండుగాని అంతకంటే ఎక్కువ భాషలతో కూడిన సాహిత్యమును అర్థము చెడకుండునట్లు రచించిన దానిని మణి ప్రవాళ సాహిత్యమనబడును.

స్వాతి తిరునాళ్ మహరాజు, ముత్తుస్వామి దీక్షితుల కృతులలో కానవచ్చును. మణిప్రవాళ సాహిత్యం వలన కృతియొక్క అందము ఇనుమడించి శ్రోతలకు ఆనందము కలుగజేయును.

ఉదా : అలర్ శరపరితాపం చోల్వతి, వెంకటాచలపతే

7. దరువు - రచన లక్షణములు

శృంగార రసప్రధాన ఇతివృత్తంగాకల రచనలనే దరువలందురు. ఇవి దరిదాపు పదమును పోలియున్నను, సాహిత్య ప్రక్రియయందు ఒక విశిష్ట స్థానమునందుండి మనోరంజకముగా నుండును. కృతుల వలెనే వీటియందు పల్లవి, అనుపల్లవి, చరణములు (1 నుండి 3 వరకు) ఉండును. దరువులను ముఖ్యముగా యక్షగానమందును, గేయ, నృత్య నాటకములందు ప్రవేశపెట్టి రక్తి కట్టించెదరు. ఈ దరువు సాహిత్యమునందు మాండలికములుండి మంచి రక్తి కట్టించును.

దరువులు 5 రకములుగా విభజించిరి.

1) తిల్లాన దరువు: తిల్లాన దరువు స్వర సాహిత్యముతోను, జతులతోనుకూడి తిల్లాన లక్షణములు కలిగియుండును. సాహిత్యమునందు దైవస్తుతి కలదై పల్లవి, అనుపల్లవి, చరణములతో రంజింప చేయును. తిల్లాన దరువు మంచి ఉత్సాహముతో పాడిన, పండిత పామరులకు మనోరంజకముగా నుండును.

2) ప్రవేశ దరువు: గేయ నాటకములందు, యక్షగానములయందు, ముందుగా పాత్రధారులు ప్రవేశించు సమయమున ఒకరినొకరు పరిచయము లేదా నాటక కథ పరిచయము కొరకు ముందుగా పాడు రచనలు. దీనియందు పల్లవి, చరణములుండి మధ్యమధ్య సంభాషణతో రక్తి కట్టించెదరు.

3) సంవాద దరువు: సంవాద దరువు వినుటకు మిక్కిలి ఆసక్తికరముగా నుండును. పాత్రధారులమధ్య సాగు సంభాషణ రచన. ముఖ్య పాత్రధారుల పరిచయము, వారి కీర్తి, గుణ గణాదులను వివరింపు సంభాషణాపరమైన రచనలు. శ్రోతలకు అతి తక్కువ సమయములో ముఖ్య పాత్రధారులను పరిచయము చేయు దరువే సంవాద దరువు. ఇది ముఖ్యముగా సంవాద రూపములో ఇద్దరు / ముగ్గురి మధ్య జరిగే సంభాషణను, అతి చాకచక్యముతో శ్రోతలకు పరిచయము చేయు సంగీత ప్రక్రియ మాత్రమే. సంవాద దరువును గేయ నాటకములందు నృత్య నాటకములందు, యక్షగానములందు ప్రవేశపెట్టి, రాబోవు పాత్రల ఔచిత్యమును పరిచయము చేయుదురు.

4) స్వగత దరువు: స్వగతముగా తనలో తాను మరియొకరి గుణ గణాదులను కీర్తి ప్రతిష్టలను బాహాటముగా కీర్తించుచూ శ్రోతలకు తెలియజేయు ప్రక్రియనే స్వగత దరువందురు.

5) జక్కిణి దరువు: ఇది ఒక విచిత్రమైన సాహిత్య రచన. దీని నడక అతి చిత్రతమ మార్గములో నుండి పల్లవి, అనుపల్లవి, చరణములతో నుండును. అనుపల్లవిలో మాతువు జతులతోకూడి, చరణము యొక్క సాహిత్యము జతులతోకూడి, మధ్యమ, దృతకాలములందుండును. జక్కిణి దరువును గుంపులుగా పాడుచు తాళధ్వనులకనుగుణముగా నృత్యించెదరు.

ఈ దరువును రచించిన వారిలో శహజి మహరాజ్, శ్రీ సుబ్బరామ దీక్షితులు, ముత్తుస్వామి దీక్షితులు, త్యాగరాజు ముఖ్యులు

ఉదా : 1. విన్నవింపవే - మధ్యమావతి - ఆదితాళం
2. ఎన్నగు మనసుకురాని - నీలాంబరి - ఆదితాళం
3. ఝంతదణతకిట - ఆఠాన - ఝంపెతాళం
4. ఏమేమొ తెలియక - సౌరాష్ట్ర - చాపుతాళం
5. శ్రీగణపతిని - సౌరాష్ట్ర - ఆదితాళం

8. పదము - రచన లక్షణములు

పదము రచన ఒక విలక్షణమైన ప్రక్రియ. పదములయందు పల్లవి, అనుపల్లవి, చరణము లుండును. ఈ పదములలో పాండిత్యముగల నాయిక - నాయకుల శృంగారకేళి రహస్యములు రాగ రంజితములు. పదరచనలయందు క్షేత్రయ్య మిక్కిలి ప్రసిద్ధినొందిన వాగ్గేయకారుడు. ఈ రచనలన్నియును నృత్యమునకనువుగా, దేవదాసీలచే భగవంతుని స్తుతించుటకు, రచించిన రచనలే. నృత్యమునకు అనువుగానున్నను, మంచి సంగీత ప్రాధాన్యమును సంతరించుకొన్నవి. భావప్రకటనకు, రాగవృద్ధికి పదములయందు మంచి అవకాశము కలదు. శృంగారరసము భావగర్భితమైన వేదాంత సారముతో మిళితమై నాయకి-నాయకుల మధ్య విలసిల్లిన ఒక ప్రక్రియగా చెప్పవచ్చును. నాయకి (జీవాత్మ) నాయకుని చెంత (పరమాత్మ) చేరుటకు ప్రేమానురాగములే ప్రధాన భూమికలని తెలిపే రచనలు. నాయకుని లేని చింతను నాయకి ఏవిధముగా ప్రస్ఫుటము గావించునో, తన నిస్సహాయత, విసుగు, భంగపాటు, విరహవేదన, శారీరక శృంగార ఔచిత్యములు ఈ పదములందు గోచరించును.

పదముల రచనయందు క్లిష్టమైన సంచారములుగాని, సంగతులు గాని లేక, నడక విళంబ కాలములో యుండును. పదములయందు గ్రామీణులు ఉపయోగించే పరిభాష పదములు, మాండలీకములుండుటయే గాక సంగీత వ్యాకరణ పరమైన ప్రయోగములు, సాహిత్య సొబగులు, వాగ్గేయకారుల ముద్రలతో రాణించును.

పదములు గానము చేయుటకు మంచి సంగీత వ్యాకరణము తెలిసి, రాగమునందు పట్టు కలిగియుండి, భావప్రకటన సరియగు మోతాదులో జోడించిన మాత్రమే పదగానము రక్తి కట్టును. వాగ్గేయకారులైన క్షేత్రయ్య, ఆద్యుడైనను, తదుపరి పరిమళ రంగడు, శహజీ మహరాజ్, వీరభద్రయ్యలు రచించిన పదములు ప్రాచుర్యమునొందెను.

ఉదా: 1. అలిగితే - హుసేని - చాపుతాళం
2. అయ్యయో వెగటాయనే - నాద నామక్రియ - త్రిపుటతాళం
3. ఎందుదాచుకొందు నిన్ను - కల్యాణి - రూపకతాళం
4. వేడుకతో నడుచుకొన్న - కాంభోజి - త్రిపుటతాళం
5. సామికి సరియెవ్వరే - ముఖారి - ఆదితాళం

9. జావళి - రచన లక్షణములు

జావళి రచన ఒక విలక్షణమైనది. జావళి పాడే విధానము కూడా సంప్రదాయ పద్ధతికి వేరుగా నుండి, ఉత్తర హిందూస్థానమందలి 'గజల్'ను పోలి ఉంటుంది. ఇందు పల్లవి, అనుపల్లవి, చరణములతోపాటు చిట్ట స్వరములు కూడ కలవు. ఇందలి సంగీతము మిక్కిలి చురుకుగాయుండి వీనులవిందుగా యుండును. కొన్ని సమయములందు, నిర్దేశించిన రాగమునకు కొంచెం దూరముగా వెళ్ళి జావళీని రక్తి కట్టించెదరు. ఇందలి సాహిత్యము గౌరవప్రదమైనదిగాక, పవిత్రమైనదిగాకయుండి, పాత్రలు మాత్రము చాల చౌకబారుగా యుండును. ఇందలి పాత్రధారులు ముఖ్యముగా నాయికా-నాయకులు. వీరి మధ్య సంభాషణ చాల చౌకబారుగా, శుద్ధ మాండలికములతోను, చిలిపి చేష్టలతోను, రహస్య ప్రేమ కథలతోను, శృంగార సంభాషణలతోను, నిగూఢార్థములతోను, చాకచక్య ద్వందార్థములతోను రాణించును. ఇందలి సంగీతము సామాన్యమైనప్పటికి జావళీలు, ఇందలి కథా వస్తువు సామాన్య శ్రోతలకు మంచి ఆహ్లాదమునిచ్చును. జావళీలు ఎక్కువగా చాపు, రూపక తాళములలోనుండును. జన బాహుళ్యముకొరకు, జావళీలలో సంగతులు, జతులను చేర్చి నృత్య సంగీతమునందు, చతుర సంభాషణలో జానపద సాంప్రదాయమున కనుగుణముగా, నర్తించుట కూడ కలదు. అయినను, కొందరు వాగ్గేయకారులు తమదైన శైలిలో తమ ముద్రను నిక్షిప్తం చేసి, చక్కని సంగీతముతో, మంచి సరస సభాషణలతో సాహిత్యపు సొబగులు చెదరకుండా రచించి, జావళికి వన్నె తెచ్చిరి. జావళీలు రచించినవారిలో పట్టాభి రామయ్య, తిరుపతి నారాయణ స్వామి, రామ్నాడ్‌పురం శ్రీనివాస అయ్యంగారు, ధర్మపురి సుబ్బరాయర్ మరియు స్వాతి తిరునాళ్ ముఖ్యులు.

ఉదా : అపదూరుకు - ఖమాస్ - ఆదితాళం
వగలాడి బోధనలు - బేహాగ్ - రూపకతాళం
ఎంతటి కులుకే - కల్యాణి - రూపకతాళం
మరుకొన్నది రా - ఖమాస్ - ఆదితాళం

పదములుగాని, జావళీలుగాని తరంగములుగాని, తిల్లానలుగాని నిర్దేశించిన పద్ధతిలో పాడినప్పుడే వాటిని పూర్తిగా ఆస్వాదించగలుగుతాము.

10. తిల్లాన - రచన లక్షణములు

తి, లా, నా, అను ధాతువులతో నృత్య సంగీతమునందలి సాహిత్యము కొరకు 18వ శతాబ్ధినుండి వీటి రచ కొనసాగిందని చెప్పవచ్చును. హిందుస్తాని సంగీతమునందు తిరి తిల్లానలనబడు మంచి సాహిత్యపరమైన, సంగీత రచనలుకూడ కలవు.

ప్రతి తిల్లానయందు పల్లవి, అనుపల్లవి, చరణములను భాగములు, లేక ఏవో రెండు భాగములుండును. ప్రతి తిల్లాన సంపూర్ణమైన సాహిత్యముతోను తేలికపాటి సంగీతముతోనుండి నృత్య అభినయమునకనువుగా జతులను చేర్చి రచించెదరు. దీనికి జతగా స్వర సాహిత్యములతోపాటు జతులను కూర్చి చక్కటి సోల్ కట్టు స్వరములు చేర్చుటచే శ్రోతలను రంజింపచేయును. ఈ తిల్లానాలు కచ్చేరీ లకనుగుణముగా, నృత్యమునకనుగుణముగా రెండు విధములుగా కూడ రచించిరి. కచ్చేరీల తిల్లానాలు రాగబద్ధమై, సంగతులతో కూడియుండును. నృత్యమునకనువైన తిల్లానాలయందు సాహిత్యముతో జతులను చేర్చి అభినయమున కనుగుణముగా రచించిరి. సాహిత్య భాగమును అభినయముద్వారా

జతులను నృత్యము ద్వారా ప్రదర్శించిన మనోరంజకముగానుండును. తిల్లానాలు సాంప్రదాయ పద్ధతిలో పాడిన అంతగా రాణించవు. వీటికి ఒక విలక్షణ పద్ధతిలో రాగము చెడకుండా, జతులను ఆధార భూతములుగా చేసుకొని పాడినప్పుడే మనోరంజకముగానుండును.

కొన్ని జతులు నాధిరధీం నాధిరధీం తదియ రనధీంత, ధీంధీం తోంతోం తదరన ధీం, తాంతాం ఉదనధీం, ఝుంఝుం తరితఝుం, ఝణకిత ఝుం, తాఝుణుతక, ధీంత తకఝుణు తకధీంత, తాదీ తళాంగుతోం, తకతధిగిణతోం, ఎంతో మనోరంజకముగాను, ఉత్సాహముగానుండును.

వాగ్గేయకారులు తిల్లానాలను సంస్కృతము, తెలుగు, తమిళ భాషలలో రచించిరి. మహా వైద్య నాధయ్యర్, పల్లవి శేషయ్యర్, రామ్నాడ్ శ్రీనివాస అయ్యంగార్, వీరభద్రయ్య, స్వాతి తిరునాళ్, మైసూరు సదాశివరావు, వీణ శేషన్న, పొన్నయ్య పిళ్లై, డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ మొదలగువారు తిల్లాన రచయితలు.

ఉదా: గౌరీనాయక - కానడ - మహావైద్యనాధయ్యర్
గీత నదీకు - బేంఫట్ - స్వాతి తిరునాళ్
తధీంధీం తదరన - ఫరౌజు - పట్నం సుబ్రహ్మణ్యయ్యర్
ఝుంఝుం తరిత ఝుం - వసంత - పల్లవి శేషయ్యర్

11. అష్టపది - రచన లక్షణములు

జయదేవ మహాకవి 12వ శతాబ్దములో సంస్కృతమున అష్టపదులను రచించిరి. ఒక్కొక్క రచనలో 8 పాదములుండుటవలన వీటికి అష్టపదులు అనుపేరు వచ్చెను. ఇవి గీతగోవిందమను ఉద్గ్రంధము నందు కలవు. అష్టపదులలో పల్లవి, అనుపల్లవి, చరణములుండును. కొన్నింటిలో అనుపల్లవి కనపడదు. చరణములన్నియును ఒకే శైలిలోయుండి పాట పాడుటకనువుగా యుండును.

అష్టపదులు మొత్తము 24. వీటిని 12 సర్గలుగా విభజించిరి. ఒక్కొక్క రచనలో 8 పాదములు కలవు. అష్టవిధ నాయికలను ఒక్కొక్క అష్టపదిలో వర్ణింపబడినవి. అత్యుత్తమ భక్తిభావములతో, నవరసములతో నిండియున్న ఈ అష్టపదులు గానకచ్చేరిలయందును, నృత్య సంగీత ప్రదర్శనలలో ఒక అత్యున్నత స్థానము కలిగియున్నవి. అష్టపదులన్నియు శృంగార రసపూరితముగా నుండును. నాయిక-నాయకుల శృంగార రసమందలి 8 నాయికల భావోద్వేగములను భావగర్భితమైన శృంగార శైలిలో రచించిన జయదేవుడు చిరస్మరణీయుడు. నాయిక (జీవాత్మ) నాయకుడు (పరమాత్మ)ని చేరుటకు ఏవిధమైన ప్రేమానురాగములు అవసరమో వివరించబడినది. ఈ వివరణలు సరస సమ్మోహ నాస్త్రములుగా మంచి పదగాంభీర్యముతోను, రాగచ్ఛాయతోను భావప్రకటనతో మనోరంజకముగా నుండును. ఈ సంగీత ప్రపంచమున ఇంత మహోత్కృష్టమైన అష్టపదులు అను ప్రాస, యమకము, ఉపమానముతో ఉత్ప్రేక్షాలంకారములతో, అర్థాంతరన్యాస అలంకారముతో శోభించుచున్నవి. ఇందులో 19వ అష్టపదిలో భగవంతుని దర్శన భాగ్యము కలుగుటచే దీనిని దర్శనాష్టపదియనియు, సంజీవిని అష్టపదియని యందురు. ప్రతి అష్టపదియందు జయదేవుని స్వనామముద్ర 'జయదేవ' కలదు. తదుపరి కాలమందు, 17వ శతాబ్దములో వేంకటమఖి - త్యాగరాజాష్టపదులను ఆ తదుపరి 18వ శతాబ్దమున

చంద్రశేఖర సరస్వతి శివాష్టపదులను, 19వ శతాబ్దములో రామకవి రామాష్టపదులను రచించినను, జయదేవుని అష్టపదులు మంచి ప్రాచుర్యమును పొందెను.

ఉదా: రతిసుఖ సారే - మోహన - ఆదితాళం
చందన చర్చిత - మోహన - ఆదితాళం
సావిరహే తవదీనా - కల్యాణి - ఆదితాళం

12. తరంగము - రచన లక్షణములు

శివనారాయణ తీర్థులవారు 16వ శతాబ్ధమున 'శ్రీకృష్ణలీలాతరంగిణి'యను సంగీత నాటకమును రచించిరి. ఈ రచనలే తరంగములుగా బహుళ ప్రాచుర్యమునొందెను. తరంగములు ఒక విలక్షణమైన సంస్కృత సంగీత రచనగా వెలుగొందినవి. శ్రీకృష్ణ పరమాత్మనే కేంద్రబిందువుగా చేసి, పటిష్టమైన, పదగాంభీర్యమును ప్రదర్శించుచు, అత్యంత మనోహరమైన సంగీత-సాహిత్యములతో అపూర్వ రాగములలో రచింపబడిన ఉద్గ్రంధము. ప్రతి తరంగమునకు ముందు, ఆ తరంగము ఏ రాగమునందు రచింపబడినదో, అదే రాగమున శ్లోకముల రచనలు కలవు. ప్రతి తరంగము పాడుటకు ముందు శ్లోకమును పాడుట ఆనవాయితి. తరంగములందు పల్లవి, అనుపల్లవి, చరణములుండును. తరంగములు పల్లవి, అనుపల్లవి, చరణముల వరుస క్రమములో పాడినను, కొన్ని తరంగములందు చరణము పాడి పల్లవి పాడుట సాంప్రదాయముగా వస్తుంది. ప్రతి తరంగమును శ్రీకృష్ణ లీలామృత వర్ణనే మిక్కిలిగా కానవచ్చును. కావున ఇది శ్రీకృష్ణ లీలాతరంగిణిగా ప్రసిద్ధినొందిన గ్రంధము. ఈ మొత్తము తరంగములు 158 ని 36 రాగములలో నిర్దేశించినను, నేటి గాయకులు కొంచెము చేర్పులు మార్పులు రాగములందు చేయుచున్నారు. నారాయణతీర్థుల వారు కాంభోజి రాగమునందు 16, నాదనామక్రియయందు 16, సౌరాష్ట్రరాగమునందు 15, మధ్యమావతియందు 13, ముఖారి కల్యాణి, కేదారగేళయందు 9, సావేరియందు 8 తరంగముల రచనతోపాటు వివిధములైన రాగములను శ్రీకృష్ణుని కీర్తించుటకు సమయ, సందర్భమును పట్టి రచించిరి. ఈ తరంగములు సాంప్రదాయ పద్ధతిలో గానము చేయక, లయ విన్యాసములతో, భక్తి భావములతో, భజన సాంప్రదాయముతో, తాళములు, భజంత్రీల లయ విన్యాసములతో పాడుచు, స్పష్టమైన పదభంగిమలతో పాడుట ఆనవాయితి. దీనివలననే, పండిత పామరులు సైతము పాల్గొని తరంగ భజన సాంప్రదాయమునకు జీవము పోయుచున్నారు. నారాయణ తీర్థులవారే స్వయముగా ఒంగోలు చుట్టుపట్టు గ్రామములలో పాడి, అచ్చటి భక్తులకు బహుతాళ విన్యాసములతో, మూడు కాలములందు నేర్పిరట. పరమాత్మ - జీవాత్మ తత్వమును ప్రతిబింబించు ఈ తరంగములందు శ్రీకృష్ణుడు పరమాత్మగను, గోపికలు జీవాత్మగను, పరమాత్మలో జీవాత్మ కలయికయే జీవన్ముక్తికి ప్రతీకయని భక్తి సాంప్రదాయమే మేలైన, సులభమైన మార్గమని గోచరించును.

ఉదా: శరణంభవ - సౌరాష్ట్ర - ఆదితాళం
ఆలోకయే శ్రీ - హుసేని - ఆదితాళం
కృష్ణం కలయసఖీ - ముఖారి - ఆదితాళం
నందముకుందే - కేదారగేళ - ఆదితాళం
శ్రీపతి మిహనంద - కాంభోజి - ఆదితాళం

13. అభంగములు - రచన లక్షణములు

అభంగములు జ్ఞానదేవుని రచనలు. ఇందులో మెండుగా నామస్మరణమే పరమావధిగా, జ్ఞాన తత్వమును ప్రబోధించేవిగా యున్నవి. మొత్తము 27 అభంగములున్నవి. ప్రతి అభంగమునందు 4 పాదములుండును. ఈ అభంగములయందు పరమాత్మ తత్వమును దివ్యనామ సంకీర్తనద్వారా పొందవచ్చునని విశదీకరించును. అభంగములను మొదటిసారిగా 'వర్కరి' సంతులు అయిన నామదేవ్, ద్యానేశ్వర్, ఏకనాధుడు మరియు తుకారామ్‌లు గానము చేసిరి. ఈ అభంగములు అన్నియు విఠల్ దేవుడిమీద వ్రాసినవే. వర్కరీ నమ్మకములో భక్తి, ముక్తి అను రెండే పద్ధతులను ఆదరించి అనాచార మూఢనమ్మకములను పారద్రోలిరి. మానవత విలువవల్ల కలుగు లాభములు, సోదర సోదరీభావములతో ప్రేమను ఒక ఆయుధముగా భగవంతుని ప్రేమించి ముక్తి పొందవచ్చునని భాగవత తత్వమును ప్రబోధించు పద్యకవితలు. ఇవి సంఘ దురాచారములు, మూఢ భక్తియును, మానవ మనుగడకు పనికిరావని, భగవంతుని ప్రేమతత్వము ఒక్కటియే పరమావధిగా చాటిచెప్పిన మరాఠి పద్యకవితలు ఈ అభంగములు.

ఉదా: దేవాచిమే ద్వారీ
భావే< వీణభక్తి
పర్వతాప్రమాణే
నిత్యసత్‌మిత్
సర్వసుఖ గోడీసాహే

14. తత్వము - రచన లక్షణము

తత్వమనగా ఆత్మ జ్ఞానము. జీవితములో సత్యాన్వేషణకొరకు భక్తి, జ్ఞాన, వైరాగ్య, సంగీత, సాహిత్య, సాంఘీక ఆచార-దురాచారముల తార్కిక సంబంధమైన ఒక కల్పనా రచనలైనను, ఆత్మజ్ఞానము ప్రబోధించు రచనలు. దైవాంశ సంభూతులు, పరమ యోగులు అయిన అవధూత స్వాముల అంతరంగమునుండి భక్తి ప్రేరణతో ఉద్భవించిన నగ్నసత్యాలుగా కొనియాడబడినవి. భగవంతుని లీలాచాతుర్యమును వివరించుచూ, పామర-పండితులు వాటి తత్వసారమును పొంది ఒక అనుభూతిని పొందే దైవిక రచనలని చెప్పవచ్చును. ఇవి లయ ప్రధానముగానుండి, మంచి మాండలికముతోను, నుడికారములతోను, మృదువుగా సాగే ఒకవిధమైన రచన. వీటి రాగ ప్రక్రియ జీవస్వరములు కలిగినదై ఎంతో మృదుమధురముగా, శ్రావ్యముగాను జీవముతో రాణించును. తత్వములు పాడుట దైవనిర్ణయము. అందరికి సాధ్యముకాదు. అనుభవాన్ని, జ్ఞాన సంపదను లయించి పాడుట భగవదనుగ్రహమని చెప్పవచ్చును. సాధారణముగా ఏకతంత్రి వాయిద్యము నాధారముగా చేసుకొని ఈ తత్వములు పాడుట ఆనవాయితి. రాయల రాజ్యమునందు సాహిత్య-సంగీత సమ్మేళనములందుకూడా తత్వములు పాడుట సాంప్రదాయము. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి తత్వములు బహుళ ప్రాచుర్యము నొందినవి. ఇవి ముఖ్యముగా కాలజ్ఞానమును తెలుపు రచనలు. స్వామి సుందర చైతన్యానందులవారు, స్వామి

శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి, వెంకయ్యస్వామి, రామిరెడ్డి తాత వంటి అవధూతల తత్వజ్ఞాన రచనలు మిక్కుటముగా ప్రాచుర్యము నొందినవి.

ఉదా: హరిగోవింద గోవింద
నందామయ గురుడ నందామయా
నామ స్మరణము ఎంతోహాయి
చీమ ఎంత చిన్నది అతి కఠినమైనది
నిను విడచి ఉండలేనయ్యా
వస్తావొట్టిదే-పోతావొట్టిదే, బాధ ఎందుకంట?

14. కర్నాటక సంగీత రాగములు - వాటి విభజన

కర్నాటక సంగీతమునందలి రాగములను రెండు విధములుగా విభజించిరి. అవి 1) జనక రాగములు 2) జన్య రాగములు. జనక రాగములనుండి జనించిన రాగములనే జన్య రాగములందురు.

జనక రాగముల లక్షణములు

ఒక రాగమును జనక రాగముగా పేర్కొనుటకు, దానికి ఈ క్రింది లక్షణములు కలిగి యుండవలెను.

1. ఆరోహణయందును, అవరోహణయందును సప్తస్వరములు అనగా 'సరిగమపదని' లు తప్పనిసరిగా కలిగియుండవలెను. ఇటువంటి రాగములను సంపూర్ణ రాగములందురు.
2. ఈ రాగములలో సప్తస్వరములు ఒకే వరుస క్రమములో అనగా ఆరోహణయందు 'సరిగమపదని' అవరోహణయందు 'నిదపమగరిస' యుండవలెను.
3. ఆరోహణయందును, అవరోహణయందు ఒకే జాతి స్వరస్థానము లుండవలెను.

జన్య రాగముల లక్షణములు

జన్య రాగములు జనకరాగములనుండి ఉద్భవించిన రాగములు. ఒక్కొక్క జనక రాగమునకు 484 జన్య రాగములుండును. ఈ జన్యరాగములు జనకరాగ స్వరస్థానములు కలిగి, అన్ని స్వరములు క్రమములో కాని, కొన్ని స్వరములు ముందు వెనుక కాని, కొన్ని స్వరములు నిషిద్ధములుగా గాని యుండును. ఒక్కొక్క జనక రాగమునకున్న 484 జన్యరాగముల పుట్టుక ఈ క్రింది విధముగానుండును. అవి సంపూర్ణములు (1), షాడవ భేదములు (6), ఔడవ భేదములు (15), మొత్తము కలిపి 22. మరల ఈ 22తో సంపూర్ణ భేదములు 22 (22×1), షాడవ భేదములు 132 (22×6) ఔడవ భేదములు 330 (22×15). అన్నియు కలిపి 484 జన్యరాగములు.

జన్యరాగములు - విభజన ఉదాహరణ

ఆరోహణ-అవరోహణ క్రమములో స్వరసంఖ్యనాధారముగా చేసుకొని చేసిన రాగవిభజన.

1. సంపూర్ణ రాగము (1) : కల్యాణి లేక భైరవి :

2. సంపూర్ణ-షాడవ భేదము (16) గమకప్రియ
3. షాడవ-సంపూర్ణ భేదములు (6) కాంభోజి, దర్బారు, మనోరంజని
4. సంపూర్ణ-ఔడవ భేదములు (15) నాటరాగము
5. ఔడవ-సంపూర్ణ భేదములు (15) బిలహరి, సావేరి, అభేరి
6. షాడవ-షాడవ భేదములు (36) శ్రీరంజని, తోడి, మలయ మారుతము
7. షాడవ-ఔడవ భేదములు (90) బహుదారి
8. ఔడవ-షాడవ భేదములు (90) మలహరి, జగన్మోహిని, వసంత
9. ఔడవ-ఔడవ భేదములు (225) హంసధ్వని, మోహన, మధ్యమావతి

ఒక్కొక్క రాగమునందు 484 జన్యరాగముల చొప్పున 72 మేళకర్తల జన్యరాగము (484×72)లు మొత్తము 34848 ఏర్పడును.

ఈ జన్యరాగములను మరల శుద్ధ, సంకీర్ణ, వక్ర రాగములుగా విభజించిరి.

శుద్ధ రాగములు : ఆరోహణ-అవరోహణయందు ఒకే రకమైన స్వర స్థానములుండును.

సంకీర్ణ రాగములు : ఆరోహణ-అవరోహణలయందలి స్వర స్థానములు వేర్వేరుగా నుండును.

వక్ర రాగములు : ఆరోహణ-అవరోహణలయందలి స్వరములు వక్రమార్గములో నుండును. శుద్ధ, సంకీర్ణ, వక్ర రాగములు సంపూర్ణ, ఔడవ, షాడవ భేదములలోకూడ కలవు.

ఈ రాగములను 9 రకములుగా విభజించిరి.

1) ఉపాంగ రాగము 2) భాషాంగ రాగము 3) పంచమాంత్య రాగము 4) దైవతాంత్య రాగము 5) నిషాదాంత్య రాగము 6) అంతర మార్గము 7) రక్తి రాగము 8) ఛాయంగ రాగము 9) రాగాంగ రాగము.

1) ఉపాంగ రాగము : జనక రాగజనితమై, జనక రాగశృతులను తప్పనిసరిగా కలిగినదై, ఔడవ షాడవములతోనుండు జన్యరాగమును ఉపాంగ రాగమందురు.

2) భాషాంగ రాగము : జనక రాగజనితమై, అదే జనకరాగ శృతులను కలిగియుండి, వేరే జనకరాగ శృతులను కూడా కలిగియుండు రాగమును భాషాంగ రాగమందురు.

3) పంచమాంత్య రాగములు : ఒక రాగములోని సంచారమును మధ్యస్థాయి పంచమముతో ముగించు రాగములు పంచమాంత్య రాగములు : నవరోజు

4) దైవతాంత్య రాగములు : ఒక రాగములోని సంచారము మధ్యస్థాయి దైవతముతో అంతమగు రాగములు దైవతాంత్య రాగములు: కురంజి

5) నిషాదాంత్య రాగములు : ఒక రాగములోని సంచారములు మధ్యస్థాయి నిషాదముతో అంతమగు రాగములు నిషాదాంత్య రాగములు. నాదనామక్రియ.

6) అంతర మార్గము లేక భాషాంగ రాగము : రాగమూర్ఛనలో అన్య స్వరమును రాగరంజితమునకై చేర్చి, అలంకారము సరిగా నుండునట్లు చేయు క్రియను అంతర మార్గము లేక భాషాంగ రాగమందురు.

7) రక్తి రాగము : మనోరంజకముగా గానము చేయబడిన రాగమును రక్తి రాగమందురు.

8) ఛాయాంగ రాగము : అన్య రాగచ్ఛాయలు పొందిన రాగమును ఛాయాంగ రాగమందురు.

9) రాగాంగ రాగము : ఆరోహణ-అవరోహణ యందు ఒకేజాతి స్వరములున్న సంపూర్ణ జన్య రాగమును రాగాంగ రాగమందురు.

15. మేళకర్త ఏర్పడు పధకము

సప్తస్వరముల శుద్ధ/వికృతి భేదములచే ఏర్పడు షోడశ స్వరముల (16) ప్రస్తారమే మేళకర్తయనబడును.

షోడశ స్వరములు (16)

స	శు	చ	శు	సా	అం	శు	ప్ర	పం	శు	చ	శు	కై	కా
	రి	రి	4గాం	గాం	గాం	మ	మ		దై	దై	13 ని	ని	ని
			ష								ష		
1	2	3	5రి	6	7	8	9	10	11	12	14దై	15	16

ఇటువంటి మేళకర్తలు 72గా వాగ్గేయకారులు నిర్ణయించిరి. సప్తస్వరముల పూర్వాంగమైన శుద్ధ స్వరములగు స,రి,గ,మ లను ఉత్తరాంగములోని పంచమము శుద్ధ స్వరముల దైవతము, నిషాదములతో ప్రస్తారించిన ఏర్పడునది మొదటి మేళకర్తయనబడును. అనగా ష, శు॥రి, శు॥గా, శు॥మ, పం, శు॥దై, శు॥ని.

1) పూర్వాంగములోని శుద్ధ స్వరములగు సరిగమలతో ఉత్తరాంగమందుండు పదని శుద్ధ/వికృతి స్వరముతో ప్రస్తారించిన ఏర్పడునవి 6 మేళకర్తలు.
2) ఇదేవిధముగా రెండవ పూర్వాంగ స్వరభేదములగు షడ్జమ, శు॥రి సా॥గాం, శు॥మ ములను ఉత్తరాంగ స్వరభేదములతో ప్రస్తారించిన 6 మేళకర్తలగును.
3) మూడవ పూర్వాంగ స్వరభేదములను షడ్జమము, శు॥రి, అం॥గాం, శు॥మ ములను ఉత్తరాంగ స్వరభేదములతో ప్రస్తారించిన 6 మేళకర్తలు ఏర్పడును.
4) నాలుగవ పూర్వాంగ స్వరభేదములగు షడ్జమము, చ॥రి, సా॥గాం, శు॥మ ములను ఉత్తరాంగములోని స్వరభేదములతో ప్రస్తారించిన 6 మేళకర్తలు ఏర్పడును.
5) ఐదవ పూర్వాంగ స్వరభేదములగు షడ్జమము, చ॥రి, అం॥గా శు॥మ ములతో ఉత్తరాంగ స్వరభేదములతో ప్రస్తారించిన ఏర్పడు 6 మేళకర్తలు.
6) ఆరవ పూర్వాంగ స్వరభేదములగు షడ్జమము, ష॥రి, అం॥గాం, శుద్ధ మధ్యమములతో ఉత్తరాంగ స్వరభేదములను ప్రస్తారించిన ఏర్పడు 6 మేళకర్తలు.

అనగా 6 పూర్వాంగ, 6 ఉత్తరాంగ స్వరభేదములతో ప్రస్తారించిన (6×6=36) 36 మేళకర్తలేర్పడును. వీటిని శుద్ధ మధ్యమముతో ప్రస్తారించిన ఏర్పడునవి 36 శుద్ధ మధ్యమ మేళకర్తలుగా, ప్రతిమధ్యమముతో ప్రస్తారించిన 36 ప్రతి మధ్యమ మేళకర్తలుగా, మొత్తము 72 మేళకర్తలుగా వ్యవహరించడమైనది. ఇందులో గమనించదగ్గ విషయము 1-36 మేళకర్తలోని సరిగపదని స్వరస్థానములు 37-72 మేళకర్తలోని సరిగపదని స్వరస్థానములు ఒకే రకముగా నుండి, శుద్ధ మధ్యమముతో 1-36 మేళకర్తలు, ప్రతి మధ్యమముతో 37-72 మేళకర్తలు పాడుదురు. ప్రతి, శుద్ధ మధ్యమముల వ్యత్యాసము వలన పేర్లు వేరుగా నుండును.

16. చక్రములవారీగా మేళకర్తల శృతుల పట్టిక (శుద్ధమధ్యమ మేళకర్తలు)

శు : శుద్ధ, సా: సాధారణ, ప్ర : ప్రతి, అం : అంతర, చ : చతుశ్శృతి, కై : కైసిక, ష : షట్‌శృతి, కా : కాకలి, మొదటి ష : షడ్జమము, పం : పంచమము.

వరుస సంఖ్య	రాగములు	స్వరములు						
		స	రి	గ	మ	ప	ద	ని
		స్వరస్థానములు						
మొదటి చక్రము - ఇందు								
1	కనకాంగి	ష	శు	శు	శు	పం	శు	శు
2	రత్నాంగి	ష	శు	శు	శు	పం	శు	కై
3	గానమూర్తి	ష	శు	శు	శు	పం	శు	కా
4	వనస్పతి	ష	శు	శు	శు	పం	చ	కై
5	మానవతి	ష	శు	శు	శు	పం	చ	కా
6	తానరూపి	ష	శు	శు	శు	పం	ష	కా
రెండవ చక్రము - నేత్ర								
7	సేనాపతి	ష	శు	సా	శు	పం	శు	శు
8	హనుమతోడి	ష	శు	సా	శు	పం	శు	కై
9	ధేనుక	ష	శు	సా	శు	పం	శు	కా
10	నాటకప్రియ	ష	శు	సా	శు	పం	చ	కై
11	కోకిలప్రియ	ష	శు	సా	శు	పం	చ	కా
12	రూపవతి	ష	శు	సా	శు	పం	ష	కా
మూడవ చక్రము - అగ్ని								
13	గాయకప్రియ	ష	శు	అం	శు	పం	శు	శు
14	వకుళాభరణము	ష	శు	అం	శు	పం	శు	కై
15	మాయామాళవగౌళ	ష	శు	అం	శు	పం	శు	కా
16	చక్రవాకము	ష	శు	అం	శు	పం	చ	కై
17	సూర్యకాంతము	ష	శు	అం	శు	పం	చ	కా
18	హటకాంబరి	ష	శు	అం	శు	పం	ష	కా

				నాల్గవ చక్రము - వేద				
19	ఝంకారధ్వని	ష	చ	సా	శు	పం	శు	శు
20	నఠభైరవి	ష	చ	సా	శు	పం	శు	కై
21	కీరవాణి	ష	చ	సా	శు	పం	శు	కా
22	ఖరహరప్రియ	ష	చ	సా	శు	పం	చ	కై
23	గౌరీమనోహరి	ష	చ	సా	శు	పం	చ	కా
24	వరుణప్రియ	ష	చ	సా	శు	పం	ష	కా
				5వ చక్రము - బాణ				
25	మానోరంజని	ష	చ	అం	శు	పం	శు	శు
26	చారుకేసి	ష	చ	అం	శు	పం	శు	కై
27	సరసాంగి	ష	చ	అం	శు	పం	శు	కా
28	హరికాంభోజి	ష	చ	అం	శు	పం	చ	కై
29	ధీరశంకరాభరణము	ష	చ	అం	శు	పం	చ	కా
30	నాగానందిని	ష	చ	అం	శు	పం	ష	కా
				6వ చక్రము - ఋతు				
31	యాగప్రియ	ష	ష	అం	శు	పం	శు	శు
32	రాగవర్ధిని	ష	ష	అం	శు	పం	శు	కై
33	గాంగేయభూషణి	ష	ష	అం	శు	పం	శు	కా
34	వాగధీశ్వరి	ష	ష	అం	శు	పం	చ	కై
35	శూలిని	ష	ష	అం	శు	పం	చ	కా
36	చలనాట	ష	ష	అం	శు	పం	ష	కా
				7వ చక్రము - ఋషి (ప్రతిమధ్యమ మేళకర్తలు)				
37	సాలగము	ష	శు	శు	ప్ర	పం	శు	శు
38	జాలార్ణవము	ష	శు	శు	ప్ర	పం	శు	కై
39	ఝాలవరాళి	ష	శు	శు	ప్ర	పం	శు	కా
40	నవనీతము	ష	శు	శు	ప్ర	పం	చ	కై
41	పావని	ష	శు	శు	ప్ర	పం	చ	కా
42	రఘుప్రియ	ష	శు	శు	ప్ర	పం	ష	కా
				8వ చక్రము - వసు				
43	గవాంభోది	ష	శు	సా	ప్ర	పం	శు	శు
44	భవప్రియ	ష	శు	సా	ప్ర	పం	శు	కై
45	శుభపంతువరాళి	ష	శు	సా	ప్ర	పం	శు	కా
46	షడ్విద మార్గిణి	ష	శు	సా	ప్ర	పం	చ	కై
47	సువర్ణాంగి	ష	శు	సా	ప్ర	పం	చ	కా
48	దివ్యమణి	ష	శు	సా	ప్ర	పం	ష	కా

				9వ చక్రము - బ్రహ్మ				
49	ధవళాంబరి	ష	శు	అం	ప్ర	పం	శు	శు
50	నామనారామణి	ష	శు	అం	ప్ర	పం	శు	కై
51	కామవర్ధిని	ష	శు	అం	ప్ర	పం	శు	కా
52	రామప్రియ	ష	శు	అం	ప్ర	పం	చ	కై
53	గమనశ్రమ	ష	శు	అం	ప్ర	పం	చ	కా
54	విశ్వంబరి	ష	శు	అం	ప్ర	పం	ష	కా
				10వ చక్రము - దిశి				
55	శ్యామలాంగి	ష	చ	సా	ప్ర	పం	శు	శు
56	షణ్ముఖప్రియ	ష	చ	సా	ప్ర	పం	శు	కై
57	సింహేంద్రమధ్యమము	ష	చ	సా	ప్ర	పం	శు	కా
58	హేమవతి	ష	చ	సా	ప్ర	పం	చ	కై
59	ధర్మవతి	ష	చ	సా	ప్ర	పం	చ	కా
60	నీతిమతి	ష	చ	సా	ప్ర	పం	ష	కా
				11వ చక్రము - రుద్ర				
61	కాంతామణి	ష	చ	అం	ప్ర	పం	శు	శు
62	రిషభప్రియ	ష	చ	అం	ప్ర	పం	శు	కై
63	లతాంగి	ష	చ	అం	ప్ర	పం	శు	కా
64	వాచస్పతి	ష	చ	అం	ప్ర	పం	చ	కై
65	మేచకల్యాణి	ష	చ	అం	ప్ర	పం	చ	కా
66	చిత్రాంబరి	ష	చ	అం	ప్ర	పం	ష	కా
				12వ చక్రము - ఆదిత్య				
67	సుచరిత్రము	ష	ష	అం	ప్ర	పం	శు	శు
68	జ్యోతిస్వరూపిణి	ష	ష	అం	ప్ర	పం	శు	కై
69	ధాతువర్ధని	ష	ష	అం	ప్ర	పం	శు	కా
70	నాసికాభూషణి	ష	ష	అం	ప్ర	పం	చ	కై
71	కోసలము	ష	ష	అం	ప్ర	పం	చ	కా
72	రసికప్రియ	ష	ష	అం	ప్ర	పం	ష	కా

17. వివాది మేళకర్తలు

మేళకర్తలు 72లో శుద్దగాంధారము, శుద్ద నిషాదము, షట్‌శృతి రిషభము, షట్‌శృతి దైవతములలో ఏఒక్కటిగాని, రెండుగాని ఈ స్వరస్థానములు కలిగియున్న మేళకర్తలను వివాది మేళకర్తలుగా పేర్కొనిరి. ఎందుకనగా షోడశ స్వరస్థానములందు శు॥గాం, ష॥రి, ఒకేవిధముగాను, శు॥ని, ష॥దై ఒకేవిధముగా నుండుటవలన ఈ నాలుగు స్వరస్థానములలో ఏఒక్కటిగాని, రెండుగాని కల మేళకర్తలను వివాది మేళకర్తలుగా పేర్కొనిరి. ఇవి మొత్తము 40 వివాది మేళకర్తలు.

స్వరము	చక్రములు	వివాది మేళములు
శుద్ధగాంధారము	1, 7	6 × 2 = 12
షట్ శృతిరిషభము	6, 12	6 × 2 = 12
శుద్ధ నిషాదము కల 1వ మేళము, షట్‌శృతి దైవతము కల 6వ మేళము	2, 3, 4, 5, 8, 9, 10, 11	8 × 2 = 16
		మొత్తము = 40

18. గ్రహ భేదము

ఒక రాగమూర్ఛనయందలి షడ్జమమును కాక మిగిలిన స్వరములలో ఏదైన ఒక స్వరమును షడ్జమముగ స్వీకరించుటనే గ్రహభేదము అందురు. ఈ గ్రహభేదములు రెండు రకములు: 1) సాధారణ గ్రహభేదము, 2) విశేష గ్రహభేదము.

1. సాధారణము: స్వరములను మాత్రమే స్థూలముగ గ్రహభేదము చేయు పద్ధతి.
2. విశేషము: నియమిత సంఖ్యలతో కూడిన శ్రుతులు అంతరములుగా ఏర్పడిన స్వరములను ఆయా అంతరములలో చేయుట.

19. మేళకర్తల సంఖ్యను కనుగొను విధానము

కటపయాది సూత్రము :

మేళకర్తల పేర్లనాధారముగా మేళకర్త సంఖ్యను కనుగొను విధానమును కటపయాది సూత్రముగా వర్ణించిరి.

కాదినవకము : క, ఖ, గ, ఘ, ఙ, చ, ఛ, జ, ఝ, ఞ.

టాదినవకము : ట, ఠ, డ, ఢ, ణ, త, థ, ద, ధ, న.

పాదిపంచకము : ప, ఫ, బ, భ, మ.

యాద్యష్టకము : య ర ల వ శ ష స హ

గుణించు విధానము : రాగములోని మొదటి రెండు అక్షరముల తీసుకొని, మొదటి అక్షరమునకు ఏకస్థానము, రెండవ అక్షరమునకు దశమస్థానమునిచ్చి రెంటిని కూడిన మేళకర్త సంఖ్య వచ్చును.

ఉదా : 37 మేళకర్త సాలగము

సాలగములోని మొదటి అక్షరము సా, రెండవ అక్షరము ల

సా అనునది యాద్యష్టకములోని 7వ స్థానమునందున్నది. ల అక్షరము యాద్యష్టకములో 3వ స్థానమునందున్నది.

మొదటి అక్షరము విలువ 7×1=7

రెండవ అక్షరము విలువ 3×10=30

మొత్తం విలువ 37

అనగా సాలగము యొక్క మేళకర్త సంఖ్య : 37

సంయుక్తాక్షరములలో గుణించుట

ఉదాహరణకు షణ్ముఖప్రియ :

మొదటి అక్షరము ష. ఇది యాద్యష్టకమునందు 6వ స్థానమందున్నది. దీనికి ఏక స్థానము నిచ్చిన 6×1=6

రెండవ అక్షరము ణ్ము. ఇది సంయుక్తాక్షరము ఇందు ణు+మ=ణ్ము. ఇందలి హల్లుని లెక్కింపక, మకారమును తీసుకొనిన, అది పాది పంచకములో 5వ సంఖ్య. దీనికి దశమస్థానము నిచ్చిన 5×10=50. మొదటి+రెండవ సంఖ్యలను కూడిన వచ్చునది 56. అదే దాని మేళకర్త సంఖ్య.

కొన్ని మేళకర్తలకు పైసూత్రము వర్తించదు. అవి ఏవనగా 1. రత్నాంగి, 2. సూర్యకాంతము, 3. షడ్విద మార్గిణి, 4. ధర్మవతి.

కొన్ని మేళకర్తలకు 0 దశమ స్థానమున వచ్చిన, ఆ సంఖ్యను 0 విలువనిచ్చి ఏకస్థానములోనున్న అంకెను మాత్రమే లెక్కింపవలెను.

ఉదా : సేనాపతి

సే(స) అక్షరము యాద్యష్టకమునందు 7 అంకె. నా అక్షరము టా ది నవకములో 10 సంఖ్య. దశమ స్థానమునందున్నప్పటికి ఈ సంఖ్యకు విలువలేదు. 9 అంకెల వరకే విలువ కట్టబడుతుంది కావున దీనివిలువ పూజ్యముగా(సున్న) గుర్తించవలెను.

మొదటి అంకె గుణితము 7×1=7

రెండవ అంకె గుణితము 10×0=0

మొత్తము 7

కావున సేనాపతి మేళకర్త సంఖ్య : 7

20. తాళములు-తాళదశ ప్రాణములు

కీర్తన లేక కృతిని గానము చేయునప్పుడు, కాలమును తెలియచేయు కొలతనే తాళము అందురు. ఇదివరలో సప్తతాళవర్ణనను తెలుసుకొంటిమి. అవి అన్నియును అంగములమీదనే నడచును. కొన్ని కీర్తనలు అంగములు లేక క్రియలమూలముగా సూచింపబడును. ఒక హ్రస్వాక్షరమును పలుకు కాలమును ఒక అక్షరకాలమనబడును.

1. దేశాధి తాళము

నేటి కాలమందు ప్రచారములో లేదు. ఈ తాళమునకు ఒక విసర్జితము మూడు ఘాతలు కలిగియుండును. తాళము వేయునప్పుడు విసర్జితములో 3/4 మాత్ర లేక 3 అక్షరకాలము వ్యవధి అయిన పిదప సంగీత రచన ప్రారంభింపబడును.

2. మధ్యాధి తాళము

ఇది నేడు ప్రచారములో లేదు. ఒక విసర్జితము 3 ఘాతలు కలిగియుండును. తాళము వేయునప్పుడు విసర్జితములో 1/2 మాత్ర లేక 2 అక్షరకాలముల వ్యవధి తరువాత సంగీత రచన ప్రారంభించబడును. దీని నడక దేశాధి తాళముకన్న చురుకుగానుండును.

3. చాపు తాళము

వీటియందు అంగములు లేవు. క్రియలనాధారముగా తాళము నడచును. వాగ్గేయకారులు ఈ తాళమునకు రెండు ఘాతలుగా నిర్ణయించిరి. కాని ప్రస్తుతము 4 ఘాతలతో ఒక విసర్జితము లేక 3 ఘాతలతో వేయుచున్నారు. ఇది 4 విధములుగా వర్ణించబడినది.

తిశ్రచాపు తాళము (1+2): రెండు ఘాతలు కలిగి మొదటి ఘాతకు ఒక అక్షరము రెండవ ఘాతకు రెండు అక్షరకాలము ఉండును.

మిశ్రచాపు తాళము: దీనియందు రెండు ఘాతలు కలిగియుండి, మొదటి ఘాతకు 3 అక్షరకాలము, రెండవ ఘాతకు 4 అక్షరకాలము కలిగియుండును. కొన్ని రచనలలో మొదటి ఘాతకు 4 అక్షరకాలము రెండవ ఘాతకు 3 అక్షరకాలమును సూచించును.

ఖండచాపు తాళము: దీనియందు రెండు ఘాతలు కలిగియుండి, మొదటి ఘాతకు 2 అక్షరకాలము, రెండవ ఘాతకు 3 అక్షరకాలముగా సూచించిరి.

సంకీర్ణచాపు తాళము: దీనికి రెండు ఘాతలు కలిగియుండి, మొదటి ఘాతకు 4 అక్షరములు, రెండవ ఘాతకు 5 అక్షరకాలములుండును.

తాళదశ ప్రాణములు: కీర్తనగాని కృతినిగాని పాడునప్పుడు తాళము చేతితోగాని, వాయిద్యముతోకాని, కాలమును కొలచు పద్ధతిని కాలప్రమాణముగా స్వీకరించపడినది. ఈ తాళములు రెండు రకములు. 1) మార్గ తాళములు 2) దేశీయ తాళములు. వీటిని మరల 1. శుద్ధము 2. సాలగము 3. సంకీర్ణముగా

విభజింపబడినవి. తాళమునకు 10 ప్రాణములు (లక్షణములు) కలవు. వీటినే తాళదశ ప్రాణములుగా వర్ణించిరి. ఇందు మొదటి 5 ప్రాణములను మహా ప్రాణములనియు, తదుపరి 5 ప్రాణములను ఉప ప్రాణములు లేక అముఖ్య ప్రాణములందురు.

మహా ప్రాణములు (5)

కాలప్రాణము: ఇది సంగీతముయొక్క వేగమును తెలుపునది. దీనివలన తాళాంగముయొక్క విలువ తెలియును. మొదటగా పాడు కాలవేగమును ప్రథమ కాలమని, ప్రథమ కాలమునకు రెట్టింపు వేగము ద్వితీయకాలమని, ద్వితీయ కాలమునకు రెట్టింపు వేగము తృతీయ కాలమని, తృతీయ కాలమునకు రెంట్టింపు వేగము చతుర్థకాలమని పిలువబడుచున్నది.

నూరు తామర రేకులను ఒకదానిపై ఇంకొకటి పెట్టి, వాడియైన సూదితో పొడిచిన, అందు ఒక రేకు తెగిన సరాసరి కాలమును క్షణమందురు. అటువంటి

8 క్షణములు - 1 లవము

8 లవములు - 1 కాష్ఠము

8 కాష్ఠములు - 1 నిముషము

8 నిముషములు - 1 కళ

2 కళలు - 1 చతుర్భాగము

2 చతుర్భాగములు లేక 4 కళలు = ఒక అనుద్రుతము, 1/4 మాత్ర (μ)

ఒక అక్షరకాలపు విలువ దీనినే తృటి లేక విరామమందురు.

2 అనుద్రుతములు = ఒక ద్రుతము (0), 1/2 మాత్ర లేక 2 అక్షరకాలము

2 ద్రుతములు = 1 చతురస్ర లఘువు (1) లేక 1 మాత్ర అనగా 4 అక్షరకాలము

2 చతురస్ర లఘువులు = 1 గురువు లేక 2 మాత్రలు = 8 అక్షరకాలము

3 చతురస్ర లఘువులు = 1 ప్లుతము = 3 మాత్రలు = 12 అక్షరకాలము

4 చతురస్ర లఘువులు = 1 కాకపాదము (†) = 4 మాత్రలు = 16 అక్షరకాలము

నేటి సంగీతమునందు, అనుద్రుతము, ద్రుతము, లఘువు, గురువు, ప్లుతము కాకపాదము అనే తాళాంగములనే వాడుచున్నారు. మరి కొందరు, 35 తాళాంగములలో మొదటి 3 అంగములనే ప్రధానముగా వాడుచున్నారు.

మార్గప్రాణము: రెండవదియగు మార్గప్రాణమునకు ఆరు రకములైన మార్గములు కలవు. వీటిని షణ్మార్గములందురు. ఇవి 1. దక్షిణము 2. వార్తీకము 3. చిత్రము 4. చిత్రతరము 5. చిత్రతమము 6. అతి చిత్రతమము.

దక్షిణము: ఇందు ఒక క్రియకు 8 మాత్రల ప్రమాణముగా నడచును. అనగా 8 క్రియలు × 4 అక్షరములు = మొత్తం 32 అక్షరకాలమునకు సమానము.

వార్తీకము: ఇందు ఒక క్రియకు 4 మాత్రల ప్రమాణముగా నడచును. అనగా 4 క్రియలు × 4 అక్షరములు = 16 అక్షరకాలమునకు సమానము.

చిత్రము: ఇందు ఒక క్రియకు 2 మాత్రల ప్రమాణముగా నడచును. అనగా 2 క్రియలు × 4 అక్షరములు = 8 అక్షరకాలమునకు సమానము.

చిత్రతరము: ఇందు ఒక క్రియకు 1 మాత్ర ప్రమాణమున నడుచును. అనగా 1 క్రియకు 4 అక్షరములు = 4 అక్షరకాలమునకు సమానము.

ఉదా : చిత్రతరమార్గం : త్యాగరాజు
నాదోపాసన - బేగడ - ఆదితాళము
నామకుసుమముల
శ్రీరాగం - రూపకతాళము

చిత్రతమము: ఒక క్రియకు 1/2 మాత్రప్రమాణమున నడచును. అనగా 1/2 మాత్ర × 4 అక్షరకాలము = 2 అక్షరకాలమునకు సమానము.

ఉదా : చిత్రతమ మార్గం : త్యాగరాజు - నాద తనుమనిశం - చిత్తరంజని - ఆదితాళము
నిత్యరూపమెవరి పాండిత్యమేమి - దర్బారు - రూపకతాళము
తుంగ తరంగె గంగే - సదాశివబ్రహ్మం - కుంతల వరాళి - ఆదితాళము

అతి చిత్రతమము: ఒక క్రియకు 1/4 మాత్ర ప్రమాణమున నడచును. అనగా 1/4 మాత్ర × 4 అక్షరములు = ఒక అక్షరకాలమునకు సమానము.

ఉదా : అతి చిత్రతమమార్గం : త్యాగరాజు
నాదుపై బలికేరు నరులు - మధ్యమావతి - ఖండచాపు తాళము
నమ్మివచ్చిన నన్ను - కల్యాణి - రూపకతాళము

క్రియా ప్రాణము : ఇందు తాళమును చూపు సంజ్ఞాప్రక్రియ. తాళము వేయనప్పుడు ఉసి, దెబ్బలే కాక, గానము చేయునప్పుడు వివిధ ప్రక్రియలను చేతితో చూపు విధానము. ఇందు రెండు రకములు 1) మార్గ క్రియలు 2) దేశ్య క్రియలు.

మార్గ క్రియలు :

ఇందు రెండు రకములు కలవు. 1) సశబ్ద క్రియ 2) నిశబ్ద క్రియ

1) సశబ్ద క్రియ :

ఈ క్రియయందు చేతులతో శబ్దము వచ్చునట్లు చేయు తాళాంగక్రియ. సశబ్ద క్రియ 4 రకములు. 1. ధృవము 2. శమ్యము 3. తాళము 4. సన్నిపాతము.

దృవము : కుడిచేతి బొటనవేలు, ఉంగరపు వేలుతో శబ్ధము వచ్చునట్లు చిటికె వేయుటను దృవమందురు.

శమ్యము : కుడిచేతియందు ఎడమ చేతితో శబ్ధము వచ్చునట్లు ఘాత వేయుటను శమ్యమందురు.

తాళము : ఇది శమ్యమునకు వ్యతిరేక దిశలో అనగా ఎడమ చేతియందు కుడిచేతితో శబ్ధము వచ్చునట్లు ఘాతవేయుటను తాళమందురు.

సన్నిపాతము : కుడి, ఎడమ చేతులను అభిముఖముగా నిలువుగా పెట్టి, రెండు హస్తములతో సమముగా ఘాతవేయుటను సన్నిపాతమందురు.

2) నిశ్శబ్ధ క్రియ :

శబ్ధము లేకుండా చేయు తాళప్రక్రియను నిశ్శబ్ధక్రియ అందురు. ఇందు 4 రకములు కలవు. అవి

1. అవాపము 2. నిష్క్రామము 3. విక్షేపము 4. ప్రవేశికము.

అవాపము : ఊర్ధ్వ ముఖమున, పైకెత్తబడిన పతాక హస్తముయొక్క తర్జనీ మొదలగు నాలుగు వ్రేళ్ళను ముడుచుటను అవాపమందురు.

నిష్క్రామము : అవాపమునందు ముడిచిన నాలుగు వ్రేళ్ళను క్రమముగా విప్పుటను నిష్క్రామమందురు.

విక్షేపము : నిష్క్రామమందు విప్పిన హస్తమును కుడివైపునకు విదిలించుటను విక్షేపమందురు.

ప్రవేశికము : విక్షేపమునందు విదిలించిన హస్తమును అప్రదక్షిణముగా క్రిందివైపునుండి ముందుకు రానిచ్చుటను ప్రవేశికమందురు.

దేశ్యక్రియలు (8) : ఇందు 8 రకముల క్రియలు కలవు. అవి 1. దృవక 2. సర్పిణి 3. కృష్ణ 4. పద్మిని 5. విసర్జిత 6. విక్షిప్త 7. పతాక 8. పతిత.

దృవక : శబ్ధముతో కూడిన కుడి హస్తపు ఘాతను దృవకమందరు.

సర్పిణి : కుడిచేతి పతాక హస్తమును ఎడమవైపునకు చాచుటను సర్పిణియందురు.

కృష్ణ : సర్పిణియందు ఎడమవైపునకు చాచిన కుడిచేతి పతాక హస్తమును కుడివైపునకు తెచ్చుటను కృష్ణమందురు.

పద్మిని : అరచేతిని క్రిందుగా చేసి, అధోముఖముగా చేతిని ముందుకు చాచుటను పద్మినియందురు.

విసర్జితము : పద్మినిలో అధోముఖముగానున్న హస్తమును, వెలుపలకు విసురుటను విసర్జితము లేక విచ్చు అని అందురు.

విక్షిప్త : పైన చెప్పిన హస్తముయొక్క వేళ్ళను ముడుచు క్రమమును విక్షిప్తయందురు.

పతాక : పతాక హస్తముగా పట్టిన చేతిని మీదకు ఎత్తుటను పతాక క్రియమందురు.
పతిత : పతాక హస్తమును క్రిందకు దించు క్రియను పతిత అందరు.

వివిధ క్రియా ప్రాణములు తెలుపు పట్టిక



4. **అంగప్రాణము** : తాళాక్షరకాల విలువను తెలియచేయునది అంగప్రాణము. వీటిని వివిధ సంజ్ఞలతో తెలియపరచిరి. అంగప్రాణములను 1) షడాంగములుగను 2) షోడశాంగములుగను విభజించిరి.

షడాంగములు (6)

అనుదృతక్రియ : ఎడమ అరచేతిమీద, కుడి హస్తముతో ఘాత వేయుట దృవకమని, దీనినే తట్టు అనికూడ అందురు. ఇది ఒక అక్షరకాలపు విలువ కలది దీని గుర్తు U.

దృతక్రియ : ఎడమ అరచేతిలో కుడి హస్తముతో కొట్టి విసురుట (విసర్జిత)ను దృతక్రియ యందురు. ఇది రెండు అక్షరకాలపు విలువ కలది. దీని గుర్తు O.

లఘుక్రియ : ఎడమ అరచేతియందు కుడి చేతితో కొట్టి, చిటికెన వ్రేలు మొదలుగా వేళ్ళను లెక్కించుటను లఘుక్రియ యందరు. దీని అక్షరకాలము విలువ 3,4,5,7,9గా నుండును. దీనిని గురు 'I'. దీనిని మాత్ర, సరళము, హ్రస్వము, కళ అను పేర్లతోకూడ పిలువబడుతుంది.

గురుక్రియ: ఎడమ అరచేతియందు కుడి చేతితో కొట్టి, చిటికెన వ్రేలు మొదలుగా మూడు వేళ్ళను లెక్కించి కుడిచేతిని 4 అక్షరకాలము క్రిందకు విడచు క్రియను గురుక్రియ అందురు. ఇది 8 అక్షరకాలము విలువ కలది. దీని గుర్తు 'ళి'. దీనికి ద్విమాత్రకము, దీర్ఘము, వక్రము, కాణము, యమళము అను నామాంతరములు కూడ కలవు.

ప్లుతక్రియ: ఎడమ అరచేతియందు కుడిచేతితో కొట్టి 3 వేళ్ళను లెక్కించి కుడిచేతిని, ఎడమ చేతిచుట్టూ 4 అక్షరకాలము చుట్టి, మరల 4 అక్షరకాలము క్రిందకు దించు క్రియను ప్లుతక్రియ యందురు. ఇది 12 అక్షరకాలమును తెలియచేయు సశబ్దక్రియ దీని సంకేతిము 'ళి'. దీనికి త్రయంగము, దీపము, త్రిమాత్రకము, సమోద్భవము అని నామాంతరములు కలవు.

కాకపాదము : ఇది ఒక నిశ్శబ్దక్రియ. పూర్తిగా నిశ్శబ్దక్రియ గావున, మంగళకరము కాదని వాడుక నుండి తొలగించిరి. కుడిచేతిని 4 అక్షరకాలము ఎడమ వైపునకు తెచ్చి, తదుపరి 4 అక్షరకాలము కుడివైపునకు తిప్పి, తదుపరి కుడిచేతిని 4 అక్షరకాలము మీదకు ఎత్తి, తదుపరి 4 అక్షరకాలము క్రిందకు దించుటను కాకపాదమందురు. ఇది మొత్తము 16 అక్షరకాలము విలువ. దీని గుర్తు (†). దీనినే హంసపాదము, నిశ్శబ్దము, చతుర్లఘువు అని పేర్లతోకూడా పిలువబడుచున్నది.

తాళ షడంగముల పట్టిక

అంగ సంఖ్య	1	2	3	4	5	6
షడంగముల నామములు	అనుద్రుతము	ద్రుతము	లఘువు	గురువు	ప్లుతము	కాకపాదము
అంగ సంజ్ఞలు	U	O	I	'	I '	†
అక్షరకాలము	1	2	4	8	12	16
మాత్రలు	1/4	1/2	1	2	3	4

షోడశాంగముల పట్టిక

	నామము	అంగ సంజ్ఞ	అక్షరకాలము
1	అనుద్రుతము	U	1
2	ద్రుతము	O	2
3	ద్రుతవిరామము	UO	3
4	లఘువు (చతురస్ర)	I	4
5	లఘు విరామము	UI	5
6	లఘుద్రుతము	OI	6
7	లఘుద్రుత విరామము	UOI	7
8	గురువు	'	8
9	గురు విరామము	U'	9
10	గురుద్రుతము	O '	10
11	గురుద్రుతవిరామము	UO'	11
12	ప్లుతము	I '	12
13	ప్లుతవిరామము	U '	13
14	ప్లుతద్రుతము	O '	14
15	ప్లుత ద్రుతవిరామము	UO '	15
16	కాకపాదము	†	16

5. గ్రహప్రాణము : తాళములో సంగీతమును ప్రారంభించు సమయమును గ్రహప్రాణమందురు. దీనిని తెలుగులో 'ఎత్తులు' అనికూడా అందురు. గ్రహప్రాణము రెండు విధములు. 1) సమగ్రహము 2) విషయగ్రహము

సమగ్రహము: సంగీతమును, తాళమును ఒకేసారి ప్రారంభించుటను సమగ్రహమందురు.

ఉదా : సామజవరగమన - హిందోళం - ఆదితాళం

విషమగ్రహము: పాటనుగాని, తాళమునుగాని, ఏదో ఒక దానిని ముందు ప్రారంభించి, రెండవది తరువాత మొదలు పెట్టుటను విషమగ్రహమందురు. ఇందు రెండు రకములు. 1) అతీతము 2) అనాహతము.

అతీతము: కీర్తనలోని పల్లవిగాని, ఇతర భాగములుగాని తాళమునకు (మొదటి ఘాతకు) ముందే మొదలుపెట్టుట.

ఉదా : అలకలల్ల - మధ్యమావతి - రూపకము

అనాహతము : తాళమును ప్రారంభించిన తరువాత పాట ప్రారంభించుటను అనాహతమందురు.

ఉదా : సీతాపతే - ఖమాస్ - ఆదితాళము

గ్రహత్రయము : సమగ్రహము, అతీత, అనాహత గ్రహములను కలిపి గ్రహత్రయమందురు.

6. జాతిప్రాణము: తాళాంగములో లఘు(1)పరమైన మార్పును (అక్షరములు) జాతి అందురు. ఇది ఒక లఘువునకు మాత్రమే వర్తించును. ఇందు 5 రకములు కలవు. జాతిభేదముల లఘువులు ఈ క్రింది పట్టికలో చూడవచ్చును.

	జాతినామము	అక్షరములు	లఘువు నామము
1	తిశ్రజాతి	3	స్వర్ణ
2	చతురస్రజాతి	4	మనుష్య
3	ఖండజాతి	5	దేశ్య
4	మిశ్రజాతి	7	హంస
5	సంకీర్ణజాతి	9	చిత్ర

మిశ్ర, ఖండ, సంకీర్ణ జాతులు ఏర్పడు విధము :

మిశ్రజాతి: తిస్రజాతి (3) + చతురస్ర (4) జాతిలను మిశ్రమించుటచే మిశ్రజాతి ఏర్పడును. దీనియందు 7 అక్షరములు.

ఖండజాతి: మిశ్రజాతి (7) + తిస్రజాతి (3) అక్షరముల మొత్తమును 2చే ఖండించిన వచ్చునదే ఖండజాతి. దీనికి అక్షరములు 5.

సంకీర్ణజాతి: ఖండజాతి (5) + చతురస్రజాతి (4) అక్షరములను సంకీర్ణము చేయుటవలన వచ్చునదే సంకీర్ణజాతి. దీని అక్షరములు 9.

7. కళప్రాణము: తాళముయొక్క సమాంతర భాగములు కళలనబడును. ఉదా : చతురస్రజాతి లఘువుకు 4 అక్షరములు. అక్షరకాలమొక్కింటికి 4 కళలు వంతున నడిపిన 4×4=16 కళలగును. వీటిని హ్రస్వా

క్షరము ప్రమాణముగా లెక్కించవలయును. అక్షరకాలమునకు కళలు రచననిపట్టి మారుచుండును. వీటినే గతిభేదముగా వర్ణించిరి. ఇవి ఒక అక్షరకాలమున 1,2,3,4,5 విధముల కళలుండును. సంగీత రత్నాకరమునందు 1) ఏకకళ 2) ద్వికళ 3) చతుష్కళలను పేర్కొనిరి.

8. లయప్రాణము: గానముతోచేరి తాళము సమముగా నడచుటను లయప్రాణమందురు. ఇది మూడు విధములు. 1) విళంబలయ 2) మధ్యలయ 3) దృతలయ.

1) విళంబలయ : తాళమునకేర్పడియున్న అక్షరకాలముతో మందగతిగా నడుపు ప్రక్రియను విళంబలయ లేక చౌకము అందురు. దీనినే ఒకటవ కాలము లేక ప్రధమ కాలమందురు.

ఉదా : పరమపావనరామ - పూర్వికల్యాణి - ఆదితాళము

2) మధ్యలయ: తాళమునకేర్పడియున్న అక్షరకాలముతో విళంబలయకు రెట్టింపు వేగముతో సమగతిన నడచునది మధ్యమలయ అందురు. దీనినే రెండవ కాలము లేక ద్వితీయ కాలమందురు.
ఉదా : నెనరుంచినాను - మాళవి - ఆదితాళము

3) దృతలయ: తాళమునకేర్పడియున్న అక్షరకాలముతో, మధ్యలయకు రెట్టింపు వేగముతో త్వరితగతిన, నడుపు ప్రక్రియను దృతలయ అందురు. దీనినే మూడవ కాలము లేక తృతీయ కాలమందురు.

ఈ మూడు లయలను త్రికాలములందురు. మొదటి కాలమున స్వరముల క్రింద గీతయుండదు. రెండవ కాలమునందు ఒక అడ్డగీత, మూడవకాలమునందు రెండు అడ్డగీతలుండును.

9. యతిప్రాణము: ఒక తాళములోగల అంగములయొక్క వ్యత్యాసమైన చేరిక యతి అనబడును. శారంజ్ఞ దేవుడు యతిప్రాణము మూడు విధములుగా వర్ణించిరి. 1) సమయతి 2) స్రోతోవహయతి 3) గోపుచ్ఛయతి. నేటి కాలమున యతిప్రాణములు 6 విధములుగానున్నవి.

1) సమయతి: ఒక తాళావర్తములో గల అన్ని అంగములు ఒకేరీతిలో యున్నచో, దానిని సమయతి అందురు. దీనికి మరోపేరు 'పిపీలిక'యతి. అనగా చీమల బారువలె ఒకే రీతిలోనుండును.

ఉదా : సగరిగమప
UUUUUU

2) గోపుచ్ఛయతి : ఒక తాళావర్తములోగల అంగములు ఆవుతోకవలె మొదట ఎక్కువగాను, క్రిందకు పోయినకొద్దీ తగ్గుచుండును. దీని సంకేతము 1/8 8IOU.

ఉదా : రచన : ముత్తుస్వామి దీక్షితులు : ఆనంద భైరవి - రూపకతాళము

త్యాగరాజ యోగ వైభవం
రాజయోగ వైభవం
యోగ వైభవం
వైభవం
భవం
వం

3) శ్రోతోవహయతి: ఒక తాళావర్తములోని అంగములు మొదట చిన్నదిగానుండి, క్రమముగా పెరుగుటను శ్రోతోవహయతి అందురు. ఇది గోపుచ్ఛయతికి ప్రతిసవ్యదిశలో నుండును. దీని సంకేతము UOI8 1/8.

ఉదా : ముత్తుస్వామి దీక్షతుల కృతి

శం
ప్రకాశం
స్వరూప ప్రకాశం
తత్వ స్వరూప ప్రకాశం
సకల తత్వ స్వరూప ప్రకాశం
శివశక్త్యాది సకల తత్వ స్వరూప ప్రకాశం

4) డమరుకయతి: తాళావర్తములోని అంగములు శివుని డమరుకమువలె నడుమ కురచగాను, రెండువైపుల వెడల్పుగాను యుండును. దీనిని 'హుడుక్క' లేక 'ఉడుక' అను పేర్లు కలవు. దీని సంకేతము 8IOUOIళి.

5) మృదంగయతి: ఒక తాళావర్తములోని అంగములు మధ్య ఎక్కువగాను, రెండువైపుల తక్కువగాను మృదంగమును పోలియుండుట వలన మృదంగయతి అందురు. ఇది డమరుకయతికి అపసవ్యదిశలో యుండును. దీని సంకేతము UOIళిIOU.



6) విషమయతి : తాళావర్తములోని అంగములు ఒక నియమిత పద్ధతిలోనుండక, పలు విధములుగా పెరుగుట/తరుగుటను విషమయతి అందురు. దీని సంకేతము IOUOIళిU.

10. ప్రస్తారప్రాణము: ఒక తాళములోని అంగములను వాటి అంతర్గత అంగములతో వీలైనన్ని విధములుగా ప్రస్తారించి తాళభేదమును కల్పించుటను ప్రాస్తారప్రాణమందురు.

ఉదా : చతురస్ర లఘువును తీసికొన్నచో దీనిలో 1) దృత శేఖరము O^{U} 2) దృతము 'O' 3) అనుదృతము 'U' అను మూడు అంతర్గత అంగములుండును. వీటిలో 8 ప్రస్తారములు వచ్చును. 1) I, 2) $\overset{U}{O}$U, 3) $\overset{U}{O}$, 4)OUU, 5)U$\overset{U}{O}$, 6)UOU , 7)UUO , 8)UUUU

ఇదేవిధముగా దృతశేఖరమును తీసుకొన్నచో 4 ప్రస్తారములు వచ్చును. $\overset{U}{1}$)O 2)UU 3) UO 4) UUUU వచ్చును. షడంగములు 1. చతురంగ ప్రస్తారము అనగా Iళిళి+ 2. షడంగ ప్రస్తారము అనగా UOIళిళి+.

షోడశాంగ ప్రస్తారమున అనుదృతము మొదలుకొని విరామములతో కలిపి కాకపాదము వరకు 16 అంగములుండును.

21. పంచదశ గమకములు

సంగీతమును వినువారి చిత్తమును రంజింపచేయునట్లు, సంగీత స్వరములను నిర్దేశించిన ఆయా స్వరములందే గానము చేయక, స్వరములను కదిలించి పాడుటను గమకమందురు. గమకములు 15గా సారంజ్ఞ దేవుడు, వెంకటమఖి, గోవింద దీక్షితులువారు నిర్ణయించిరి. సంగీత మకరందమున నారదులవారు 19గా ప్రస్తావించిరి.

1. కంపితము: ఒక స్వరమును ఒక అక్షరకాలముపాటు కంపించి, దానిమీద స్వరచ్ఛాయ రాకుండునట్లు చేయుట.

దీని సంకేతము

2. లీనము: లీనము అనగా లయింపు లేక తగులుట. ఒక స్వరమును రెండు అక్షరకాలములు కదిలించి, దానిమీద స్వరముయొక్క చ్ఛాయలను రప్పించుటను లయించుట అందురు.

3. ఆందోళితము: ఆందోళితమనగా ఊగుట. ఒక స్వరమును 4 అక్షరకాలముపాటు కదిలించి మీదిస్వరముయొక్క చ్ఛాయను రప్పించుటను ఆందోళితమందురు.

4. ప్లావితము: ప్లావితము అనగా తేలుట. ఒక స్వరమును 12 అక్షరకాలముపాటు కదిలించి, దాని దగ్గర స్వరచ్ఛాయను రప్పించుటను ప్లావితమందురు.

పైన తెలిపిన 1 నుండి 4 గమకములను కంపిత భేదగమకములుగా పరిగణింతురు.

5. స్ఫురితము (లేక) డోలము: దీని సంకేతము $\dot{.}$ $\dot{.}$ సస, రిరి అను ఆరోహణ జంటస్వరములోని 'సస'లలో రెండవ 'స' ను 1/3 అక్షరకాలము నిలిపి కొట్టి, క్రింది స్వరముయొక్క చ్ఛాయను రప్పించుటను స్ఫురితమందురు. దీనిని డోలము అనికూడ అందురు.

ఉదా : 'సస' అను జంట స్వరములో రెండవ స్వరము పలుకునప్పుడు 'సరిస' అని పలికించవలెను.

5(1) ప్రత్యాఘాతము : సస, నిని, జంట స్వరముల అవరోహణలో, రెండవ స్వరమును 1/3 అక్షరకాలము నిలిపి, పై స్వరము యొక్క చ్ఛాయను రప్పించుటను ప్రత్యాఘాతమందురు.

ఉదా : సస, నిని అను జంట స్వరములలో రెండవ స్వరము పలుకునప్పుడు 'సనిస' అని పలికించవలెను.

6. తిరుపము: దీని సంకేతము **ɯ.** దీనినే నొక్కు గమకమందరురు. ఒక స్వరమును 1/2 అక్షరకాలము నిలిపి అదిమి, దానిపై స్వరముయొక్క చ్ఛాయను రప్పించుటను తిరుపము అందురు. అదిమినొక్కి పాడవలసిన స్వరము మీద **ɯ** గుర్తు పెట్టుదురు.

7. ఆహతము: దీనికి మరియొక పేరు కొట్టు గమకము**.** ఇది రెండు రకములు 1) రవ 2) ఖండింపు రవ :

ఒక స్వరము పైనుండి క్రిందకు దిగునప్పుడు, పైస్వరముయొక్క చ్ఛాయలో క్రిందకు దిగిన 'రవ' అందురు.

ఉదా : పమ - పపమ గాను, మగ - మమగ వలె పలికించవలెను.

ఖండింపు : ఒక స్వరము పైనుండి క్రిందకు దిగునప్పుడు, అదిమి దాని స్వరముగాక, క్రిందనుండు స్వరచ్ఛాయ పొందిన దానిని ఖండింపు అందురు.

ఉదా : 'మరి' అను దానిని మగరి గాను

'నిప' అను దానిని నిదప గా పలికించవలెను.

8. వళి: ఒక స్వరమును నుడియించి పట్టి పైస్వరముయొక్క ఛ్ఛాయను వచ్చునట్లు చేయుటను వళి అందురు.

9. ఉల్లసితము: దీనినే జారుగమకమందురు దీనిలో ఎక్కు మరియు దిగు జారుగమకములు కలవు.

ఎక్కు గమకము : ఒక స్వరము నుండి వేరొక స్వరమునకు పోవునప్పుడు దాని మధ్యనుండు స్వరచ్ఛాయలు వ్యక్తముగావు.

ఉదా : షడ్జమము నుండి పంచమమునకు పోవునపుడు, దానిమధ్య నుండు రిగమ స్వర స్థానములు వ్యక్తముగావు.

దిగు జారు: పైవిధముగా పంచమము నుండి షడ్జమమునకు వచ్చునపుడు మగరి స్వరస్థానములు వ్యక్తముగావు.

10. హంపితము: దీనినే గుంభితమని యందురు. ఇది జారుడు గమకమును పోలియుండి ఆరోహణలో ఎక్కునప్పుడుగాని, అవరోహణలో దిగునప్పుడుగాని 'హం' అన్నట్లు నాదము చేయును.

11. కురుళము: దీనిని 'ముంగురు'లని పిలుతురు. ఇవి రెండు రకములు 1) ఒదిగింపు 2) ఒరయిక

1) ఒదిగింపు: ఒక స్వరస్థానమునందు దానిపై స్వరముగాని, లేక రెండవ స్వరముగాని పలుకునట్లు చేయుటను ఒదిగింపు అందురు.

ఉదా : రిషభమునందే గాంధారము లేక మధ్యమమును పలికించుట. ఈ గమకము వీణానాదమందు మాత్రమే సాధ్యమగును.

2) ఒరయిక: ఒక స్వరమునుండి మరియొక స్వరమునకు దిగునప్పుడు, దాని మీదిస్వరముయొక్క ఛ్ఛాయను కనుపించునట్లుగా ఒరుసుకొని (రాసుకుంటూ) దిగుటను ఒరయిక అందురు.

ఉదా : సా నీ దా పా : సారి నీస దాని పా వలె పలికించుట.

12. త్రిభిన్నము: ఇది వీణావాయిద్యమునందు మాత్రమే సాధ్యపడును. వీణయొక్క 1,2,3 తీగలను, ఎడమ చేతి వ్రేళ్ళతో అదిమిపట్టి కుడిచేతి వ్రేళ్ళతో ఒకేసారి రంజకముగా నుండునట్లు మీటుటను త్రిభిన్నమందురు.

13. ముద్రితము: నోటిని మూసి, స్వరములను అతి తక్కువస్థాయిలో కదిలించి పాడుటను ముద్రితమందురు.

14. నిమితము: నాదము తగ్గించి సూక్ష్మధ్వనితో పాడుటవలన కలుగు స్వరముల కదలింపును నిమితమందురు.

15. మిశ్రితము: పైన తెలిపిన గమకములలో రెండు మూడు గమకములను కలిపి పాడుటను మిశ్రితమందురు.

22. సంగీత వాయిద్యములు

సంగీత గాత్ర కచ్చేరిలలో అనేక సహకార వాయిద్యములను వాడెదరు. వాటియందు ముఖ్యమైనవి హార్మోనియం, తంబూర, వయోలిన్, వీణ, మృదంగము, ఘటము, సారంగి, వేణువు, మోర్సింగు. ఇవి కాక భజన సాంప్రదాయమందు భజంత్రీలు, చెక్క, లోహ తాళములు, కోలాటపు కర్రలను ప్రయోగించెదరు. సహకార వాయిద్యములవల్ల గాత్రకచ్చేరి రక్తి కట్టుటయేకాక, గాయకునికి కచ్చేరియందు కొంత ఊరట కలుగును. ఇందు ముఖ్యమైన వాయిద్యముల వివరణ ఇవ్వబడినది.

తంబూర

తంత్రి వాయిద్య విభాగమునకు చెందిన ఈ వాయిద్యమును, గాయకుని శృతిపక్వతకు ఉపయోగించెదరు. శృతి నాధారముగా చేసుకొని గాయకుడు మనోరంజకముగా గానము చేసి రాగమును రక్తి కట్టించెదరు. శృతి వాయిద్యము లేని కచ్చేరి రాణించదు. పూర్వము హార్మోనియమును ఆధారము చేసుకొని కచ్చేరి జరిగేది. దీని శృతికన్నా, తంబూర శృతి సజీవముగా, శ్రావ్యముగా నుండుటచే తంబూరకు ఎక్కువ ప్రాముఖ్యత లభించినది. నేటి కాలమునందు ఎలక్ట్రానిక్ శృతి బాక్సులు వచ్చినను, తంబూరతో సమానమైన నాదమును పలికించలేవు.

తంబూర పటము - భాగములు



తంబూరయొక్క ముఖ్య భాగములు:

తంబూరయందు ప్రధానభాగములు 1) కుండ 2) దండి 3) కుండపై బల్ల 4) వంతెన (బిడ్జి) 5) నాలుగు తంత్రులు 6) పూసలు 7) జీవాళి 8) ధ్వని రంధ్రములు 9) కూటీలు 10) మూలాధారము.

బాగుగా ముదిరిన పనస కర్రలను నీడలో ఆరపెట్టిన పిదప తయారు చేయుదురు. కుండ, దండి ప్రధాన భాగములు. ఈ రెంటిని ఒక దంతము ముక్కతో సంధానించెదరు. దండి చివర ఇరువైపుల 2+2 బిరడాలనమర్చెదరు. చెక్క బల్లకిరువైపులను దంతములతో చేసిన గుండ్రని బిరడాలను సన్నని రంధ్రములు చేసి బిగింతురు. వీటిద్వారానే శబ్ద తరంగములు బయటకు వచ్చును. తంత్రులను బిగించుటకు ఈ బిరడాలనే ఉపయోగింతురు. కుండ మధ్య భాగమున రంధ్రపు బ్రిడ్జినమరించి, తంత్రులకు నాగపాశము కట్టి బ్రిడ్జిమీదుగా దండికి చివరకల బిరడాతో బిగింతురు. వీటిమధ్యలో నాలుగు దంతపు పూసలతో శృతి నాణ్యతను పెంచెదరు. నాలుగు తంత్రుల వివరణ ఈ క్రింది పట్టికలో ఇవ్వబడినది.

సంఖ్య	తంత్రి పేరు	స్వరము	గేజు	తీగయొక్క లోహము పేరు
1	పంచమము	మధ్యస్థాయి	పంచమము 29	ఉక్కు
2	సారణి	తారాస్థాయి	షడ్జమము 31	ఉక్కు
3	అనుసారణి	తారాస్థాయి	షడ్జమము 31	ఉక్కు
4	మంద్రము	మంద్రస్థాయి	షడ్జమము 36	ఇత్తడి

తంబూరను పంచమ శృతిలోను, మధ్యమ శృతిలోను సరిచేయుదురు. తంత్రుల బలము ననుసరించి 1 నుండి 5 శృతుల వరకు సరిచేయవచ్చును. తంబూర తంత్రుల మధ్య ఊలు దారముల నుంచి, వీటి కదలికలతో తంబూరను సూక్ష్మముగా శృతి చేయవచ్చును. ఈ ఊలు దారములనే జీవాళి యందురు. ఈ విధముగా చేయుటవలన నియత స్థానములందు జీవాళి నిలచి, స్వయంభూ ధ్వనులు ఏర్పడి ఆధారశృతితో లీనమై జీవముగల ధ్వని ఉద్భవించును.

తంబూరను కుడి తొడవైపు అణుకువగా కూర్చుండ చేసి, కుడి చేతి మధ్య వేలితో ఒకటవ తీగను, చూపుడు వ్రేలుతో 2,3,4 తీగలను లయ తప్పకుండా మీటవలెను. ప్రపంచ ప్రసిద్ధినొందిన తంబూరలను ఆంధ్రప్రదేశ్‌నందలి విజయనగరము, బొబ్బిలిలోను, తంజావూరు, మైసూరు తిరువనంతపురము, లక్నో, మీరజ్, రాణీపూరులలో తయారు చేయుదురు.

వయోలిన్

వయోలిన్ పటము - భాగములు



వయోలిన్ తంత్రి వాయిద్యశాఖనందు, కమాన్ కట్టి వాయిద్యమునకు చెందినది. వయోలిన్ కర్నాటక సంగీతము నందు చాల ప్రాముఖ్యము నొందిన ప్రక్క వాయిద్యము. అయినను కొందరు వయోలిన్ కళాకారులు వయోలిన్ మీదనే కచేరీలు చేయుటకూడ అనవాయితి. ఈస్టిండియా కంపెని తెల్లవారిద్వారా, ఫిడేలు 400 సంవత్సరముల ముందే భారతదేశమునందు ప్రవేశపెట్టబడినది. దీని నాదము బహుళ శ్రావ్యముగా నుండుటచే, ముత్తుస్వామి దీక్షితులవారి కనిష్ట సోదరుడైన బాలస్వామి దీక్షితులు, అఖండ సాధనచేసి, వాయిద్యమునకు కొన్ని మార్పులు చేసి, వయోలిన్‌ను కర్నాటక సంగీతమునకనువుగా చేసిరి.

వయోలిన్ మూడు పరిమాణములలో చేసెదరు. 1) నిండు 2) ముప్పాతిక 3) అర సైజులలోనుండును. ఉత్తర భారతమునందు, శీతల ప్రదేశములందు పెరిగే మేపల్ చెట్టు కర్రతో చేసెదరు. ఇందు 14 ముఖ్య భాగములు కలవు. 1) బల్ల 2) ప్రక్క బల్లలు 3) అడుగు బిళ్ళ 4) తల 5) తోక 6) గుండీలు 7) ధ్వని రంధ్రములు 8) బ్రిడ్జి 9) మెడ 10) ఫింగర్ బోర్డు 11) నాలుగు తంత్రులు 12) కూటీలు 13) సౌండ్ పోస్టు 14) బేసు లేక మూలాధారము.

కమాన్ కట్టెలోని భాగములు :

1) తల 2) కమాన్ కట్టె 3) గుర్రం వెంట్రుకలు 4) మరచీల

నాలుగు తంత్రుల వివరణ:

1వ తంత్రి : మంద్ర షడ్జమము ------ స

2వ తంత్రి : మంద్ర పంచమము ------ ప

3వ తంత్రి : సారణి తారాస్థాయి షడ్జమము ------ స

4వ తంత్రి : మధ్య పంచమము ------ ప

కమాను కట్టెను కుడి చేతితో పట్టుకొని ఎడమ చేతి వ్రేళ్ళను నల్లని బల్లపై ఆనించి తంత్రులను, స్వర స్థానముల కనుగుణముగా, కమాన్ కట్టెతో నాదమును పలికించెదరు. కమాన్‌కట్టె గుఱ్ఱము వెంట్రుకలను గుగ్గిలముతో రుద్ది నాదము శ్రావ్యముగానుండునట్లు చేయుదురు.

మృదంగము

మృదము(మట్టి)తో చేయబడినది కావున దీనికి మృదంగము అని పేరు వచ్చినది. భారతీయ సంగీతమునందు లయ వాయిద్యముగా ముఖ్య భూమికను పోషించుచున్నది. అందులో చర్మ వాయిద్య విభాగమునకు చెందిన లయ వాయిద్యమైన మృదంగము అతి ముఖ్యమైనది. సహకార లయ వాయిద్యమైనను, మృదంగమును ఉపయోగించి ఏకవాయిద్య కచ్చేరీలు కూడా చేయుదురు.

మృదంగ పటము - భాగములు



మృదంగము బాగుగా ముదిరిన పనస చెట్టు కాండమును, కావలసిన పరిమాణములలో కోసి, నీటిలో నానపెట్టిన తదుపరి నీడనందు ఆరపెట్టవలెను. వీటి సైజులనుబట్టి 20 అంగుళములు పొడవు కలిగి, 30 అంగుళములు మధ్య చుట్టుకొలత కలిగిన దిమ్మలను అటు, ఇటు తొలిచి డొల్లగా చేయుచూ, గోడ మందము దాదాపు అర అంగుళముండునట్లు తొలచవలెను. ఈ డొల్లను చెక్కునప్పుడు, కుడివైపు 7 అంగుళముల వ్యాసము, ఎడమ వైపు 8 అంగుళముల వ్యాసముండునట్లు చెక్కవలయును. కావలసిన శృతినిబట్టి ఈ దిమ్మలు 22" నుండి 25" వరకు నిడివిగా మలచుదురు. ఇటువంటి డొల్లలకు, కుడి ఎడమలందు, చర్మపు మూతలను వేయుదురు.

కుడి మూత: దీనిని మూడు చర్మపు పొరలతో మూయుదురు. మొదటి మూతను ఒత్తుడు చర్మ మందురు. దీనిని మేక చర్మముతోను, దీనిపై రెండవ మూతను 'పాట'చర్మముగా మేకతోలుతోనే వేయుదురు. మూడవ పొరను రెప్ప చర్మమందురు. దీనిని ఆవుదూడ చర్మముతో సుమారు 2" వెడల్పుతో అంచువలె వేయుదురు.

ఎడమ మూత: ఇందు రెండు పొరల మూత మాత్రమే కలదు. 1) మొదటి పొరను పాట చర్మమని మేక చర్మముతో వేసి, దానిపై చుట్టూ అంచువలె $1\frac{1}{2}$" వెడల్పుగల దళసరి ఎద్దు చర్మమును 'రెప్ప' చర్మముగా వేయుదురు. రెండు మూతలను చర్మ జడలను, చర్మపు వారుతో బిగింతురు.

కరణి: కుడివైపు మూత మధ్యలో నుండు నల్లని భాగమును కరణి అందురు. దీనివలననే మృదంగ నాదము శ్రావ్యముగా ధ్వనించును.

కరణి వేయు విధానము: కొలిమిలోని చిట్టిపురాళ్ళను పొడిచేసి, ఉడికించిన అన్నముతో బాగుగా కలిపి చిన్న చిన్న ఉండలను చేయవలయును. ఒక్క ఉండను కుడి మూత మధ్య భాగమున అదిమి, నున్నటి

రాయితో రుద్ది, సుమారు 1/8" మందము వచ్చునట్లు కావలసిన పరిమాణములో వేసి, అంచులను కత్తితో గుండ్రముగా నుండునట్లు సరిచేయుదురు.

బోనము: వాయిద్యమును వాయించుటకు ముందు ఎడమ మూత మధ్య భాగమున, ఒక అంగుళము సైజులో తడిపిన బొంబాయి రవ్వను గుండ్రముగా అంటించి, గట్టిగా వొత్తవలెను. అవసరమైనపుడు ఈ బిళ్ళను నీటితో తడుపుటవలన నాద ఘనము పెరుగును.

శృతిచేయు పద్ధతి: ఒక చెక్క పుల్లతోను, నున్నటి రాయితోను శృతి చేయుదురు. ముందు కుడిచేతి వైపు శృతి చేసి, తదుపరి ఎడమ చేతివైపు శృతి చేయుదురు. కుడిపైపు శృతికన్నను ఎడమవైపు శృతి ఒక మెట్టు తక్కువగా నుండునట్లు చేయుదురు. శృతి పెంచుటకు చర్మపు జారును, పైనుండి క్రిందకు జరిపి, బోనము కలిపి ఎడమవైపు నంటింతురు.

వీణ

కర్నాటక సంగీత వాయిద్యములలో అతి మధురముగా పలుకు తంత్రి వాయిద్య విభాగములో మీటు వాయిద్య తరగతికి చెందినది వీణ.

వీణను మూడు భాగములుగా విభజించిరి. ముఖ్యమైన భాగములు 1) కుండ 2) దండి 3) యాళి అను భాగములు. ఇవిగాక, 4) సొరకాయ డొల్ల 5) మైనపు గోడ 6) కుండను - దండిని కలుపు దంతపు ముక్క 7) కుండపై బల్ల 8) 24 మెట్లు 9) నాలుగు ప్రధాన తంత్రులు 10) మూడు తాళ తంత్రులు 11) నాగపాశము 12) శృతిని సరిచేయు పూసలు 13) ప్రధాన వంతెన 14) ప్రక్క వంతెన 15) ఇత్తడి రేకు 16) ధ్వని వచ్చు రంధ్రములు 17) దంతపు గుండీలు 18) తాళ తంత్రుల మూడు బిరడాలు 19) నాలుగు ప్రధాన తంత్రుల బిరడాలు.

కుండ : వీణను పనస లేక రోజువుడ్ కర్రతో చేయుదురు. కుండయొక్క వ్యాసము $9^1/_2$" నుండి 13" వరకుండును. లోతు 9" నుండి $10^1/_2$" వరకుండును. కుండయొక్క లోతు పెరిగినకొలది ధ్వని గంభీరత పెరుగును. ఈ కుండపై పలుచని చెక్క బల్లను, అదే ఆకారములో నుండునట్లు బిగింతురు. ఈ బల్లపై కర్రవంతెనను అమర్చి, దానిమీద ఇత్తడి బిళ్ళనమర్చుదురు. దీని ప్రక్కన ఇంకొక వంతెనను



వీణ పటము

అమర్చుదురు. ఇది తాళతంత్రులకు ప్రధాన వంతెనగా నుండును. కుండ చివర మూలాధారమునకు తంత్రులు కట్టబడియుండును.

దండి : ఒకే కర్రతో కాలువగా మలచి, ఆ కాలువపైన పలుచటి బల్లనమర్చుదురు. ఈ కాలువకు రెండువైపుల గట్టి మైనపు గోడలుండును. దీనిపైన 24, ఇత్తడి లేక కంచు మెట్లనమర్చుదురు. ఈ మెట్ల వల్ల వీణ మీటునప్పుడు, స్వర స్థానములు పలుకును. ఈ మెట్ల చివరి భాగమున రెండువైపుల రెండేసి చెక్క బిరడాలను బిగించెదరు. ఇది ప్రధాన తంత్రులను బిగించుటకు, శృతి చేసుకొనుటకు ఉపయోగపడును. దండికి ఒకవైపు మూడు గుండీలు మూడు బిరడాలను బిగించెదరు. తాళ తంత్రులను ఈ గుండీల ద్వారా బిరడాలకు బిగించెదరు. ఈ దండి చివర భాగమునందు ఎండిన సొరకాయ గుల్లనమర్చెదరు. ఈ సొరకాయ గుల్ల వీణను పరుండబెట్టినప్పుడు ఆధారముగా నుండి, సమస్థితిలో నుండునట్లు చేయును.

యాళి : దండి చివర భాగమునందు యాళియను జానపద జంతువు తలవలె చెక్కతో చేసి అమర్చెదరు. ప్రధాన తంత్రులను 1) అనుమంద్ర పంచమము 2) మంద్ర షడ్జమము 3) మంద్ర పంచమము 4) మధ్య షడ్జమమునకు శృతి చేయుదురు. తాళ తంత్రులను 1) మధ్య షడ్జమమునకు 2) మధ్య పంచమమునకు 3) తారా షడ్జమమునకు శృతి చేయుదురు.

వీణను వాయించునపుడు, కుడి చేతివైపు కుండను, ఎడమ చేతివైపు సొరకాయ గుల్లనుండునట్లు అమర్చి, కుడిచేతి వ్రేళ్ళతో తంత్రులను మీటుతూ ఎడమ చేయిని దండి క్రిందనుండి పోనిచ్చి ఎడమ చేతివ్రేళ్ళతో మెట్లపైనుండు తంత్రులను స్వర స్థానముల ననుసరించి నొక్కి నాదమును పలికింతురు. కుడి-ఎడమ చేతివ్రేళ్ళకు మంచి అన్యయ భావము తెలిసియుండవలెను. నేటి వీణ అనేక రూపాంతరములయొక్క ప్రభావమే. భారతదేశమునందు బొబ్బిలి, విజయనగరము, తంజావూరు, మైసూరులనందు వీణలు తయారు చేయుదురు. వీణ వాయిద్యమునకు విజయనగరం, మైసూరు, తిరువాన్కూరు మహారాజుల నుండి మంచి ఆదరణ లభించినది. తిరుమలలోని మ్యూజియం నందు అనేక రకములైన వీణలను చూడవచ్చును.

వేణువు

అత్యంత మధురమైన, సున్నితమైన నాదమును పలికించు, సుషిర వాయిద్యము వేణువు. వేణువును, ముఖ్యముగా అడవులలో దొరికే ప్రకృతిసిద్ధమైన, వంకరలు లేని, బాగుగా ముదిరిన వెదురుతో తయారు చేయుదురు. ఈ వెదురు బొంగును సేకరించి, కావలసిన సైజులలో కోసుకొని, నీడపట్టున వంకరలు రాకుండునట్లు ఆరపెట్టుదురు. ఆ విధముగా ఆరిన వెదురును 20" పొడవు $4^{1}/_{2}$ "కైవారముతో, మధ్యలో కణుపులు లేక, రెండువైపుల తెరచియుండునట్లు చేయుదురు. ఎడమవైపు రంధ్రమును లక్కతోగాని చిన్న చెక్క ముక్కతోగాని మూసి యుంచవలెను. ఈ చివరనుండి 7" దూరములో ఒక రంధ్రమును, ఒకే సరళరేఖ మీదుగా 7 రంధ్రములుండునట్లును, చివరి రంధ్రము అనగా 8వ రంధ్రము వేణువు

చివరిభాగ మధ్య దూరము 2" ఉండునట్లు చేయవలయును. వాయిద్యకారులు వేణువును నోటిదగ్గర పెట్టుకొని వక్ర రంధ్రము ద్వారా గాలిని ఊదుచూ ఎడమచేతి మూడు వ్రేళ్ళతో (చూపుడు, మధ్య, ఉంగరపు వ్రేళ్ళతో) కుడిచేతి 4 వ్రేళ్ళతోను (బొటనవ్రేలు తప్ప) రంధ్రముల ద్వారా బయటకు వచ్చు గాలిని నియంత్రించి స్వరములు పలికించెదరు. వేణువును ఉపయోగించునప్పుడు గాలిని సమానముగా, సావధానముగా ఊద వలెను. దీనివలన ధ్వని కఠినముగా గాని హీనముగా గాని ధ్వనించదు. గాయకుని శృతిననుసరించి వేణువుల కైవారములను నిర్ణయించెదరు.

23. కొన్ని మేళకర్త రాగములు - వాటి లక్షణములు

మేళకర్తల పట్టికలో 72 జనకరాగములకు స్వర స్థానములు కల్పించబడినవి. రాగమును పాడునప్పుడు స్వర స్థానములు పలికించుచు, ఆ రాగచ్ఛాయను తెప్పించవలయును. ఈ రాగచ్ఛాయ తెప్పించుటకు అకుంఠిత సాధన, జ్ఞాపకశక్తి, కల్పనాశక్తి మొదలగునవి ముఖ్యము. మూర్ఛనలోని స్వరస్థానముల ననుసరించి, బాణి ననుసరించి, ప్రతి గాయకుడు తనదైన శైలిలో రాగరంజితముగా గానము చేయుదురు. కర్నాటక సంగీతమునందు 'గురువు' ప్రాధాన్యత చాల ముఖ్యము. గురు ముఖముగా నేర్చుకొనిన పిదప, మనోధర్మముననుసరించి, పలుకు భేదములు లేక సంగీత వ్యాకరణము చెడకుండా, గాత్రశుద్ధితో గాయకులు తమ నైపుణ్యమును గాత్ర కచ్చేరిలలో ప్రదర్శించవలయును. జన బాహుళ్యమునొందిన కొన్ని మేళకర్తలగురించి తెలుసుకొందాము.

హనుమత్తోడి రాగము

హనుమత్తోడి రాగము మేళకర్తలలో రెండవ చక్రమగు నేత్ర చక్రమునందు 8వ మేళకర్తగా రూపుదిద్దుకొంది. కటపయాది సూత్రముననుసరించి తోడి రాగమునకు, హనుమ చేర్చి హనుమత్తోడి రాగముగా అలరారు చున్నది.

ఇందలి శృతులు : షడ్జమము, శు॥రి, సా॥గాం, శు॥మ, పంచమము, శు॥ధై, కై॥ని

ఆరోహణ : సరిగమపదని స̇

అవరోహణ : స̇నిదపమగరిస

ఈ రాగము సంపూర్ణ రాగము. అన్ని వేళలందు పాడుకొనదగిన రాగము. ప్రసిద్ధమైన అలంకారములతో అనేక సంతతిగల జనక రాగము. ఇది సర్వ స్వర, గమక వరీక రక్తి రాగము. ఇందు గాంధారము, మధ్యమము, దైవతములు రాగచ్ఛాయా స్వరములు. మ,ప, అంశ స్వరములుగాను గ̣మదని న్యాస స్వరములుగాను, జంట స్వరములగు గగ, మమ, దద, మమ, దద, నిని, దద, నిని, స స, లును, విశేష ప్రయోగములగు నిగరిని, దనిరిని, దమ, గమనిదగారిస, దనిసదా- రి సదా అను ఆహ్లాదకర ప్రయోగము కలిగి రాగము పాడునప్పుడు రక్తి కట్టించును.

ఈ రాగమునందలి రచనలు స,గ,మ,ద,ని స్వరములయందు ప్రారంభమగును. ఈ రాగము ఉత్తర హిందూస్థానము నుండి దక్షిణ హిందూ స్థానమునకు వచ్చినది గావున దీనిని 'ఔత్తర' రాగమని

వెంకటమఖిగారు నిర్వచించిరి. ఈ రగమందు గాంధారము పాడునప్పుడు 'మమ గగమ'లో గాంధారము స్వస్థానము నుండి, గారిసలో గాంధారము సాధారణము కన్న కొంచెము తక్కువ చేసి పాడవలెను. ఈ రాగము ముక్తాంగ కంపిత రాగము. మనోధర్మముచే ప్రస్తావింపబడు జంటలు, దాటుస్వరాలు ఆహత, ప్రత్యాహత, ప్రయోగములన్నింటికి అనువైన త్రిస్థాయి రాగము.

విస్తారమైన ఆలాపనకు, భావ ప్రకటితమునకు అనువైన రాగము. ఈ రాగమ్ంధలి సంచార స్వరములు : సరిగమపదనిస, దనిసరిగారిస - నిదపమ - గగమమ - దద నిని -రిరి సస నిదపమ - గమపమ - గరిసా - సరిగమ పమ - గమగదమని దసనిదపమ - గమపమ గారిస -నిదనిసరీ సనిరిసా ముఖ్యమైనవి.

ఈ రాగమందలి ప్రసిద్ధ రచనలు: త్యాగరాజు: ఎందుకు దయరాదు - త్రిపుట తాళము, ఆరగింపవే - రూపక తాళము, కద్దను వారికి - ఆది తాళము, ముత్తుస్వామి దీక్షితార్: కమలాంబికే - రూపక తాళము, శ్యామ శాస్త్రి: రావే హిమగిరి తనయ - స్వరజతి ఆదితాళం

ఈ రాగమునందలి ప్రముఖ జన్యరాగములు: శుద్దతోడి, ధన్యాసి, భూపాళము, భానుచంద్రిక, పున్నాగ వరాళి, ఆహిరి, ఆసావేరి, పున్నాగతోడి, చంద్రకాంతము మొదలగునవి.

మాయా మాళవగౌళ రాగము

ఇది 15వ మేళకర్త, శుద్ధ మధ్యమ రాగము. మూడవ చక్రము 'అగ్ని' యందు కలదు. కటపయాది సూత్రము ననుసరించి మాళవగౌళ రాగమునకు ముందు 'మాయా' చేర్చి మాయా మాళవగౌళ రాగముగా తీర్చి దిద్దిరి.

మూర్చన

ఆరోహణ : సరిగమపదని స

అవరోహణ : సనిదపమగరిస

రాగ శృతులు: షడ్జమము, శు॥రి, అం॥గా, శు॥మ, పంచమము, శు॥ధై, కా॥ని

రాగ లక్షణములు: సంపూర్ణ, సర్వ స్వరగమక వరీక రాగము. అన్ని వేళలయందు పాడుకొనుటకు అనువైన రాగము. వాగ్గేయకారులైన పురంధర దాసులవారు, ఈ రాగమునందే, విద్యార్థుల కొరకు, సరళీ స్వరములు, జంట స్వరములు, అలంకారములను రచించిరి. గమకములు చాలా ముఖ్యమైనవి, నిర్ధిష్టమైనవి. ఇందలి గాంధారము కంపిత స్వరము. షడ్జమ పంచమములతో రిషభము, ధైవతములు కూడా కంపిత స్వరములుగా పాడవచ్చును. ఈ రాగము ఎంతో పవిత్రమైనది. గాన కచ్చేరిలయందు మనసు ప్రశాంతతను పొందును. ప్రాచీన రాగములలో ఒకటి. సంపూర్ణ రాగము, సర్వ స్వర గమక వరీక రక్తి రాగము. వివాది మేళకర్త రాగముగా ప్రసిద్ధి నొందినది. హిందుస్తాని సంగీతమున భైరవ్‌తో సమానము. మధ్యమ రిషభములతో గ్రహభేదము చేసిన సింహేంద్రమధ్యమము, రసిక ప్రియరాగములు వచ్చును.

ఈ రాగమునందలి ప్రసిద్ధ రచనలు: త్యాగరాజు రచించిన తులసీ దళములచే, మేరుసమాన వీర, దేవి శ్రీ తులశమ్మ, ముత్తుస్వామి దీక్షితులు రచించిన శ్రీనాధాది గురుగుహ, పొన్నయ్య పిళ్లై రచించిన మాయాతీత స్వరూపిణి, స్వాతి తిరునాళ్ రచించిన దేవదేవ కలయమితె.

జన్య రాగములు: మలహరి, నామనాదక్రియ, సావేరి, ఫరౌజు, పాడి, జగన్మోహిని, గౌళ, భౌళి, గుండక్రియ, భౌళి రామక్రియ, గౌరి, గుమ్మ కాంభోజి, పూర్ణలత, కల్యాణ కేసరి, కన్నడ బంగాళ, లలిత, మార్గదేశి.

సూర్య కాంతము

ఇది 17వ మేళకర్త శుద్ధ మధ్యమ రాగము, మూడవ చక్రమగు 'అగ్ని' చక్రమునందు కలదు.

మూర్చన

ఆరోహణ : సరిగమపదని ṡ ; అవరోహణ : ṡనిదపమగరిస

రాగ శృతులు : షడ్జమము, శు॥రి, అం॥గాం, శు॥మ, పం, చ॥ధై, కా॥ని.

ఇది అతి ప్రాచీన శుద్ధ మధ్యమ సంపూర్ణ రాగము. ఈ రాగమును సాయం సమయమందు పాడుకొనుటకు అనువైనది. నారదుని సంగీత మకరందమునందు, సార్ఙ్గ దేవుని సంగీత రత్నాకరమందును ఈ రాగ ప్రస్థావన కలదు. ముత్తుస్వామి దీక్షితులు దీనిని 'ఛాయవతి' అనికూడా నామకరణము చేసిరి. దీనిలో స్వర స్థానములు ఒకటైనను, ఆరోహణయందు పంచమము విసర్జితముగానుండును.

ఈ రాగమునందలి ప్రసిద్ధ రచనలు: త్యాగరాజు రచించిన ముద్దు మోము ఏలగ; ముత్తయ్య భాగవతార్ రచించిన శ్రీ సాయి శివయ్య; కోటేశ్వర రచించిన అయ్యర్ కనవో నినైవో

దీని జన్య రాగమైన వసంత రాగము మిక్కిలి ప్రసిద్ధమైనది. ఇది ఔడవ-షాడవ రాగము. ఇందు గ మ ద ని రాగచ్ఛాయా స్వరములు. గమక వరిక రక్తి రాగము. ఇందలి మనోరంజక స్వరములు సమ, గమ. సాయంకాలమందు పాడుటకు అనువైన రాగము.

జన్య రాగములు: వసంత రాగము, సౌరాష్ట్ర, భైరవము, హరిదర్ప, జీవంతిక, రోహిణి, శుద్ధగౌళ, సుప్రదీపము.

నఠభైరవి రాగము

ఈ నఠభైరవి రాగము మేళకర్తలలో వేద అనే నాలుగవ చక్రమునందు 20వ శుద్ధ మధ్యమ మేళకర్తగా రూపు దిద్దుకొంది. కటపయాది సూత్రము ననుసరించి నఠ చేర్చి, 20వ మేళకర్తగా రూపు దిద్దుకుంది.

రాగ శృతులు:షడ్జమము, చ॥రి, సా॥గాం, శు॥మ పంచమము, శు॥ధై, కై॥ని

ఆరోహణ: సరిగమపదని ṡ

అవరోహణ: ṡనిదపమగరిస

ఈ రాగము సంపూర్ణ రాగము, సర్వ స్వర గమక, వరీక, రక్తి రాగము. దీనియందు రాగాలాపనకు అధిక ప్రాధాన్యత కలదు. అన్ని వేళలందు పాడుకొను రాగమైనను సాయంకాల సమయములందు పాడిన ఆహ్లాదకరముగా నుండును. ఈ రాగము నృత్య నాటకములకు కూడా అనువైనది. నఠభైరవినందు రి,గ,మ,నిలు రాగచ్ఛాయా స్వరములు. గాంధార, మధ్యమ నిషాదములు కంపిత స్వరములుగా, రిమగారిస - పదమ - పదనిదమా - మపగారిసలు విశేష ప్రయోగములుగా నుండును. రి, గ, మ, ద, ని యందు రచనలు ప్రారంభమగును.

స్వర సంచారములు: సరిగమ - పదని స రి - సనిదపదని - దనిసానిదపా - మపదపమగరిస - రిగమపమగారి - సరిగమాగరిస - రిగమపా - పదపమా - పదనిదమా - మపగారిస - రిరి గగ మమ గగ - రిగమపమమ - పదదనినిసా - పదని సరిగా - రిగరిస - నిరిసరినిస పరిసానిదపా - మనిదపా మపగారిస - నిదనిసా మొదలగునవి సంచార స్వరములుగా ప్రసిద్ధినొందినవి.

ఈ రాగమునందలి ప్రసిద్ధ రచనలు: త్యాగరాజు: ఉపచారము - రూపక తాళము, ఉపచారములను - ఆది తాళము; ముత్తుస్వామి దీక్షితార్: బాలగోపాల - ఆది తాళము, చింతయమాకంద - రూపక తాళము; శ్యామ శాస్త్రి: కామాక్షి - చాపు తాళము (స్వరజతి); పట్నం సుబ్రహ్మణ్యయ్యర్ - నాపాదములే - ఆది తాళము.

నఠభైరవి నందలి జన్య రాగములు: భైరవి, ఆనంద భైరవి, రీతిగౌళ, జయంతశ్రీ, అభేరి, హిందోళము, జింగ్ల, అమృతవాహిని, హిందోళ వసంతము, దర్బారి కానడ, దేవక్రియ, జయంతశ్రీ, జోన్‌పురి, కాత్యాయని, రాజరాజేశ్వరి, సారమతి, నీలవేణి, శుద్ధదేశి, సుకుమారి సుషమ, వసంత వరాళి.

ఖరహర ప్రియరాగము

ఇది 22వ మేళకర్త శుద్ధ మధ్యమ రాగము. వేద అనే నాలుగవ చక్రమునందు కలదు. ఈ రాగము మిక్కిలి ప్రశస్తమైనది. ఇది జన ప్రాచుర్యము నొంది అనేక జన్యరాగములను కలిగియున్నది.

రాగ శృతులు :

షడ్జమము : చ॥రి, సా॥గా, శు॥మ పంచమము : చ॥ధై, కై॥ని

ఆరోహణ : సరిగమపదని స అవరోహణ : సనిదపమగరిస

అన్ని వేళలయందు పాడుకొనుటకు అనువైన సర్వ, స్వర, గమక వరీక రాగము. ప్రత్యాహత గమకము దీనికి ప్రత్యేక అలంకారముగా నుండును. ఇది మిక్కిలి వ్యాప్తి చెంది, రాగాలాపనకు ఎక్కువ అవకాశముకల ప్రాచీన రాగము. ఇది మూర్ఛనాకారక మేళకర్త. రిగమ పని స్వరములను గ్రహభేదము చేసికొనినచో హనుమత్తోడి, మేచకల్యాణి, హరి కాంభోజి, నఠభైరవి, దీరశంకరాభరణము రాగములుద్భవించును. రిగమదని రాగచ్ఛాయా స్వరములు, న్యాస స్వరములును. రిపలు అంశస్వరములుకాగా, నీదప మగారి - నీ దప దని సనీ దప మగా అనునవి రంజక ప్రయోగములు.

ఈ రాగమునందు సంచార స్వరములు, సరిగమపదని సా, దని సరిగరి సానిదపా, మగపాగారి, గరి సరి గమ పదని సా - రిగ మగ గరి రిసానిదపా, మపదని సానిద దని సరి గమ గరి సని దప, మపదని సా నిదప, మగమపా మగరి, గరి సరిగమ గరిస, ని ద ప ద ని సా

ఈ రాగము భారతదేశమందలి హిందూస్థాని సంగీతములోని 'కాసి' రాగమునకు పోలిక కలదు. గ్రీకు, అరబ్బు, తమిళ సంగీతములోని పాశ్చాత్యములు ఈ రాగచ్ఛాయలు కలవు.

జన్య రాగములు : కానడ, కాపి, శ్రీరాగము, శ్రీరంజని, ముఖారి, దర్బారు, హుస్సేని, మధ్యమావతి, శుద్ధ ధన్యాసి, ఆభోగి, అభేరి, బృందావన సారంగ, దేవమనోహరి, దుర్గ, హరిదాసప్రియ, జయమనోహరి.

ఈ రాగమునందలి ప్రసిద్ధ రచనలు: త్యాగరాజు రచించిన చక్కని రాజ మార్గము - ఆది తాళము,

ప్రక్కాల నిలబడి - త్రిపుట తాళము, రామ నీ సమానము - రూపక తాళము; పట్నం సుబ్రహ్మణ్య అయ్యరు రచించిన సంకల్పమే - ఆది తాళము

హరి కాంభోజి రాగము

హరి కాంభోజి రాగము ఐదవ చక్రమగు 'బాణ'లో 28వ శుద్ధ మధ్యమ మేళకర్తగా ప్రసిద్ధినొందినది. ఈ రాగమును అన్ని వేళలందు పాడుకొనవచ్చును. ముఖ్యముగా గాత్రకచ్చేరిలలో ముందుగా పాడవచ్చును.

రాగ శృతులు: షడ్జమము, చ॥రి, అం॥గా, శు॥మ, పంచమము, చ॥ధై, కై॥ని.

ఆరోహణ: సరిగమపదని స̇ అవరోహణ: స̇నిదపమగరిస

సంపూర్ణ, శుద్ధ మధ్యమములో, పాడుటకు మిక్కిలి ఇంపైన రాగము. ఇందు రిషభ, గాంధారములు ఎక్కువ ప్రాముఖ్యమును కలిగియుండును. మధ్యమ, దైవతములు రాగచ్ఛాయా స్వరములుగాను, గాంధారము, దైవతములు వాది-సంవాది స్వరములుగాను రిషభ, మధ్యమ, నిషాదములు కంపితమగుటచే రాగము మిక్కిలి రక్తి కట్టి శ్రోతలకు మహదానందము కలుగును. ఇది మూర్ఛనాకారక మేళకర్తగా భాసిల్లుతుంది. రి, మ, ప, ద, ని స్వరములందు గ్రహభేదము వలన నఠభైరవి, ధీర శంకరాభరణము, ఖరహరప్రియ, హనుమత్తోడి, మేచకల్యాణి రాగము లుద్భవించును. ఈ రాగమును స్వర సప్తకము, శుద్ధ స్వర సప్తకముగా కూడా వర్ణించిరి. రిషభము న్యాసము మరియు విశేష అంశము. హరి కాంభోజి రాగము నందుకల సంచార స్వరములు: సరిగమపదనిసా, దని సా, రి గమ రి గారి సని దని, స రిని సా నిద ప మగ గమపదనిస- రి గమ గ రిసనిదప - రిగరిస - సరిగరిస - ని ద నీసా.

వేంకటమఖి గారి సాంప్రదాయమున దీనిని 'హరి కేదార గౌళ' రాగముగా పిలువబడినది.

ప్రసిద్ధినొందిన జన్యరాగములు: కాంభోజి, యదుకుల కాంభోజి, ఖమాస్, కేదార గౌళ, మోహన, శహన, సురటి, నాట కురంజి, బహుదారి, కుంతల వరాళి, ఈషా మనోహరి, హంసరూపిణి, హరిదాసప్రియ, హరికేదారము, నారాయణి, సరస్వతి మనోహరి.

ఈ రాగమునందలి ప్రసిద్ధ రచనలు: త్యాగరాజు: రామ నన్ను బ్రోవరా - రూపక తాళము, ఎంత రా నీ - ఆది తాళము, ఉండేది రాముడొక్కడే - రూపక తాళము

మైసూరు సదాశివరావు: వినతాసుత - ఆది తాళము, సాకేత - రూపక తాళము

ధీర శంకరాభరణము

ధీర శంకరాభరణము మేళకర్తలలో ఐదవ చక్రమగు బాణ చక్రమునందు 29వ మేళ కర్తగా ప్రసిద్ధి పొందిన రాగము. కటపయాది సూత్రముననుసరించి శంకరాభరణమునకు ధీర చేర్చి ధీర శంకరాభరణముగా రూపు దిద్దుకొంది. ఇది సంపూర్ణ రాగము.

ఇందిలి శృతులు: షడ్జమము: చ॥రి, అం॥గాం, శు॥మ, పంచమము: చ॥ధై, కా॥ని

ఆరోహణ: సరిగమపదని స̇ అవరోహణ: స̇నిదపమగరిస

ఇది చాలా వ్యాప్తి గల రాగము. ఇందు స్వరములన్నియు రాగచ్ఛాయ స్వరములు. దీనియందు సస, రిరి, గగ, మమ, పప, జంట స్వరములు, రినిసదని, పదమప గమరిగసా అను దాటువులు ప్రసిద్ధమైనవి. అన్ని సమయములందు మనోరంజకముగా పాడదగిన రాగము. హిందూస్థాని సంగీతములో ఈ రాగమునకు సరిపడు రాగము 'భిలావత్' రాగము. సనిప అను విశేష ప్రయోగములు, అపురూప ప్రయోగములుగా చెప్పవచ్చును. రి,ద, దీర్ఘ కంపితములు వలన రాగమునకు శోభనిచ్చును. శంకరాభరణము అందుచే సర్వ స్వర గమక వరీక రక్తిరాగముగా పేరునొందినది.

ఈ రాగమందలి ప్రసిద్ధ రచనలు: త్యాగరాజు-నాదోపాసన - దేశాది తాళము, వీణకుప్పయ్యర్ - ఇంత చలము - బేగడ రాగం, పట్నం సుబ్రహ్మణ్యం అయ్యర్ - అనుదినము - బేగడ రాగం.

ఈ రాగమందలి ప్రసిద్ధమైన జన్యరాగములు: బిలహరి, దేవగాంధారి, అఠాణ, అరభి, బేగడ, శుద్ధసావేరి, నీలాంబరి, నవరోజు, దేవగాంధారి, గరుడధ్వని, జనరంజని, కామప్రియ, కదనకుతూహలము, లహరి, నాగభూషణి, పూర్ణచంద్రిక, శంకర, సింధు, శుద్ధ వసంత.

చలనాట రాగము

చలనాట రాగము మేళకర్తలలో ఆరవ చక్రమైన 'ఋతు' చక్రమునందు 36వ చిట్ట చివరి శుద్ధ మధ్యమ రాగము.

ఇందలి శృతులు: షడ్జమము, ష॥రి, అం॥గాం, శు॥మ, పంచమము, ష॥ధై, కా॥ని

ఆరోహణ: సరిగమపదని స̇

అవరోహణ: స̇నిదపమగరిస

ఇది సంపూర్ణ రాగమైనప్పటికి ష॥రి, ష॥ధై లుండుటచే దీనిని వివాద మేళకర్తగా వాగ్గేయకారులు పరిగణించిరి. చలనాట రాగమునందు ముఖ్యమైన జన్యరాగము నాటరాగము. త్యాగరాజు స్వామి రచించిన ఘన పంచరాగములలో ఎంతో ప్రసిద్ధి నొందినది. దీనియందు తీవ్రస్వరములుండుటచే గాన కచ్చేరిలయందు ముందుగా పాడదగును. నాటరాగము ఉపాంగ, వర్జ్యరాగము.

ఆరోహణ: సరిమపదని స̇

అవరోహణ: స̇నిపమరిస లో గాంధారము, దైవతము, ఆరోహణలో గాంధారములు వర్జ్యస్వరములు. ఇందు సరిమపని జీవన్యాసములుగను, రిగమదని రాగచ్ఛాయ స్వరములు మనోరంజకముగా నుండును.

స్వర సంచారములు: సరిగమ పదని స̇ - సనిపని స̇ రి స రీ రీ - ని స రి గ మ̇ పా - మ̇ గ మ̇ రీ స ని రి సని పా - నిపపమగమ - గమ పని పపా మగమ - రీసని సరీగామ - పామ గమరీస - స ని̇ప ని̇సా మొదలగునవి.

ఈ రాగమునందలి ప్రసిద్ధ రచనలు: త్యాగరాజు: జగదానంద కారకా - ఆది తాళము, నిన్నేభజన - ఆది తాళము; ముత్తుస్వామి దీక్షితులు: మహాగణపతీం - చతురస్రపక తాళము, స్వామినాథ - ఆది తాళము, పవనాత్మజా - ఝంపె తాళము; పట్నం సుబ్రహ్మణ్యం అయ్యర్: భజన సేయవే - ఆది తాళము

చలనాటరాగ జన్యరాగములు: నాట, గంభీరనాట, శృతి రంజని, నాగ నీలాంబరి, మంజుళ మొదలగునవి.

కామ వర్ధని

కామ వర్ధని 9వ చక్రమునందు 51 మేళకర్తగా ప్రతిమధ్యమ రాగముగా విరాజిల్లుతుంది.

రాగశృతులు: షడ్జమము, శు॥రి, అం॥గాం, ప్ర॥మ పంచమము, శు॥ధై, కా॥ని

ఆరోహణ: సరిగమపదని స̇

అవరోహణ: స̇నిదపమగరిస

ఇది సంపూర్ణ రాగము. చాలా ప్రాచీన రాగము. ఇందలి ముఖ్యమైన జన్యరాగము పంతువరాళి. అయినను జనకరాగ శృతులను కలిగియుండును. ఆరోహణ - అవరోహణ స్వరములన్నియు రాగచ్ఛాయ స్వరములు. ఇందలి గాంధారము సాధారణ - అంతర గాంధారముల మధ్యలో పలుకును. ఈ రాగమును అన్ని వేళలయందును పాడదగును. ఇందలి రచనలు స,ప,ని స్వరములతో మొదలగును.

స్వర సంచారములు: సరిగమపదనిస - గ̣మపధనిస̣ నిదపమ - గనిదపమ - గదపమగరి - గగ మమ పప - దద నిని దపగరి - గమపదనిసరిగ - మగరిస - నిదపమ - గమపదాపమ - గమ పమగరి - మగరిసని̣ - ధని̣సా ॥ మొదలగునవి.

ఈ పంతువరాళి రాగమునందలి రచనలు: త్యాగరాజు: అప్పరామ భక్తి - రూపక తాళము, శివశివశివయన - ఆది తాళము, చూడరే చెలులారా - చాపు తాళము; ముత్తుస్వామి దీక్షితార్: రామనాధం భజేహం - రూపక తాళము; రామదాసు: ఎన్నగాను రామభజన - రూపక తాళము; స్వాతి తిరునాళ్: సారసాక్షి పరిపాలయ - ఆది తాళము; జయదేవుడు: చందన చర్చిత - ఆది తాళము.

ఈ రాగమునందిలి ముఖ్య జన్య రాగములు: పంతువరాళి, రామక్రియ, భోగ సామంతము, ఇందుమతి, గమకప్రియ, మారుతి.

గమనశ్రమ

గమనశ్రమ రాగము మేళకర్తలలో 9వ చక్రమునందు 53వ ప్రతిమధ్యమ మేళకర్తగా రూపుదిద్దుకొన్నది.

శృతులు: షడ్జమము, శు॥రి, అం॥గాం, ప్ర॥మ, పంచమము చ॥ధై, కా॥ని

ఆరోహణ: సరిగమపదని స̇

అవరోహణ: స̇నిదపమగరిస

ఇది సంపూర్ణ రాగము ఇందలి ముఖ్య రాగము పూర్వికల్యాణి. ఇది వక్రషాడవ రాగము. ఆరోహణయందు సనిదపమగరి స్వరములుండును. పూర్వికల్యాణి నిర్మలమైన రాగము కావున, సాయంకాలమునందు ప్రశాంత వాతావరణములో పాడదగును. ఇది దేశ్యరాగమై నృత్య నాటకము లందుకూడా మంచి ప్రశస్తమైన రాగము.

సంచార స్వరములు: సరిగమపదప సా - సానిదా - దసరిగరిసనిదా - దరిరిసానిదమ - గమదనీదమ - గరిస - రిసారి గమపా - నిదమగ - దమగరి - సారి స ని దాసా - సరిగమపదప సా - సనిదపమగరి - గమదమదనీ - నిదరి నిదమగ - రిగమదా మగరి - గారి స ని దాసా.

పూర్వికల్యాణి యందలి ప్రసిద్ధ రచనలు:- త్యాగరాజు: జ్ఞానమొసగ రాదా - రూపక తాళము, పరిపూర్ణకామ - రూపక తాళము; రామదాసు: ఓ రామ నీనామ మెంత - ఆది తాళము.

గమనశ్రమ యందలి జన్యరాగములు: హంసానందిని, పూర్వికల్యాణి, అలంకారి, పద్మకల్యాణి, సోహిని, విశాఖ.

మేచకల్యాణి

మేచకల్యాణి రాగము మేళకర్తల పదకొండవ చక్రములో 65వ ప్రతి మధ్యమ మేళకర్త రాగముగా ప్రసిద్ధినొందినది.

శ్రుతులు: షడ్జమము, చ॥రి, అం॥గాం, ప్ర॥మ పంచమము, చ॥ధై, కా॥ని

ఆరోహణ : సరిగమపదని స

అవరోహణ : సనిదపమగరిస

కటపయాది సూత్రముననుసరించి కల్యాణి రాగమునకు మేచ చేర్చబడి మేచకల్యాణి రాగముగా ప్రసిద్ధినొందినది.

ఇది సంపూర్ణ, సర్వ స్వర గమక వరీక రాగము. ఇందలి స్వరములన్నియు రాగచ్ఛాయ స్వరములు. దీనియందు రి,గ,ద,ని న్యాసములుగా, గ, ప, ద, ని విశ్రాంత స్వరములుగానుండును. రాగాలాపనకు మిక్కిలి అనువైన రాగము. ఇది మూర్ఛనాకారక మేళకర్త రాగము. మేచకల్యాణియందు సుప్రసిద్ధమైన జంట స్వరములు, దాటు స్వరములు, అలంకారములు కలవు. నిగరినిద - నిరినిదమ - గనిదమగరి అను షడ్జ - పంచమ వర్జ్య ప్రయోగములు చేసి పాడిన అత్యంత మధురముగా నుండును. ఇందు స్ఫురితము, త్రిపుచ్ఛములను గమకములు రాగమును వృద్ధి చెందించును. హిందూస్థానీ సంగీతములోని 'యమన్‌ధాట్' రాగము కల్యాణి రాగమునకు దగ్గరగానుండును.

స్వర సంచారములు: సరిగమపదని స - దని సని దపమగరి - ని రిగమద - మగమదని - ని రి గ రి సనిదప - పమగరి - గగ మమ దద నిని - రి రి గా రి సనిద - పమగనిదా పమగరి - స ని ద నిసరిసా.

ఈ రాగమునందలి ప్రసిద్ధ రచనలు:- త్యాగరాజు: నిధిచాల సుఖమా - చాపు తాళము, అమ్మరావమ్మ - ఝంపె తాళము; ముత్తుస్వామి దీక్షితులు: కమలాంబారి భజరే - ఆది తాళము; శ్యామశాస్త్రి: హిమాద్రిసుతే - రూపక తాళము; స్వాతి తిరునాళ్: పంకజలోచన - చాపు తాళము.

ఇందలి కొన్ని జన్య రాగములు : సారంగ, యమున కల్యాణి, చంద్రకాంతము, హంసకల్యాణి, మోహనకల్యాణి, ప్రమోదిని, శుద్ధకోసల.

24. వివిధ జనక జన్యరాగముల మూర్ఛనలు

ప్రాచుర్యములోనున్న కొన్ని జనక - జన్యరాగ కృతులు

అ - శుద్ధ మధ్యమ జన్యరాగములు - వాటి మూర్ఛనలు

శు : శుద్ధ, చ : చతుశ్రుతి, ష : షట్‌శ్రుతి, ప్ర : ప్రతిమధ్యమ, కై : కైశిక, కా : కాకలి, అం : అంతర, సా : సాధారణ.

మేళకర్త సంఖ్య	రాగము పేరు	స్వర స్థానములు ఆరోహణ అవరోహణ
1	కనకాంగి	శు శు శు శు శు స రి గ మ ప ధ ని స స ని ధ ప మ గ రి స
	శుద్ధముఖారి	స రి గ మ ప ధ ని స - స ని ధ మ గ రి స
2	రత్నాంగి	శు శు శు శు కై స రి గ మ ప ధ ని స స ని ధ ప మ గ రి స
	వసంత భూపాలము	స రి గ ప ధ ని స స ని ధ ప మ ధ మ గ రి స
	వసంత మనోహరి	స రి గ మ ధ ని స స ని ధ మ గ రి స
3	గానమూర్తి	శు శు శు శు కా స రి గ మ ప ధ ని స స ని ధ ప మ గ రి స
	మంగళగౌరి	స మ ప ధ ని స స ని ప ధ మ గ రి స
4	వనస్పతి	శు శు శు చ కై స రి గ మ ప ధ ని స స ని ధ ప మ గ రి స
	శ్వేతాంబరి	స రి గ మ ప మ ధ ని స స ని ప మ గ రి స
5	మానవతి	శు శు శు చ కా స రి గ మ ప ధ ని స స ని ధ ప మ గ రి స
	మనోరంజని	స రి మ ప ధ ని స

		స. ని ధ ప మ గ రి స
	పూర్వకన్నడ	స. రి గ మ ప మ ప స
		స ధ ని ధ ప మ గ రి స
	మంగళభూషణి	ప ధ స ని స రి గ మ ప
		మ గ రి స ని ధ ప
		ఋ సా ఋ ఋ ై
8	హనుమత్తోడి	స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స
	తోడి	స. రి గ మ ధ ని స
		స ని ధ మ గ రి స
	ధన్యాసి	స. గ మ ప ని స
		స. ని ధ ప మ గ రి స
	భూపాలము	స. రి గ ప ధ స
		స ధ ప గ రి స
	పున్నాగవరాళి	ని స రి గ మ ప ధ ని
		ని ధ ప మ గ రి ప ని
	అహిరి	స. రి స గ మ ప ధ ని స.
		స ని ధా ప మ గ రి స
	అసావేరి	స. రి మ ప ధ స
		స ని స ప ధ మ ప రి గ రి స
	చంద్రకాంతము	స. రి గ మ ప ధ ని స
		స ని ధ ప మ గ రి స
		ఋ సా ఋ చ ై
10	నాటకప్రియ	స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స
	నటాభరణము	స. రి గ మ ప ధ ప ని స.
		స ని ధ ప మ గ మ రి స
	సింధూభైరవి	మ ప ధ ని ధ స రి గ మ
		గ రి స ని ధ ప మ గ మ
		ఋ అం ఋ ఋ ఋ
13	గాయకప్రియ	స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స
		ఋ అం ఋ ఋ ై
14	వకుళాభరణము	స. రి గ మ ప ద ని స.
		స ని ధ ప మ గ రి స

			శు	అం	శు		శు	కా				
15	మాయామాళవగౌళ	స	రి	గ	మ	ప	ధ	ని	స.			
		స	ని	ధ	ప	మ	గ.	రి	స			
	మలహరి	స	రి	మ	ప	ధ	స.					
		స	ధ	ప	మ	గ	రి.	స				
	సావేరి	స	రి	మ	ప	ధ	స.					
		స	ని	ధ	ప	మ	గ	రి	స			
	గౌళ	స	రి	గ	మ	రి	మ	ప	ని	స.		
		స	ని	ప	మ	గ	మ.	రి	స			
	జగన్మోహిని	స	గ	మ	ప	ని	స.					
		స	ని	ప	మ	గా	రి	స				
	భేళి	స	రి	గ	ప	ధ	ని	ధ	స.			
		స	ని	ధ	ప	గ	రి	స				
	నాదనామక్రియ	స	రి	గ	రి	మ	ప	ద	ని			
		ని	ధ	ప	మ	గ	రి.	స	ని			
	సారంగనాట	స	రి	మ	ప	ధ	స.					
		స	ని	స	ధ	ప	మ.	గ	రి	స		
	పాడి	స	రి	మ	ప	ని	స.					
		స	ని	ప	ధ	ప	మ	రి	స.			
	ఘూర్జరి	స	రి	గ	మ	ప	ధ	ని	స.			
		స	ధ	ని	ప	మ	గ.	రి	స			
	గుండక్రియ	స	రి	మ	ప	ని	స.					
		స	ని	ప	ధ	ప	మ	గ.	రి	స		
	ఫరౌజు	స	గ	మ	ప	ధ	ని	స.				
		స	ని	ధ	ప	మ	గా	రి	స			
	కన్నడబంగాళ	స	రి	మ	గ	మ	ధ	ప	ధ	స.		
		స	ధ	ప	మ	గ	రి.	స				
	వసంత	స	గ	మ	ధ	ని	స.					
		స	ని	ధ	మా	గ	రి.	స				
	సాళంగనాట	స	రి	మ	ప	ధ	స.					
		స	ధ	ప	గ	రి	స					

			శు	అం	శు		శు	కై				
16	చక్రవాకము	స	రి	గ	మ	ప	ధ	ని	స.			
		స	ని	ధ	ప	మ	గ	రి.	స			
	మలయమారుతము	స	రి	గ	ప	ధ	ని	స.				
		స	ని	ధ	ప	గ	రి	స				

		శు అంశు చ కా
17	సూర్యకాంతము	స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స
		చ సా శు శు కై
20	నఠభైరవి	స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స.
	భైరవి	స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స
	ఆనంధభైరవి	స. గ రి గ మ ప ధ ప ని స.
		స ని ధ ప మ గ రి స
	రీతిగౌళ	స. గ రి గ మ ని ధ ని స.
		స ని ధ మ గ మ. ప మ గ రి సా
	జయంతశ్రీ	స. గ మ ధ ని సా
		స ని ధ మ ప మ. గ స
	అభేరి	స. గ మ ప ని స
		స ని ధ ప మ గ. రి స
	హిందోళము	స. గ మ ధ ని స
		స. ని ధ మ గ స
		చ సా శు శు కా
21	కీరవాణి	స. రి గ మ ప ధ ని స.
		స. ని ధ ప మ గ రి స
		చ సా శు చ కై
22	ఖరహరప్రియ	స. రి గ మ ప ధ ని స.
		స. ని ధ ప మ గ రి స
	కానడ	గ రి స రి గ మ ప మ ధా ని స.
		స. ని ప ధ ప మ గా మ రి స
	కన్నడగౌళ	స. రి గ మ ప ని స.
		స. ని ధ ప మ గ స
	కాపీ	స. రి గా మ రి ప మ ప ధ ని స.
		స. ని ధ ప మ గ రి స
	శ్రీరాగము	స. రి మ ప ని స.
		స. ని ప ధ ని ప మ. రి గా రి స
	శ్రీరంజని	స రి గ మ ధ ని స.

		ṡ ని ధ మ గ రి స
	ముఖారి	స రి మ ప ధ ని ధ ṡ
		స ని ధ ప మ గ రి స
	దర్బారు	స రి మ ప ధ ని ṡ
		స ని ధ ప మ గ రి స
	హుస్సేని	స రి గ మ ప ని ధ మ ప ని ధ ని ṡ
		స ని ధ ప మ గ రి స
	మధ్యమావతి	స రి మ ప ని ṡ
		స ని ప మ రి స
	బృందావనసారంగ	స రి మ ప ని ṡ
		స ని ప మ రి గ ṡ
	శుద్ధధన్యాసి	స గ మ ప ని ప ṡ
		స ని ప మ గ స
	శుద్ధబంగాళ	స రి మ ప ధ ṡ
		స ధ ప మ రి గ రి స
		చ సా శు చ కా
23	గౌరీమనోహరి	స రి గ మ ప ధ ని ṡ
		స ని ధ ప మ గ రి స
		చ అం శు శు కై
26	చారుకేశి	స రి గ మ ప ధ ని ṡ
		స ని ధ ప మ గ రి స
	హిందోళవసంతం	స గ మ ప ధ ని ధ స
		స ని ధ ప మ ధ మ గ స
		చ అం శు శు కా
27	సరసాంగి	స రి గ మ ప ధ ని ṡ
		స ని ధ ప మ గ రి స
	హరిప్రియ	స రి గ మ ప స
		స ని ధ ప మ గ స
	నాదవినోదిని	స రి గ మ ప మ ధ ని ṡ
		స ని స ధ ప మ గ రీ స
		చ అం శు చ కై
28	హరికాంభోజి	స రి గ మ ప ధ ని ṡ
		స ని ధ ప మ గ రి స
	కాంభోజి	స రి గ మ ప ధ ṡ
		స ని ధ ప మ గ రి స

	యదుకులకాంభోజి	స రి మ ప ధ స. స.ని ధ ప మ గ రి స
	కేదారగేళ	స.రి మ ప ని స. స ని ధ ప మ గ రి స.
	కుంతలవరాళి	ప.మ ప ధ ని ధ స. స ని ధ ప మ స.
	మోహన	స.రి గ ప ధ స. స ధ ప గ రి స
	జంఝూటి	ధ స రి గ మ ప ధ ని ధ ప మ గ రి స ని ధ ప ధ స
	శహన	స.రి గ మ ప మ ధ ని స. స నీ ధ ప మ గ మ రి గ రి స
	సరస్వతీ మనోహరి	స.రి గ మ ధ స. స.ధ ని ప మ గ రి స
	వలాజి	స.గ ప ధ ని స. స ని ధ ప గ ప.
	సురటి	స.రి మ ప ని స. స ని ధ మ గ ప మ రీ స
	నాటకురంజి	స.రి గ మ ధ ని ప ధ ని స. స ని ధ మ గ స
	బహుదారి	స.రి గ మ ధ ప ధ ని స. స ని ప మ గ స

		చ అంశు చ కా
29	ధీరశంకరాభరణము	స.రి గ మ ప ధ ని స. స ని ధ ప మ గ రి స.
	శంకరాభరణము	స.రి గ మ ప ధ ని స. స ని ధ ప మ గ రి స
	కురంజి	స ని స రి గ మ ప ధ ధ ప మ గ రి స ని స
	కేదార	స.మ గ మ ప ని స. స ని ప మ గ మ. ధ మ గ రి స
	హంసధ్వని	స.రి గ ప ని స. స ని ప గ రి స
	దేవగాంధారి	స.రి గ రి మ ప ధ ని స. స ని ధ ప మ గ రీ స
	బిలహరి	స రి గ ప ధ స.

		స. ని ధ ప మ గ రి స
	అఠాణ	స స. రి మ ప ని స.
		స ని ధ ప మ గ. రి స
	ఆరభి	స స. రి మ ప ధ స.
		స ని ధ ప మ గ రి స
	నవరోజు	ప ధ ని స రి గ మ ప
		మ గ రి స ని ధ ప
	బేగడ	స గ. రి గ మ ప ధ నీ ధ ప స.
		స ని ధ ప మ గ. రి స
	శుద్ధసావేరి	స స. రి మ ప ధ స.
		స ధ ప మ రి స
	నీలాంబరి	స స. రి గ మ ప ని స.
		స ని ప ధ ని ప మ. గ రి గ స
	శుద్ధవసంత	స స. రి గ మ ప ని స.
		స ధ ని ప మ గ రి స
		చ అంశు ష కా
30	నాగనందిని	స స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స.
	సామంతము	స స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ని ప మ గ రి స
		ష అంశు శు శు
31	యాగప్రియ	స స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స
		ష అంశు శు కై
32	రాగవర్ధని	స స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ. గ రి స
	హిందోళధర్బారు	స స. గ మ ప స
		స ని ధ ప మ రి స
		ష అంశు శు కా
33	గాంగేయభూషణి	స స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స.
	కన్నడదర్బారు	స స. రి గ మ ప ధ ప స
		స ని ధ ప మ రి స
		ష అంశు ష కా
36	చలనాట	స రి గ మ ప ధ ని స.

		స ని ధ ప మ గ రి స
	నాటరాగం	స రి గ మ ప ద ని స
		స ని ప మ రి స

ఆ - ప్రతిమధ్య జన్యరాగములు - వాటి మూర్ఛనలు

		శు సా ప్ర శు శు
43	గవాంబోధి	స రి గ మ ప ధ ని స
		స ని ధ ప మ గ రి స
		శు సా ప్ర శు కా
45	శుభపంతువరాళి	స రి గ మ ప ధ ని స
		స ని ధ ప మ గ రి స
	పంతువరాళి	స రి గ మ ప ధ ని స
		స ని ధ ప మ గ రి స
		శు సా ప్ర చ కై
46	షడ్వదమార్గిణి	స రి గ మ ప ధ ని స
		స ని ధ ప మ గ రి స
		శు అం ప్ర శు శు
49	ధవళాంబరి	స రి గ మ ప ధ ని స
		స ని ధ ప మ గ రి స
	స్వరాభరణము	స గ మ ప ధ ని స
		స ని ధ ప మ స
		శు అం ప్ర శు కా
51	కామవర్ధని	స రి గ మ ప ధ ని స
		స ని ధ ప మ గ రి స
	రామక్రియ	స రి గ మ ప ధ ని స
		స ని ధ ప మ గ రి స
		శు అం ప్ర చ కై
52	రామప్రియ	స రి గ మ ప ధ ని స
		స ని ధ ప మ గ రి స
	రీతిచంద్రిక	స రి గ మ ప ధ స
		స ని ధ ప మ గ రి స
		శు అం ప్ర చ కా
53	గమనశ్రమ	స రి గ మ ప ధ ని స
		స ని ధ ప మ గ రి స
	పూర్వికల్యాణి	స రి గ మ ప ధ ని ధ స

		స. ని ధ ప మ గ రి స
	హంసానంది	స. రి గ మ ధ ని స.
		స ని ధ మ గ రి స
		చ సా ప్ర ఖ కై
56	షణ్ముఖప్రియ	స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స
		చ సా ప్ర చ కై
58	హేమవతి	స. రి గ మ ప ద ని స.
		స ని ధ ప మ గ రి స
	సరస్వతి	స. రి మ ప ధ స.
		స ని ధ ప మ రి స
		చ సా ప్ర చ కా
59	ధర్మవతి	స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స
		చ అం ప్ర చ కా
65	మేచకల్యాణి	స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స.
	యమునకల్యాణి	స. రి గ ప మ ప ధ స.
		స ధ ప మ ప గ రి స.
	చంద్రకాంతము	స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స
		ష అం ప్ర చ కై
70	నాసికాభూషణి	స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స
		ష అం ప్ర చ కా
71	కోసలము	స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స
		ష అం ప్ర ష కా
72	రసికప్రియ	స. రి గ మ ప ధ ని స.
		స ని ధ ప మ గ రి స

25. రాగ వంశ వృక్షము

రాగ వంశ వృక్షము తెలుసుకొనుట వలన గాయకునికి, వివిధ రాగముల విభజనమీద ఒకవిధమైన అవగాహన కలుగుతుంది. రాగముయొక్క భావ స్వరూపము సులభముగా అవగతమవుతుంది. అందువలన, గాయకునికి రాగాలాపనమీద ఒకవిధమైన సాధికారత, సంపూర్ణ తత్వము అలవడుతుంది.

జనక రాగము (మేళకర్తల రాగములు)



26.మనోధర్మ సంగీతము

కర్నాటక సంగీత కచ్చేరీలు అత్యంత రక్తి కట్టుటకు మనోధర్మ సంగీతము అత్యంత ముఖ్యమైనది. గాయకుని భావనాశక్తిచే ఆశువుగా పాడునట్టి సంగీతము శ్రోతలను ఒక మహోన్నత స్థితికి తీసుకొని వెళుతుంది. గాయకుని మేధాశక్తితో, ఆశువుగా పాడు శక్తితో ఇబ్బడి ముబ్బడిగా వృద్ధి చెందుతుంది. నేటి భారతీయ సంగీతమునందు మనోధర్మ సంగీతము మిక్కిలి ప్రాచుర్యమును సంపాదించుకొన్నది.

మనోధర్మమందు 5 భాగములు కలవు.

1) రాగాలాపన 2) తానము 3) పల్లవి 4) నెరవల్ లేక సాహిత్య ప్రస్తారము 5) కల్పన స్వరములు.

1) రాగాలాపన

ఇందులో మూడు భాగములు కలవు. 1. ఆక్షిప్తికము 2. రాగవర్ధిని 3. స్థాయి సంచారము.

ఆక్షిప్తికము : ఆక్షిప్తికము అనగా రాగమును కొంచెం ముందుకు నడిపించుట లేక మొదటి ప్రయత్నముగా రాగమును పాడుట. ఆక్షిప్తికము లక్షణయుక్తమైనది గాని అన్య రాగమిళితమైనదిగా గాని యుండును. రాగాలాపనను మధ్యస్థాయి షడ్జమముతో ఆరంభించి మంద్ర, మధ్య, తారాస్థాయిలలో ఆలపించి, రిషభ, గాంధార, మధ్యమ, పంచమ స్వరములందు సంచరించి, తిరిగి మధ్య షడ్జమములందు ముగింతురు.

రాగవర్ధిని : దీనియందు 4 భాగములు కలవు. ప్రతి భాగమునకు ప్రారంభము (ఎడుప్పు), అంత్యము (ముక్తాయి) ఉండును. ముక్తాయినే 'విదారి'యని కూడ అందురు. విదారి యనగా చీల్చుటయని అర్థము. నాలుగు భాగముల అంత్యములందు ఈ విదారులు, అలంకారములుగా వచ్చును.

మొదటి రాగవర్ధిని : మధ్యస్థాయి షడ్జమము నుండి ఆరంభించి మంద్ర స్థాయినందు సంచరించి, గమకములతోను, విశేష సంచారములతోను, రాగమును వృద్ధి చేయుటను మొదటి రాగవర్ధినిగా వ్యవహరింతురు.

రెండవ రాగవర్ధిని : మొదటి రాగవర్ధినివలె సంచరించి, మధ్యస్థాయినందు, తరువాత తారాస్థాయి పంచమము వరకు సంచరించి, త్వరితగతిన మధ్యస్థాయి షడ్జమము వరకు వచ్చి ముగించుటను రెండవ రాగవర్ధినిగా పేర్కొనబడినది.

మూడవ రాగవర్ధిని : రెండవ రాగవర్ధినివలె మొదలుపెట్టి సంచారములు తారాస్థాయినందే యుండి, మధ్యస్థాయి పంచమము నుండి తారాస్థాయి షడ్జమము వరకు సంచరించి, అక్కడినుండి తారాస్థాయి పంచమము వరకు సంచరింపచేసి, మధ్య షడ్జమమునకు వచ్చి ముగించుటను మూడవ రాగవర్ధినిగా పేర్కొనబడినది.

నాల్గవ రాగవర్ధిని : ఇందు 2, 3 రాగవర్ధినులవలె రాగమును సంచరింప చేయుచు, రాగవర్ధిని కాలము తగ్గించి, త్వరితగతి కల సంచారములను అధికముగా చేయుటనే నాల్గవ రాగవర్ధినియందురు.

స్థాయి సంచారములు: రాగాలాపనలో ఇది చివరి భాగము. రాగములోని ఒక భాగమును స్థాయి స్వరముగా చేసుకొని, ఆ రాగమునందే సంచరించి, తిరిగి అదే స్వరమునకు వచ్చి ముగించుటను స్థాయి సంచారములందురు. ఇందు ఆరోహణ, అవరోహణ స్థాయి సంచారములు కలవు.

మకరిణి ఆలాపన: రాగాలాపన చేయునపుడు, ఒక జీవ స్వరమును స్థాయి స్వరముగా చేసుకొని, స్వల్పముగా సంచరించి, ఏదైన ఒక స్వరముతో ముగించి, తిరిగి ఆలాపన చేసి మొదటి స్థాయి స్వరమునకు వచ్చి ముగించవలెను. ఈ విధముగా మూడు సార్లు ఆలపించి, నాలుగవసారి, మంద్రము నుండి తారము వరకు ఆలపించి, తిరిగి మధ్య షడ్జమము వరకు వచ్చి ముగించుటను మకరిణి లేక వర్తని యని భరతముని వివరించిరి.

2) తానము

మనోధర్మ సంగీతమందు తానమును మధ్యకాల గానమని యందురు. రాగాలాపన తరువాత తానమును పాడెదరు. తానము ఎంతో ఆకర్షణీయముగా, శ్రవణానందకరముగా నుండును. తానమును గానము చేయునప్పుడు, 'తానం' 'తానోంత' పదములకు, ఆకార, అలంకారాదులను చేర్చి, నాభి తానముగా దృతకాలమందు పాడుట సంప్రదాయము. తానమునందు ఆవృత్తములను లెక్కింప వీలుకాదు. అయినను ఒక లయ పద్ధతిలో, త్రికాలములలోను, షట్కాలములలోను కూడ పాడెదరు.

3) పల్లవి

మనోధర్మ సంగీతమునందలి పదము లయ, విన్యాసమను ప్రక్రియలలో మొదటి సాహిత్యా క్షరములను స్వీకరించి పల్లవిగా పేర్కొనబడినది. పదమనగా సాహిత్యపు మాటలు, లయ అనగా కాల

పరిమితి, విన్యాసమనగా విస్తరించి పాడుట. మనోధర్మ సంగీతము నందు పల్లవి అతి ముఖ్యమైన భాగముగా పేర్కొనబడినది. పదచ్ఛేదనము తప్పకుండునట్లు, సాహిత్యాక్షరములు సరిపడు జాగాల యందుంచి, విచిత్ర కల్పనలతో సాహిత్యమును ప్రస్థారించుచు, 1, 2, 4 లేక 8 ఆవృత్తములలో పాడి ముగించెదరు.

4) నెరవల్ (ప్రస్థారము)

ఒక రాగమునందలి కొంత సాహిత్య భాగమును తీసుకొని, ఆకార, ఇకార, ఉకారములతో రాగ తాళ నియమముల ననుసరించి విచిత్ర కల్పనలతో ప్రస్థారించటనే నెరవల్ లేక ప్రస్థారమందురు. నెరవల్ పాడునప్పుడు శ్రోతలు మంచి మానసికానందమును పొందెదరు.

5) కల్పన స్వరములు

ఒక కీర్తనను గాని కృతినిగాని ఎంచుకొని, అందలి పల్లవి లేదా చరణము నందలి సాహిత్య భాగమును తీసుకొని, దాని నియమిత తాళముతో, సమగ్రహంతో కాని, అతీత, అనాహత గ్రహములతో గాని స్వరకల్పన చేసి పాడు ప్రక్రియను కల్పన స్వర ప్రక్రియ యందురు. దీనిని 1/4 ఆవృత్తముతో మొదలుపెట్టి 1, 2, 4, 8 ఆవృత్తములలో స్వరములను కల్పించి, రాగ తాళములననుసరించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ కాలములందు పాడుట ఒక సంప్రదాయము.

27. సంప్రదాయ గాన కచ్చేరి చేయుపద్ధతి

సంప్రదాయగాన కచ్చేరి చేయుటకు మన పూర్వీకులు ఒక నిర్దిష్టమైన పద్ధతిని నిర్దేశించిరి. ఇందు గాయకుడు మొట్టమొదటిగా తన ఇష్ట దైవమును స్తుతించుచూ ఒక చిన్నపాటి కీర్తనను ఆలపించెదరు. తదుపరి సంగీతపరమైన ఒక వర్ణమును విస్తారముగా ఆలపించిన, కంఠ శృతి నిర్ధారించబడిన పిదప, లయ బద్ధముగా ముఖ్య కచ్చేరిని ప్రారంభించెదరు.

ఇందు ఒకటి రెండు కీర్తనలు రాగాలాపన లేకుండా అందరికి తెలిసిన రాగములో అనగా శ్రీరంజని, మాయా మాళవగౌళ, హంసధ్వనిని గాని ఎన్నుకొని శ్రోతలను ఆహ్లాదపరచెదరు. కొందరు అతి తక్కువ కల్పన స్వరములను కూడ ఆలపించెదరు.

ఇది గొంతుకు ఒకవిధమైన సాధనగా, తదుపరి కచ్చేరి శ్రవణానందముగా చేయుటకు సహకరించును. గాయకులు తదుపరి ప్రతిమధ్యమ రాగమును ఆలపించి అదే రాగమునందు కృతిని గానము చేయుట పరిపాటి. దీనికి నెరవల్ గాని కల్పన స్వరములు గాని లేక రెండును పాడెదరు. ముందుగా ఎంచుకొన్న కీర్తనలు, కృతులు విళంబన కాలములో పాడి, అత్యల్ప రాగాలాపన చేసి, ఒకటి రెండు దురిత కాలములో స్వర ప్రస్థారముతో పాడి, తదుపరి ముఖ్య రాగమును విస్తారముగా పాడి, నెరవల్ లేక స్వర ప్రస్థారముతో ఆలపించెదరు. ప్రాచుర్యములొనున్న, అందరికి తెలిసిన, మనోరంజకముగా, ఉల్లాసముగానుండు కీర్తన / కృతులను పాడి శ్రోతలను రంజింప చేయుదురు. కచ్చేరి మధ్యలో సహకార వాయిద్యముల వారికి కొంత సమయమునిచ్చి, వారి ప్రతిభాపాటవములను

వ్యక్తపరచుటకు తాళమును వేయుచు సహకరించెదరు. తదుపరి పెద్ద రాగములలో రాగం, తానం, పల్లవి పాడి, జనరంజకముకొరకు కచ్చేరి చివర్లో తిల్లానాలు, తరంగములు, జావళీలు పాడి, మంచి ఉత్సాహముతో భజనలు చేయుదురు. చివరగా మంగళము పాడి, కచ్చేరిని ముగించెదరు.

28. వాగ్గేయకారుల లక్షణములు - ముద్రలు

మాతు - ధాతువులను సమన్వయపరచి, సంగీత జ్ఞాన సంపన్నులై ఆశువుగా చెప్పకలిగిన స్త్రీ-పురుషులను వాగ్గేయకారులుగా ప్రస్తుతించబడిరి. వారిలో ముఖ్యులు భక్తజయదేవుడు, పురంధరదాసు, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి, నారాయణ తీర్థులు, భక్త రామదాసు, సదాశివ బ్రహ్మేంద్రులు, క్షేత్రయ్య, స్వాతి తిరునాళ్, వెంగమాంబ.

వాగ్గేయకారుల లక్షణములు

1) శబ్ద శాసన జ్ఞానము 2)అభిదాన ప్రవీణత 3) ఛంధ: ప్రవేశము 4) అలంకార జ్ఞానము 5) రసభావ పరిజ్ఞానము 6) దేశకాల పరిజ్ఞానము 7) లౌకిక జ్ఞానము 8) వివిధ భాషా పరిజ్ఞానము 9) సంగీత వ్యాకరణమందు సిద్ధహస్తుడు 10) నృత్య, సంగీత వాయిద్య పరికర జ్ఞానము 11) చక్కని కంఠ స్వరము 12) తాళ లయ పరిజ్ఞానము 13) ప్రమేయ స్ఫూర్తి 14) వాక్పటుత్వము 15) ఆసువుగా చెప్పకలిగిన శక్తి 16) మంచి సరసత్వము 17) ఔచిత్య-పరచిత్త జ్ఞానము 18) త్రిస్థాయిలలోను తగిన గమకజ్ఞుడై యుండవలెను 19) అవధాన పటిమ కలిగి, నూతన ధాతు నిర్మాణము చేయకలిగియుండవలెను.

వాగ్గేయకార ముద్రలు

రచనలలో, వాగ్గేయకారులు తమ రచన అని తెలియచేయుటకు విధిగా ఒక పదమును ఉపయోగించెదరు. అదియే వాగ్గేయకార ముద్రగా తెలుసుకొనవలెను. అటువంటి ముద్ర కలిగిన చరణమును ముద్ర చరణముగా వ్యవహరింతురు. సాధారణముగా ఇటువంటి ముద్ర చివరి చరణమందు, సాహిత్యము చెడకుండునట్లు ప్రయోగించెదరు. ముద్రలు ఈ క్రింది విధములుగానున్నవి.

1) త్యాగరాజు స్వామి - త్యాగరాజ వినుత

2) రాగముద్ర : శ్యామశాస్త్రిగారి స్వరజతిలో భైరవి రాగ ప్రకటనకు 9వ చరణములో బ్రోవవే యిపుడు శ్రీభైరవియను ముగింపు కలదు.

3)తాళముద్ర : రామస్వామి దీక్షితులు ధృవతాళమును ముద్రగా "ఔరా ఇది ధృవముగా' యని ప్రకటించిరి.

4)రాజముద్ర : రామస్వామి దీక్షితులు తమ జమీందారగు శ్రీ వేంకట కృష్ణ మొదలియార్‌ను 'వెంకటకృష్ణ' యని సంభోదించుట. 5) వంశ ముద్రను త్యాగరాజస్వామి శిష్యుడైన శ్రీ వాలాజపేట కుప్పయ్య 'కాకర్ల వంశాగ్రణి' అని త్యాగరాజును కీర్తించెను.

6) నాయకముద్రగా అన్నమయ్య 'వేంకటేశ'యని, క్షేత్రయ్య 'మువ్వగోపాల'యని కీర్తించిరి. 7) స్థల ముద్రను త్యాగరాజు, కోవూరు సుందరేశయని కోవూరు గ్రామమునందు కోవూరు పంచరత్న

కీర్తనలో తెలిపిరి. 8) లక్షణ గ్రంధ ముద్రగా త్యాగరాజు స్వరార్ణమనే లక్షణగ్రంధ నామమును, స్వరరాగ సుధారస అనుకృతిలో తెలిపెను. 9) శరభేంద్ర భూపాల కురవంజి, తమిళ నృత్య నాటికలో 19 తెలుగు సంవత్సర పేర్లనుపయోగించి సంవత్సర నామమను ముద్రగా తెలిపెను. 10) శ్యామ శాస్త్రి తన కీర్తనలలో శ్యామ కృష్ణసోదరియని దేవిని స్తుతించెను.

29. వాగ్గేయకారుల జీవిత చరిత్రలు

మానవుని మౌలిక గుణములైన ధైర్యం, సహనం, భక్తి, శక్తి, పరాక్రమము, సహనం ఒక్కొక్కరిలో, వారి వారి, ప్రారబ్ధ కర్మలననుసరించి, ఈ జీవితములో ప్రకటిత మౌతుంటాయి. భక్తికోవకు చెందిన జీవితాలలో ధార్మిక, నైతిక, వైదిక, ఆధ్యాత్మిక, శాంతి, ప్రేమ, విధేయత, సమత, మమత, నిరంతర పరిశ్రమ వారి వారి సంచిత కర్మలననుసరించి ఈ జీవితములో ప్రస్ఫుటమౌతాయనుటలో సందేహము లేదు. అటువంటి ప్రారబ్ధ - సంచిత కర్మల సంధాన ప్రక్రియలతో ఏర్పడి, భగవదనుగ్రహంచే భక్తి, ప్రేమ, కరుణ, దాస్యము మొదలగు గుణములు అత్యంత మనోహరముగా ద్విగుణీకృతము కావుటవలన, వీరిలోనున్న శుద్ధ చైతన్యమూర్తి ప్రకటితమై ఒక మహనీయుడుగానో, ఒక వాగ్గేయకారునిగానో, ఒక సాధ్వీమ తల్లిగానో, ఒక సంఘ సంస్కర్తగానో పరిఢవిల్లుతుంటారనుటకు మన వాగ్గేయకారులు, సాధ్వీమణులు, సంఘ సంస్కర్తలు మంచి ఉదాహరణలు.

వాగ్గేయకారుల జీవిత చరిత్రలు, నాటి సామాజిక, ఆధ్యాత్మిక, ధార్మిక, వైదిక కార్యక్రమాలకు ప్రతీకలుగా చెప్పవచ్చును.

1) భక్తజయదేవులు

(12వ శతాబ్ధము)

నేటి 'ఒడిషా' రాష్ట్రములోని 'బిందుబిల్వ'మను గ్రామమునందు, 12వ శతాబ్ధములో జన్మించిరి. ఒరియా బ్రాహ్మణ కుటుంబమునకు చెందిన వైష్ణవ తత్వమునందు నిష్ఠాతులైన రమాదేవి - భోజదేవులకు కల్గిన సంతానమే భక్తజయదేవులు. భక్తి పరంపరలో పునీతులైన రమాదేవి - భోజదేవులు స్వతహాగా శ్రీకృష్ణ పరమాత్మ కైంకర్యములు చేయుచుండెడి వారు. ఆ పరమాత్మ స్వరూపముగనే జయదేవుడు వారికి కలిగెనని తల్లిదండ్రులు మురిసెడివారు. యుక్తవయసు వచ్చిన వెంటనే జయదేవునికి 'పద్మావతి'యను కన్యనిచ్చి వివాహము చేసిరి. సత్‌బ్రాహ్మణ వంశములోని సత్పురుషునిగా జన్మతీసుకొన్న జయదేవులు శ్రీకృష్ణుని యందు అపారభక్తి ప్రపత్తులతోనుండిరి. ఆనాటి ఆస్థాన ప్రభువైన లక్ష్మణసేనుని కొలువులో 1116 సం॥న, జయదేవులు ఒక పండితునిగా రాజపోషణ పొందెనని శాసనవిషయము. జయదేవులు శృంగార రసప్రధానమైన 'గీతగోవిందమను' సంగీత కావ్యమును రచించిరి. ఇందులో శ్రీకృష్ణ పరమాత్మ తత్వమును బోధించి, ఆధ్యాత్మిక ప్రేమను, కావ్యధాతువుగా చేసుకొని,

రాధా-కృష్ణులను నాయకి-నాయకులుగా నిర్మించి, పరమాత్మ-జీవాత్మ బంధమును ఎంతో నిగూఢతతో, భక్తి భావముతో, లౌకికానందముతో పరమాత్మ సన్నిధానము చేరవచ్చునని, చెప్పకనే తన రచనలద్వారా నాటి సమాజమునకు ఎలుగెత్తి పాడి, భక్తి సామ్రాజ్యమునందు ఒక సంస్కర్తగా మహోన్నత స్థితికి తీసుకెళ్ళిన మహనీయుడు. వీరి రచనలు అష్టపదులుగా ప్రసిద్ధిగాంచెను. ఈ అష్టపదులలో అష్టవిధనాయికల శృంగార వైవిధ్యం నిర్మించుటలో జయదేవునికి ఎవరూ సాటిరారు. 'గీత గోవిందము' 12 సర్గలలో 24 అష్టపదులతో రచించెను. ఒక్కొక్క అష్టపదిలో 8 పాదములుండునట్లుగా అష్టవిధ నాయికల ప్రతీకలుగా రచించిరి.

అతి పవిత్రమైన అష్టపదిగా 19వ అష్టపదిని వర్ణించిరి. దీనినే 'ధర్మనాష్టపది' లేక 'సంజీవినీ' అష్టపది అందురు. జయదేవులు అసంపూర్ణముగా వదిలిన అష్టపదిని, శ్రీకృష్ణపరమాత్ముడు జయదేవుని వేషములో వారి ఇంటికి వేంచేసి, మిగిలిన భాగమును పూర్తిచేసి, అదృశ్యమైరట. తిరిగి ఇంటికి వచ్చిన జయదేవులు, పద్మావతి ద్వారా విషయము తెలుసుకొని మిక్కిలి ఆశ్చర్యమునొందిరట. పద్మావతికి శ్రీకృష్ణపరమాత్మ దర్శనము దొరికినదిగావున దానికి దర్శన అష్టపదిగా కొనియాడబడినది. ఇది ఒక మహోత్కృష్టమైన భక్తికి నిదర్శనము. అది పద్మావతియొక్క పూర్వజన్మ సుకృతముగా భావించి అష్టపదియొక్క 8వ చరణమున పద్మావతి పేరును చేర్చి రచన సాగించిరట. నాటి సంఘమునందు స్త్రీలకు ఎంత విలువ ఇవ్వబడినదో దీనివల్ల మనకు తెలుస్తున్నది. తదుపరి కాలములో లక్ష్మణసేనుని భార్య, పద్మావతి పతిభక్తిని తెలుసుకొనుటకు, జయదేవులు వేటలో మరణించినారని తెలియచేయగా, ఆమె అక్కడికక్కడే అసువులు బాసినారట. వేటనుండి తిరిగి వచ్చిన జయదేవుడు విషయం గ్రహించి, భార్య ముఖముమీద నీరు చల్లి 19వ అష్టపదిలోని "వదసియది" అనే కీర్తనను పాడిన వెంటనే పద్మావతికి శ్రీకృష్ణపరమాత్మ పునర్జన్మ ప్రసాదించెనట. శ్రీకృష్ణపరమాత్మ దర్శన భాగ్యమునొందిన స్త్రీ మూర్తికి మరల పునర్జన్మ ప్రాప్తమౌతుందని, నిశ్చలమైన భక్తి మానవుని జీవితమును ఎంతగా ప్రభావితము చేస్తున్నదో దీనివలన మనకు తెలియవస్తుంది. అందుకనే ఈ అష్టపది 'సంజీవిని' అష్టపదిగా పేరు గాంచినది. నాటి ప్రజానీకమునందు ఈ అష్టపదులు బహుళ ప్రాచుర్యమునందుండెను. దానికితోడు రాజపోషణ, భక్తి, శృంగారములతో పరిఢవిల్లుతున్న కారణమునను, ఆధ్యాత్మిక భావ ప్రకటనకు, నాయకి - నాయకుల వాద-సంవాదముల క్రియలు, పరమాత్మ-జీవాత్మ లీలా వినోదములతోను, పరమాత్మను చేరుటకు, ఎన్నుకొన్న మార్గములలో భక్తి మార్గము ముఖ్యమని, జీవాత్మ ద్వారా విన్నవించుటకు ఈ శృంగార రస, భక్తి పూరిత మార్గమే శరణ్యమని చెప్పకనే చెప్పుచున్నది. ఇటువంటి భక్తాగ్రగణ్యులు 28-12-1153 సంవత్సరమున శ్రీకృష్ణ పరమాత్మ సాయిధ్యమునొంది జన్మ ధన్యతను పొందిరి.

జయదేవులు నిర్మించిన అష్టవిధ నాయికలు

1. పోషితభర్తృక - రాధికాకృష్ణ
2. వాసక సజ్జక - పశ్యతి దిశిదిశి
3. విరహోత్కంఠిత - సావిరహే
4. ఖండిత - యాహి మాధవ
5. కలహంతరిక - మా కురుమాలిని
6. అభిసారిక - ముగ్ధే మధు మధునం
7. విప్రలబ్ధ - యామిహే కమీహ
8. స్వాధీనపతిక - రమతే యమునా

2) శ్రీ పురంధరదాసు

(1484-1564)

నేటి కర్నాటక రాష్ట్రమున కల బళ్ళారి జిల్లాయందలి హంపి గ్రామము వద్దకల 'పురందర ఘడ్' అను గ్రామమందు వజ్రాల వ్యాపారి అయిన వరదప్పనాయక్ - కమలాంబ దంపతులకు 1484వ సంవత్సరమున జన్మించెను. కర్నాటక సంగీతమునకు ఆదిపురుషుడైన పురంధరదాసు, శ్రీ వేంకటేశ్వరుని కృపవల్ల వరదప్పనాయక్‌నకు కలిగెనందురు. అతని అసలుపేరు శ్రీనివాసుడు. ఇతనికి 16వ సంవత్సరమున సరస్వతి బాయి అను కన్యతో వివాహము జరిపించిరి. తండ్రి వరదప్పనాయక్ మరణానంతరము శ్రీనివాసుడు ఇబ్బడి ముబ్బడిగా సంపాదించి, నవకోటి నారాయణుడుగా ఖ్యాతి చెందెను. ధనాకాంక్షతోపాటు మిక్కిలి లోభితనము కూడా ఆవహించెను. ఇతనిలోని అహంకారము పోగొట్టి, నిద్రాణమైయున్న భక్తిని, రక్తిని మేలుకొలపదలచి, పురంధర విఠలుడు ఒక పన్నాగమును రచించి, ఒనరించి, శ్రీనివాసునకు గర్వభంగము కలిగించెను. తదుపరి తానే స్వయముగా సాక్షాత్కరించెను. ఈనాటికిని హంపిలోని తుంగభద్ర నది ఒడ్డునున్న పురంధర ఘాట్‌లోని రాతి స్థంభముమీద విఠలుని శిల్పమును చూడవచ్చును. పరమాత్మ సాక్షాత్కారముచే, చైతన్యమునొంది, తన సంపదనంతయు, దాన ధర్మాదులకు, భగవంతుని కైంకర్యములకు ఉపయోగించి, దాసుగా మారి, పురంధరదాసుగా అవతరించిరి. భక్తి పరంపరలో మునిగిపోయిన దాసు, విఠలుని తన ముద్రగా చేసుకొని అనేక అపూర్వ రాగములందు కీర్తనలు రచించెను. సంగీతమును నేర్చుకొను విద్యార్థుల నిమిత్తము మాయా మాళవగౌళ రాగములో సరళీలు, జంటలు, దాటు స్వరములు, హెచ్చు స్థాయి స్వరములు రచించి, కర్నాటక సంగీతమునకు మార్గదర్శకుడయ్యెను. అందువల్ల సంగీత పితామహుడని కొనియాడబడుచున్నారు. వీరు రచించిన పిళ్ళారి గీతములు, ఘన రాగములు, కీర్తనలు, భజనలు, దేవర నామములు, వేదాంత ప్రభోధములు ఇతరత్ర అనేక రచనలు దక్షిణ భారతమునందు మిక్కిలి ప్రాచుర్యమునొందెను. వీరి రచనలన్నియును ''దాసరపదగళు''గా, కన్నడ దేశమందు మిక్కిలి ప్రసిద్ధిగాంచినవి. వీరు దాదాపు 4,75,000 సంకీర్తనలు రచించినట్లు శాసనముల వల్ల తెలిసినది. వీటిలో ద్విజావంతి, శామకల్యాణి, మధుమాధవి మొదలగు అపూర్వ రాగముల రచనలు కలవు.

వీరి చరణముద్ర ''పురంధరవిఠల''ను ప్రతి రచనయందు చూడవచ్చును. ఆ విఠలునియందున్న భక్తికి, తన పేరును జోడించి ఆత్మ-పరమాత్మ బంధమును చూపించిన సంగీత పితామహుడు చిరస్మరణీయుడు. వీరు 1564 సంవత్సరమునందు జనవరి 2వ తేదీన పరమాత్మనందు శాశ్వత సిద్ధి పొందిరి.

కొన్ని ప్రసిద్ధినొందిన రచనలు: జగదోద్ధారణ, దేవకినందన, దయమాడోరంగ, నా నేనుమాడి, రామనామ, శరణుసిద్ధి మొదలగునవి.

3) శ్రీ నారాయణ తీర్థులు

(1675-1745)

నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమున కల గుంటూరు జిల్లా 'కాజ'యను గ్రామమున 1675వ సంవత్సరమున తల్లా వర్ధుల వంశస్తులైన గంగాధరము - పార్వతి గార్లకు జన్మించిరి. చిన్నతనము నుండియే అశేష జ్ఞానమును కలిగియుండి, ఎల్లప్పుడును తల్లిచెంత చేరి అనేక రామాయణ, భాగవత, భారత ఇత్యాది గ్రంధములను ఆకళింపు చేసుకొనిన ప్రజ్ఞావంతులు గోవిందశాస్త్రి (పూర్వనామము). వీరి ఇల్లాలు అచ్చమ్మ. వారి స్వస్థలం వేదాద్రి. ఒకనాడు నోము నోచుటకై కృష్ణానది ఆవలి ఒడ్డుననున్న వేదాద్రికి బయలుదేరి వెళ్ళినది. గోవిందశాస్త్రి అత్తమామల ఆహ్వానమును మన్నించి వేదాద్రి చేరుటకు కృష్ణానదిలో దిగి ఈతకొట్టుచున్నప్పుడు, ప్రవాహ వేగము మితిమీరి ప్రాణాపాయ స్థితికి చేరుకొన్న గోవిందశాస్త్రికి, సన్యాసం తీసుకొని మరణిస్తే జీవితం తరిస్తుందని తెలుసు. వేదశాస్త్ర పారంగతుడైన గోవిందశాస్త్రి, శిరోముండనమునకు బదులు, నడిప్రవాహములో, తలలోని వెంట్రుకను పీకి పారవైచి గురుస్తుతి చేయుచు సన్యాసము స్వీకరించిన వెంటనే నీటి ప్రవాహము శాస్త్రిగారిని ఒక ఒడ్డునకు చేర్చెను. పూర్తి సన్యాసాశ్రమం స్వీకరించి, వేషధారణను పొంది, వేదాద్రి సమీపములో 12 సంవత్సరములు తపమాచరించిన పిదప కాశీయాత్రకుపక్రమించెను. అచ్చట శివరామానందతీర్థ స్వామిని కలిసి, ఆత్మజ్ఞానమునొంది, ఆది శంకరుల 'ప్రబోధ సుధాకరం'ను పఠించిన పిదప గంగాతీరములో యతిదీక్ష తీసుకొనిరి. నాటినుండి 'యతి నారాయణతీర్థులు'గా భాసించిరి. నాడు ఆత్మజ్ఞానమునొందిన నారాయణతీర్థులు హరేకృష్ణ గోపాల, వాసుదేవ గోపీరమణ యను తరంగమును ఆశువుగా పాడి వినిపించిరి. శివరామానందులవారి ఆజ్ఞానుసారము కావేరి తీరమునందున్న 'భోధేంద్రసరస్వతిస్వామి' వారిని కలుసుకొను నిమిత్తం తిరుపతి వెళ్ళిన తీర్థులవారికి శ్రీ వేంకటేశ్వరస్వామి బాలుని రూపములో దర్శనమిచ్చిన వేళ 'బాల గోపాల। మా ముద్దర' తరంగమును మోహనరాగంలో, ఐదు తాళ గతులతో, నాట్య జతులను చేర్చి, ముగ్ధ మనోహరరూపుని వర్ణించిరి. గోవిందపుర నివాసి అయిన బోధేంద్రసరస్వతిని చూడవెళ్ళిన తీర్థులకు, ఆ స్వామి పరమపదించిరని తెలసుకొని ఖిన్నుడై, ఆయన రచించిన గ్రంధముల మర్మములను అవగాహన చేసుకొని, 'నడుకావేరి'యను గ్రామమున గణపతి ఆలయములో విశ్రాంతి తీసుకొనుచున్న తీర్థులవారికి కడుపునొప్పి విపరీతముగా రాగా శ్రీ వేంకటేశ్వరుని సన్నిధికి పోవ నిశ్చయించినవాడై నిద్రకుపక్రమించెను. స్వప్న దర్శనంలో చెప్పిన రీతిలో నిద్రలేచిన వెంటనే ఒక వరాహం పడమటి దిశగా పోవుట గమనించి, దాన్ని వెంబడించిన తరువాత దక్షిణ దిక్కుగా వెళ్ళి భూపతిరాజపురం చేరిరి. అక్కడ తీర్థులవారికి తను బసచేసిన ప్రదేశమునందు, శ్రీమహావిష్ణువు శ్రీదేవి, భూదేవి సమేతుడైన వెంకటేశ్వరస్వామి విగ్రహము లభ్యమైనది. కాజ గ్రామమునకు దగ్గరలోనున్న కూచిపూడి భాగవతుల యక్షగానముల ప్రభావము తీర్థులలో కనిపించి, శ్రీకృష్ణ లీలలను రచించిరి. 'వరహరు'లో ఆయన ప్రతి సాయంత్రము భగవంతుని పూజ ముగిశాక, అందెల రవళులు వినిపించేవట. అలా అందెల రవళులు వినిపించిన కీర్తనలే శ్రీకృష్ణ లీలా తరంగిణిలో చేర్చిరి. ప్రతి తరంగమునకు ముందు శ్లోకములు కలవు. వాటిని గానము చేసిన పిదప తరంగములు పాడుట ఒక ఆనవాయితి. తదుపరి కాలంలో "తిరుప్పన్‌దూరు"కు చేరుకొని అక్కడే చాలాకాలం ఉండిరి. తదుపరి 1745 సంవత్సరమున తనకు నీడనిచ్చిన మామిడి చెట్టుక్రింద జీవసమాధినొందిరి.

వీరి రచనలు : పారిజాతాపహరణము, భక్త్యాదికరణమాల, సిద్ధాంతబిందు, వేదాంతవిభావ నాటిక, యోగ సూత్ర వ్యాఖ్యానము మొదలగునవి.

కొన్ని తరంగములు : జయజయస్వామిన్, రామకృష్ణ గోవిందేతి, శరణంభవ, పూరయ మమకామం, జయజయదుర్గే, ఏహిముదం మమదేహి, గోపాల మా కలయసఖి, నందగోపబాలకృష్ణ, శ్రీ నిలయం సఖి, గోవర్ధన గిరిధర గోవింద, ఆలోకయే శ్రీ బాలకృష్ణం, పశ్యతి పశ్యతి భగవంతం, కృష్ణం కలయ సఖి సుందరం-బాల.

4) శ్రీ అన్నమాచార్యులు

(1408-1503)



నేటి కడప జిల్లాలోని తాళ్ళపాకయను గ్రామమున క్రీ.శ. 1408న, వైశాఖ పౌర్ణమినందు నారాయణ సూరి - లక్కమాంబలకు, వేంకటేశుని 'నందక'మను ఖడ్గము యొక్క అంశగా పదకవిత పితామహుడైన అన్నమయ్య జన్మించెను. చిన్నతనమునుండే ఆ వెంకటేశునిపై పరమభక్తి కలవాడై, తన జ్ఞానమును పదిమందికి పంచుచుండెను. ఒకనాడు వేంకటేశ్వరుడు స్వప్న దర్శనమిచ్చి తిరుమలకు రమ్మని ఆదేశించగా, తిరుమలకు బయలుదేరి, మార్గమధ్యమున ప్రయాణపు బడలికచే అలసిపోయి నిద్రిస్తున్న అన్నమయ్యను మేలుకొలిపి అలమేలు మంగమ్మ పండు ముదుసలిగా దర్శనమిచ్చి, ఆయనకు సేదతీర్చెనని ప్రతీతి. ఆ విధముగా తిరుమల చేరిన అన్నమయ్యకు గుడిద్వారములు మూసియుండుట చూచి, బాధపడి, అక్కడికక్కడే ఆశువుగా కీర్తనలు పాడగా భగవంతుని అనుగ్రహమువల్ల తలుపులు వాటంతట అవి తెరుచుకొని, వేంకటేశుని దర్శన భాగ్యము నొనరించెనట. తాళ్ళపాకలో తల్లిదండ్రులు మిక్కిలి దుఖించుచుండ, అన్నమయ్య తిరుమలలో యున్నట్లు పాదచారులవద్ద తెలసుకొని, తిరుమల వేంచేసి, అన్నమయ్యను మరల స్వగ్రామమునకు తీసుకొని వెళ్ళ నిశ్చయించిన పిదప, తను తిరుమల వదలి రానని, వివాహము చేసుకోనని అన్నమయ్య తల్లిదండ్రులకు విన్నవించినాడంట. అయితే ఆ రాత్రి వేంకటనాధుడు, అన్నమయ్యకు స్వప్న సాక్షాత్కారమిచ్చి తల్లిదండ్రులతో వెళ్ళి వివాహము చేసుకొనమని ఆజ్ఞనొసంగిరట. తదుపరి తిరుమల నుండి తాళ్ళపాక చేరిన అన్నమయ్య తిమ్మక్క, అక్కమ్మ అను సోదరీమణులను వివాహము చేసికొని వారి ద్వారా సంతానమును పొందెను. వేంకటేశ్వరుని స్వప్న ఆజ్ఞానుసారం ఘనవిష్ణువను యతి, తిరుమల చేరిన అన్నమయ్యకు ఆచార్య సంస్కారముల నొనరించి అన్నమాచార్యులుగా నామకరణము చేసిరి.

అన్నమాచార్యులు నాటినుండి వేంకటేశునిపై అనేక శృంగార రసభరిత కీర్తనలు, తత్వములు, వేద సారములు, ఆధ్యాత్మిక సంకీర్తనలు, వైరాగ్య భాగ్యములు, నాటి సాంఘిక, భౌగోళిక పరిస్థితులను ఇతివృత్తములుగా వేంకటేశుని సన్నిధానమునందు రచించిరి. ఈ కీర్తనలు అఖండము, అజరామరములు, అనంతములు మరియు అద్భుత సంగీత-సాహిత్య కళాఖండములుగా వెలుగొందుచున్నవి. నాటి కర్నాటక సంగీత పితామహుడైన పురంధరదాసు, అన్నమయ్య ఘనకీర్తిని వేనోళ్ళ పొగిడినారు. ఆయన సాక్షాత్తు విష్ణు సంభూతుడనే కీర్తించినారంట.

అచ్చమైన తెలుగు పదాలతో, జానపదములతో, మంచి మండలీకములతో కవితకు ప్రాణం పోసిన ఈ ఘనుడు క్రీ.శ. 1503 ఫాల్గుణ బహుళ ద్వాదశి దినమున ఆ వేంకటేశ్వరునిలో లయమైనారు. ఆ తిరుమలస్వామి వేంకటేశ్వరుడు యావత్ ఆంధ్ర భాషకు ఖండాంతరముల ఖ్యాతిని పొందిన అన్నమయ్యను మనకు ప్రసాదించి, ఆయన ద్వారా మనకు స్వామి ఇచ్చిన కానుకను నాటికి, నేటికి, రేపటికి కూడా కొనిపోవుట ప్రతి తెలుగువాని మహాద్భాగ్యముగా స్వీకరించవలెను. అన్నమయ్య ముద్ర 'వేంకటేశ'. ఆ వేంకటేశ్వరుని ప్రతి కీర్తనలో, ప్రతి గాయకుడు పాడే సమయములో ఈ ముద్రను ఉచ్చరించి ఆ వెంకన్నస్వామి కరుణా ప్రసాదితులుగా ఖ్యాతినొందెదరు. ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాదుగారు, అన్నమాచార్యుల సంకీర్తనలను స్వరపరచి, ప్రజారంజకముగా గానము చేసిన మహోన్నత గాయకులు.

కొన్ని జన బాహుళ్యములో ప్రసిద్ధినొందిన రచనలు : 1) హరియవతారమె 2) తలచరో జనులు 3) జో అచ్యుతానంద 4) చేరి మొక్కరో జనులు 5) చూడరమ్మ చెలులారా 6) కోరికలు కొనసాగె 7) ఏ విచారములు వద్దు 8) ఆదివిష్ణు వీతడు 9) ఏముకో చిగురుటధరము 10) ఎంతమాత్రమున.

5) క్షేత్రయ్య

(1600-1680)

నేటి కృష్ణాజిల్లాలోని 'మొవ్వ'యను గ్రామమునందు వీరు 1600 సంవత్సరమునందు జన్మించిరి. వీరి అసలుపేరు వరదయ్య. అనేక క్షేత్ర దర్శనముల వల్ల వీరు క్షేత్రయ్యగా ప్రజలందరికి తెలుసును. వీరు చిన్నతనమునుండి అనమాన పాండిత్యముతో తేజోవంతుడై విరాజిల్లుచుండెను. అనమాన ప్రజ్ఞాపాటవములు కలిగిన వరదయ్య తన సహచరి అయిన 'మోహనాంగి'యను దేవదాశి కన్యయందు అపారమైన ప్రేమాభిమానములు ఒలక పోసెడివారు. అయినను మోహనాంగి తలయెగ్గక, వరదయ్యలో నిక్షిప్తమైన పాండిత్యమును మెరుగుపెట్టదలచి, ఆ మొవ్వగోపాలుని తనముద్రగా చేసుకొని రచనలు కొనసాగించమని ప్రోత్సహించెడిదట. ఆ విధముగా వరదయ్య అనేక దేశములు తిరుగుచు, రచనలు సాగించుచు, ఉద్దండ పండితుల వద్ద, రాజపోషకుల వద్ద, రాజమందిరములందు జరుగు పండిత సభలయందు తమ రచనాశైలిని, పాటవమును కనబరచుచూ అనేక పండిత గౌరవములనొందెను. ఈ విధముగా అనేక క్షేత్రములు తిరుగుటచే నాటినుండి వరదయ్య, క్షేత్రయ్యగా గణుతికెక్కిరి. ఆయన రచనలలో తను నాయకిగా, భగవంతుడు నాయకుడుగా, తన ప్రేయసి తనను ప్రేమించే రీతిలో అంతరార్థమును ఇమిడించి, ఒక విలక్షణమైన సంగీత రచనలు చెసెను. వీనినే పదములందురు. తర్వాతి కాలములో క్షేత్రయ్య పదములుగా ప్రసిద్ధినొందినవి. ఈ పదములయందు వీరి శృంగార రసపోషణ, సంగీత జ్ఞానము, కల్పన చాతుర్యము, భావప్రకటనలు, పదగంభీరత, మండలీక జానపద పద ప్రయోగములతో రసజ్ఞుల మనస్సులను అలరారించును. అంతటి మహానుభావుడు, శ్రీకృష్ణ పరమాత్మ సశరీర దర్శనమునొంది, అనేకసార్లు ఆయనతో సంభాషించిరట. వీరి మొట్టమొదటి రచన శృంగార రసప్రధమైన "శ్రీపతి సుతబారి నే నోపలేక నిను వేడితి" అను పదమును ఆనందభైరవి రాగమునందు, తన విరహబాధను తాళలేక, ఆ దేవ దేవిని మనసునందుంచుకొని, శ్రీకృష్ణ పరమాత్మ స్వరూపములో

వివరించెను. పదరచనలో మోహనాంగియందు తన అలౌకిక ప్రేమను ఎంత సూటిగా వివరించెనో కదా! వీరి పదములన్నియు వ్యాకరణముతోను, జాతీయములతోను శుద్ధ తెనుగు జానపద, వ్యవహారికములతోను, కొన్ని మండలీకములతోను, కొన్ని తేనెవంటి తెలుగు పదములతోను వ్యాప్తి చెంది, శోభాయమానముగా రక్తి కట్టించును.

వీరి రచనలన్నియు అంతర్భక్తి కలిగి, శృంగార భావమును స్ఫురించు చుండును. వీరి పదములు గానము చేయుటకు, సునిశితమైన గమక పరిజ్ఞానము, లోతైన సంగీత వ్యాకరణము, పదవిచ్చేదన శక్తి, పదబంధనము, రాగశుద్ధి కలిగియుండవలెను. రచనలన్నియును, రాగ సంపూర్ణతను కలిగి రససిద్ధి కలిగించును. వీరి రచనలు ఎక్కువగా కాంభోజి, ముఖారి, భైరవి, కల్యాణి, సావేరి మొదలగు రాగములందు కనపడును. వీరి శృంగార రసపోషణయందు కలిగే ఆవేదనను వెడలపుచ్చే కొన్ని రచనలు 'సతులనమే పాపజాతి, మగవాని కట్టుబెట్ట మనతరముగాదె, తెలిసి తెలియక పలికేరు చెలులు, పదివేల చుక్కలాయన, ముద్దులేని వానితో ముచ్చటేల, ప్రొద్దుపోదు నిదుర రాదు - పోలతి నెడబాసిన మొదలు" నిజముగా మచ్చుతునకలు. "మగువ తన కేళికా మందిరమును వెడలెను" అను రచనలో విశాలమైన రసానుభూతి, లోతైన రసజ్ఞత నాటి యవ్వనులకే ఎరుక. ఇందలి పదములు సామాన్య మానవుని నుండి పండితుల వరకు వేనోళ్ళ కొనియాడబడినవి.

మొవ్వగోపాలునియందు అచంచలమైన భక్తి కలవాడై, స్వామితో అనేక సంభాషణలు చేసినవాడై, శ్రీకృష్ణ పరమాత్మ తత్వమును ఒక ప్రేమజ్యోతిగా ప్రజల కందించిన మహనీయుడు. ఆ దృష్టితో రచించిన "అలిగితే, పతి సన్నిధి లేని, భామరో మువ్వగోపాల, వదరకపోతే, ఇంతనా పొరుగింటనే" అనే పదములు మచ్చుతునకలు. తను ఒక నాయికగా తలచి ఆదర్శప్రాయమైన నాయిక-నాయకుల చిత్తములను రక్తి కట్టించిన మహనీయుడు. తను జీవాత్మగను, శ్రీకృష్ణుడు పరమాత్మగను తలచి, జీవాత్మ-పరమాత్మ మధ్యన జరిగే వాదములు, సంవాదములు, విరహగీతికలు, భక్తి ప్రపత్తులు చివరకు పరమాత్మను చేరుటకు జీవాత్మ శుద్ధ తత్వమును లోకానికి చాటిన మహోన్నత వాగ్గేయకారుడు క్షేత్రయ్య. ఆంధ్రదేశమునందు జన్మించిన ఇటువంటి వాగ్గేయకారులు దేశ ప్రజలకు ధార్మిక, నైతిక, ఆధ్యాత్మిక భక్తిని సంతరించి, ప్రోదిచేసి, భావితరాలకందించిరి. వీరి పదములను వీణ ధనమ్మాళ్ మంచి ప్రాచుర్యమునకు తెచ్చిరి.

6) భద్రాచల రామదాసు (కంచర్ల గోపన్న)

(1620-1680)

నేటి గుంటూరు జిల్లా వినుకొండ తాలూక కంచర్ల గ్రామములోని వేణుగోపాలస్వామి, సంతానార్థులై విచ్చేసిన లింగనమంత్రి-కామాంబ దంపతులకు స్వప్న దర్శనమిచ్చి, పుత్రుని బడయుదురని భరోసా ఇచ్చిరట. తదుపరి కాలమునందు ఈ దంపతులు ఖమ్మం జిల్లా నేలకొండ పల్లికి వలస వెళ్ళిరట. అక్కడనే 1620 సంవత్సరములో కంచర్ల గోపన్న జన్మించిరి. వీరి బంధువులైన అక్కన్న, మాదన్నలు, నైజాము ప్రభుత్వములో మంచి ఉద్యోగము లోనుండిరి. వీరి సహాయమున, కంచర్ల గోపన్నకు నిజాం ప్రభువు 'అబ్దుల్ హసన్ కతుబ్ షా' తన కొలువులో చేర్చుకొని, భద్రాచలమునందు 'తహశిల్దారు'గా నియమించిరి.

చిన్న తనమునుండియే గోపన్న దైవభక్తి మెండుగా కలిగియుండుటచే, తల్లి కామాంబ వద్ద అనేక నీతి సారాంశముల నొందుటచే భద్రాచలమునకు చేరిన పిమ్మట, అచ్చటి శిధిలావస్థలోనున్న రామభద్రుని ఆలయము చూచి, బహుదుఖి:తుడై, దానిని జీర్ణోద్ధరణ గావింపతలచి, తనవంతు సహాయము చేయుచు, గ్రామ పెద్దల సహాయ సహకారములతో కార్యక్రమమును మొదలు పెట్టెను. రామాలయమునకు ప్రహరీలు, గోపురములు కట్టించి, దేవదేవేరులకు అనేక నగలు, వాహనములు చేయింప, ఇంకనూ ధనము చాలదాయను. అప్పుడు గోపన్న ప్రజల ధనమును పరమాత్ముని సేవకుపయోగింపనెంచి, తనకు వసూలైన శిస్తును రామాలయ పునరుద్ధరణకుపయోగించుటకు అనుమతింపవలసినదిగా తానీషా గారికి విన్నపములను పంపెను. తానీషా కొలువులోనున్న అంతర్గత కలహములవల్ల ఆ లేఖను తానీషాకివ్వకుండెను. అయినను గోపన్న ఆ ధనమును ఖర్చు చేసెను. జమాబంధి లెక్కలలో గోపన్న ఆరు లక్షల రూపాయలను అనుమతి లేకుండా ఖర్చు చేసెనని తేల్చి, అనేక అభాండములను వేసి, చివరకు తానీషా కోపాగ్నికి బలిచేసి గోలుకొండ కోటలో గోపన్నకు 12 సం॥లు చీకటి కారాగారము నందు బంధించి, అనేక కఠిన శిక్షలను విధించిరి. అకుంఠిత రామభక్తి ప్రియుడైన గోపన్న, ఆ శిక్షలను అనుభవించుచూ తన అపార పాండిత్యమును ప్రదర్శించుచూ ఆ రామచంద్రునికి తన బాధలను కీర్తనల రూపమున విన్నవించెను. తాను చేసినపని లౌకికముగా తప్పయినను, ఆధ్యాత్మికముగా ప్రజల సొమ్ము భగవంతునికి కైంకర్యము చేయుటలో కొంత వెసులుబాటు ప్రభువుల వారివ్వలేదని, కలతచెంది, రామునితో తన ఆర్తిని అనేక విధములైన కీర్తనలలో నిక్షిప్తము చేసెను.

తానీషా బాధలనోర్వక శ్రీరామచంద్రునితో భక్తి పూర్వక తూలనాడుటలో "ఇక్ష్వాకు కుల తిలక" అనే కీర్తన మంచి ఉదాహరణ. ఆ కీర్తనలో తాను భరత, శతృఘ్ను, లక్ష్మణులకు, సీతమ్మ తల్లికి చేయించిన ఆభరణములను ఎరుకపరచి, నాయనా ఇది నీ తండ్రి, మామల సొత్తుగాదు అని తూలనాడి, తాను బాధలు భరింపలేక తూలనాడితినిగాని, రామచంద్రా నా బాధలు తీర్చవయ్యా అనుటలో, భక్తుడు పరమాత్ముని లీలలో భాగంగా బాధనొందు చున్నప్పుడు, ఆ దేవదేవునిని సున్నితముగా దూషించుట, తర్వాత శరణు వేడుకొనుట ఆ రామదాసునికే చెందినది. భద్రాద్రి కొండ సాలగ్రామ పర్వతశిల అయినందున, శ్రీమహావిష్ణువే శ్రీరామచంద్రునిగా ఈ కొండమీద వేంచేసిరట. అందుకే రామదాసు ఈ కొండ ఘనకీర్తిని, కలియుగ వైకుంఠముగా, అంతా రామమయంగా ప్రస్తుతించిరి. తానీషా భటులు వేసే కారాగార శిక్షలను అనుభవించుచు, రామ నామమే జన్మధన్యమని, ఆ రామునిగన్న దినమే సుదినమని, "ఏ తీరుగనను దయ చూచెదవో", అని తన ఆర్తిని నివేదించుచూ, అనేక వైవిధ్యమైన కీర్తనలు రచించి, భక్తి సాంప్రదాయమందు ఒక కొత్త ఒరవడిని తెచ్చిపెట్టిరి. గోపన్న భక్తికి పరవశులైన రామ లక్ష్మణులు ఒకరోజు రాత్రి తానీషాకు అంత:పురమునందు దృశ్యరూపమున గోచరించి, రామదాసు పంపగ వచ్చినారము, పైకము తెచ్చినాము, తీసుకొని రసీదు ఇచ్చి పంపండి అని పలుకుచు, రామదాసుని 12 సంవత్సరములు బందీ చేసినారు, ఇకనైన విడువండి అని చెప్పి అదృశ్యులయినారు. మరునాడు తానీషా తానుకన్నది కలయో నిజమో ఎరుగక, మిక్కిలి దుఖి:తుడై, రామదాసును చెరసాల నుండి విముక్తి చేసి, శ్రీరామచంద్రులు తనకు నిజ సాక్షాత్కారము నొసంగిరని తెలుసుకొని అనేక పశ్చాత్తాపములకు గురై, నాటినుండి రామాలయమునకు అనేక కానుకలనొసంగెను. నేటివరకు కూడా ప్రభుత్వ ఖజానానుండి శ్రీరామనవమినందు కానుకలు పంపుట ఆనవాయతి. పరమ భక్తుడైన రామదాసు బాధలను నివారించుటకు, తానీషాకు దర్శనమిచ్చుట భగవంతునికి కుల మత బేధములుగాదు నిశ్చలమైన భక్తి ఒక్కటియే శరణు మార్గమని హైందవ ధర్మ సంస్కృతిలోని వేదాంత రహస్యమును

తెలుపుతుంది. రామదాసు తదుపరి అనేక కీర్తనలు రచించుచూ, భక్తి తత్పరతతో, 1680వ సంవత్సరమున తనువు చాలించిరి.

వీరి రచనలు: తారకమంత్రము కోరిన దొరికెను, అంతా రామమయం, ఇదిగో భద్రాద్రి, కలియుగ వైకుంఠము, దశరథ రామా గోవిందా, ఇక్ష్వాకు కుల తిలక, ఎటుబోతినో రామా, ఏ తీరుగ నను దయ చూచెదవో, ఏమిరా రామ, గరుడగమన రారా, చరణములే నమ్మితి, పలుకే బంగారమాయనా, భజరే శ్రీరామం, సీతారామ స్వామి, అబ్బబ్బ దెబ్బలకు తాళలేరా, రామజోగి మందు కొనరే, ఇదిగోనండి పైకము మొదలగునవి.

7) త్యాగరాజు

(1767-1847)

నేటి తమిళనాడు రాష్ట్రమునందు కల తంజావూరు జిల్లాలోని "తిరువారూరు"లో క్రీ॥శ. 1767, సర్వజిత్ నామ సంవత్సర, వైశాఖ శుద్ధ షష్ఠి శుక్రవారమునందు రామబ్రహ్మం- సీతమ్మలకు మూడవ మగ సంతానముగా త్యాగరాజు జన్మించిరి. వీరు కాకర్ల గ్రామము నుండి క్రీ॥శ 1600 ప్రాంతమున, (కంభం తాలుకా, కర్నూలు జిల్లా) తంజావూరుకు వలస వెళ్ళి అక్కడ తిరువారూరుయను గ్రామమునందు నివాసమేర్పరుచుకొనిరి. వీరు ములకనాటి బ్రాహ్మణులు, భరద్వాజ గోత్రికులు.

త్యాగరాజు చిన్ననాటి నుండి దైవభక్తి కలవాడై, అనేకానేక శ్లోకములు, కీర్తనలు, తల్లి సీతమ్మగారి వద్దనే అభ్యసించెను. యవ్వనమందు పార్వతియను కన్యను వివాహమాడిరి. అనారోగ్యముతో పార్వతి మరణించగా, ఆమె చెల్లెలు కమలాంబను వివాహమాడి, సీతాలక్ష్మియను కుమార్తెను పొందెను. త్యాగరాజు వీరి తాతగారైన 'గిరిరాజకవి' గారివద్దను, తదుపరి శొంఠి వెంకటరమణయ్యగారి వద్దను సంగీత శిక్షణపొంది, అపారమైన పాండిత్యమును పొందెను. రామ కృష్ణానందస్వామియను యతీంద్రులు ఒకరోజు వీరి ఇంటికి వేంచేసి, వీరి ప్రజ్ఞాపాటవములను ప్రశంసించి, వీరికి 'నారదోపాస్థి'యను మహా మంత్రమునుపదేశించిరి. దాని జప ఫలముచే, నారదులవారు యతిరూపమున దర్శనమిచ్చి 'స్వరార్ణవము', 'నారదీయము' అను అపూర్వ సంగీత గ్రంధములనిచ్చి అంతర్ధానమయ్యెను. ఆ సమయముననే వీరు నారదపంచరత్నములు రచించి, స్తుతించిరి.

త్యాగరాజు 96 కోట్ల రామతారకమును వ్రాసి సీతా సమేత రామలక్ష్మణులను దృశ్యరూపమున గాంచిన పరమభక్తులు. వీరు 24,000 కీర్తనలు రచించిరని, అపర వాల్మీకిగా కీర్తించపడినారు. వీరు నౌకా చరిత్రము, సీతారామ విజయము, ప్రహ్లాద భక్తి విజయములను ప్రబంధములను రచియించిరి. వీరి యాత్రా పరంపరలో అనేక క్షేత్రములు దర్శించి అచ్చటి స్థానిక దేవతలమీద అనేక కీర్తనలు రచించిరి. కోవూరు పంచరత్నములు, తిరువత్తయ్యూరు పంచరత్నములు, లాల్గుడి పంచరత్నములు, ఘనరాగ పంచరత్నములు ప్రసిద్ధిగాంచినవి. సంగీత త్రిమూర్తులుగా పేరుగాంచిన వారిలో త్యాగరాజు ఆద్యుడు. ముత్తుస్వామి దీక్షితులు రెండవవారు, శ్యామశాస్త్రి మూడవవారు. త్యాగరాజు ఏదినమునందు కూడా ఆయాచిత ధనార్జనకు, రాజ సత్కారములకు తలవొగ్గక, తంజావూరు రాజైన 2వ శరభోజి ఆహ్వానమును తిరస్కరించి, కల్యాణిరాగమున "నిధిచాలసుఖమా"యను కీర్తనను రచించిరి. త్యాగరాజు పాండిత్యమును

వినిన, శరభోజి మహారాజు మారువేషమున వచ్చి, త్యాగరాజు సంకీర్తనలు విని, ఆయన రామసేవ నిరతిని శ్లాఘించి, ధన్యుడైనాడు. అన్నయగు జపేశ్వరుని కోపాగ్నిని సైతము లెక్కచేయకుండిన, ఒకరోజు జపేశ్వరుడు, త్యాగరాజు పూజా మందిరమునందున్న రామ పంచాయతనమును కావేరి నదిలో పడవైచి గోప్యముగానుంచెను. దుఖి:తుడైన రామదాసు తోడిరాగమున 'ఎందుదాగినాడో' అనే కీర్తనను ఆలపించగ, రామచంద్రులు స్వప్నదర్శనమిచ్చి జరిగిన కథ విన్నవింపగా, కావేరి నదియందున్న రామపంచాయతనము తెచ్చుకొని, కనుగొంటిని శ్రీరాముని నేడు (బిలహరి), రారా మాయింటిదాకా (ఆసావేరి), ఎట్లాదొరికితవో (వసంత) కీర్తనలు రచియించెను. త్యాగరాజు భక్తి అసమాన్యము, అనన్యము, అపారమైనది. తిరుపతిలో వేంకటనాధుని దర్శించుకొనుటకు వెళ్ళిన త్యాగరాజస్వామికి, అక్కడి పూజారులువేసిన తెరను తీయమని అర్ధించిన తీయక, దూషణమాడిరట. ఆ సమయమున 'తెరతీయగరాదా' అను కీర్తనను గౌళ పంతురాగమునందు ఆలపింప, తెర దానంతట అది తెరుచుకొని శ్రీవారి దర్శనమాయెనట. చెన్నపట్టణమునందుకల వేణుగోపాలస్వామి దర్శనమునకేగి, ఆ స్వామిపై 'వేణుగానలోలుని గన' అను కృతిని కేదార గౌళరాగమునందు రచించిరి. ఈ కీర్తన మిక్కిలి ప్రాచుర్యమునొందినది. త్యాగరాజస్వామి వారు ఒక మహత్తరమైన నాదయోగి. ఒకసారి పుత్తూరు ఆలయపు బావిలో పడి మరణించిన ఒక యాత్రికుని కుమారుని గని, కరుణించి, 'నాజీవధారా' అను కృతిని బిలహరి రాగములో నాలపించిన వెంటనే బ్రతికి బయటకు వచ్చెనంట. ఈ దైవాంశ సంభూతమైన క్రియలు అవధూతలకు గాక మరెవ్వరికి సాధ్యము కాదు. అందుకే వీరి రచనలు తత్వజ్ఞానము, భావసంపదతో ఉపనిషత్ సారమును బోధించుచుండును. వీరి రచనలలో పల్లవి, అనుపల్లవి, చరణము లుండును. ప్రతి చరణమునందు అనేక సంగతులు వేసి సాహిత్యార్ధము చెడకుండా, రాగమును అనేక విధముల వృద్ధిచేయు ప్రక్రియను త్యాగరాజు మొట్టమొదటిసారిగా సంగీతమునందు ప్రవేశపెట్టిరి. చివరి చరణములయందు స్వనామము 'త్యాగరాజ'ముద్ర స్పష్టముగా కనిపించును.

త్యాగరాజస్వామి కృతులన్నింటిని స్వరపరిచి వ్రాయుటవలన, ఇన్ని సంవత్సరములైనను, వాటి రాగములు వక్రీకరించకుండెను. వీరు దాదాపు 72 మేళకర్తలందు రచనలు సాగించిరి. "శోభిల్లు సప్తస్వర" అనే కృతిని జగన్మోహిని రాగమునందు రచించి దేవతలతో పోల్చెను. 'రాగసుధాపానము, సాగసున మృదంగ తాళములు, మద్దెల తాళగతులు తెలియకనే' అనే కీర్తనలు, రాగము సుధాపానము వంటిదని, మృదంగ తాళములు సాగసుగను, తాళగతులు తెలియని వానికి దాని సొగసు తెలియదని వివరించిరి. వీరు రచించిన రచనలలో అనేక నుడికారములు, లోకోక్తులు, జానపద పరిభాష, మండలీకములు చోటుచేసుకొని సాహిత్య సంపదను వృద్ధి చేసుకొన్నవనుటలో అతిశయోక్తి కాదు. వీరు వరించి రచించిన "రామభక్తి సామ్రాజ్యం ఏ మానవుల కబ్బెనో మనసా" అలాంటి సామ్రాజ్యంలో "రామా నన్ను బ్రోవరా, వేముకో లోకాభి' అన్న కీర్తనలు రచించి, 1847 సంవత్సరమున పరమహంస బ్రహ్మానందేంద్రస్వామి వారిచే సన్యాసము స్వీకరించి నాదబ్రహ్మానందస్వామిగా పేరుపొంది, ది. 06-01-1847లో ఉదయమునందు యోగసమాధిలో నుండగా, కపాలమునుండి ఆ దివ్య తేజస్సు పరమాత్ముని సన్నిధి చేరెను. వీరి భౌతిక కాయమును, కావేరి నది ఒడ్డున, సమాధి చేసిరి. కాలక్రమమున ఈ సమాధికి పోషణలేక పాడుబడినది. ఆ సమయమున కర్నాటక రాష్ట్రమందు జన్మించిన 'బెంగళూరు నాగరత్నమ్మ యను దేవదాసి, తన యావదాస్తిని వెచ్చించి, ఒక సంగీత సంస్థానముగా తీర్చిదిద్దిన విదుషీమణి, ధన్యురాలు. నాటినుండి నేటివరకు ఆమె ప్రతిపాదించిన మేరకు త్యాగరాజు జయంతి ఉత్సవాలను క్రమము తప్పక కర్నాటక సంగీత పండితులు అక్కడ చేరి యుత్సవము చేయుట పరిపాటి.

కొన్ని దివ్య నామ సంకీర్తనలు: ఓరామ ఓరామ, కరుణా జలధే, దీనజనావన, పరపాలయ, పాహిపరమాత్మ, పాహిమాం హరే, మాసన సంచరరే, మామవ రఘురామ, రామ కోదండరామ, వరలీల గానలో, వేణుగానలోలుని.

సంప్రదాయ కీర్తనలు: మేలుకో దయానిధీ, మేలుకోవయ్యా, రామ శ్రీరామ లాలి, లాలి యూగవే, హెచ్చరికగా రారా, ఉయ్యాల లూగవయ్య, కొలువై యున్నాడే, నగుమోము కలవాని, పూలపాన్పు మీద, జోజో రామ, జయ మంగళం.

8) ముత్తుస్వామి దీక్షితులు

(1775-1835)

నేటి తమిళనాడు రాష్ట్రమందుకల తంజావూరు జిల్లాలోని 'తిరువారూరు' గ్రామమున క్రీ.శ. 1775వ సంవత్సరమున మార్చి 24 తేది తల్లి సుబ్బులక్ష్మి అమ్మాళ్‌కు, తండ్రి రామస్వామి దీక్షితులకు మొదటి సంతానముగా జన్మించిరి. వీరి తండ్రి వైద్యనాద క్షేత్రమునకు వెళ్ళి ముత్తుకుమారస్వామిని సేవింపగా మొదట మగ సంతానము కల్గినందులకు వీరికి ముత్తుకుమారస్వామిగా నామకరణమొనర్చిరి. తదుపరి కాలమునందు ముత్తుస్వామి దీక్షితులుగా ప్రాచుర్యములోనికి వచ్చిరి. దీక్షితులవారు బాల్యమునుండియే బహుముఖ ప్రజ్ఞావంతులు. యోగ, జ్యోతిష్య, నాటక, కావ్య, అలంకార, వ్యాకరణ, చంధస్సులందు అపరిమితమైన జ్ఞానసంపదను సంతరించుకొనిరి. వీరు వీణా వాయిద్యమునందు, గాత్రము నందుకూడ పరిపూర్ణతను సంతరించుకొనిరి. వీరు సంస్కృతమునందేగాక, తమిళ, తెలుగు భాషలందు రచనలు సాగించి, వీటిని కలిపి రచనలు చేసిరి. ఇవి 'మణిప్రవాళిక'గా ప్రసిద్ధినొందినవి. చిదంబర నాదయోగి అను పండితులు దీక్షితుల వారికి మహా మంత్రోపాసన చేయించి, వారణాసికి తీసుకొని వెళ్ళి అక్కడ మంత్రసిద్ధిని, వేదశాస్త్ర ఉపదేశమును గావించి, అష్టమహాసిద్ధులను ఉపాసన చేయించిరి. వీరికి పాశ్చాత్య సంగీతమన్న మిక్కిలి మక్కువ. ఆనాటి బ్రిటీషు అధికారి కల్నల్ బ్రౌను కోరిక మేరకు ఆంగ్లబాణీలకు సంస్కృత సాహిత్య శబ్దములను చేర్చి మిక్కిలి మన్ననలు పొందిరి. పాశ్చాత్య సంగీత వాయిద్యమగు 'ఫిడేలును' కర్నాటక సంగీతమునందు సహకార వాయిద్యముగా ఎన్నుకొని, కొన్ని మార్పులు, చేర్పులు చేసి ప్రాచుర్యములోనికి తెచ్చిరి. నేటి సంగీత కచ్చేరిలలో, వయోలిన్ ప్రముఖ సహకార వాయిద్యముగా ప్రసిద్ధినొందినది.

వీరు వారణాసి క్షేత్రమునందుండగా, వీరికి గంగానదిలో శ్రీరామయని వ్రాసియున్న వీణ దొరికినది మొదలు యోగీంద్రుని కృపాకటాక్షములవల్ల వీరు వీణా వాయిద్యమునందు నిష్ణాతులైరి. వీరు త్యాగరాజస్వామిపై తొమ్మిది కృతులను రచించిరి. తదుపరి తిరువారూరులోని అమ్మవారిపై 'నవావరణ' కృతులను రచించిరి. వీటిలో మంత్ర, తంత్ర, జ్యోతిష్య శాస్త్రములు కలవందురు. వీరి రచనలయందు వీటికి ప్రస్ఫుటమైన స్థానము కలదు. ఆగమశాస్త్రమందలి నిష్ణాతులైన వీరు పంచభూత లింగములపైనను, షోడశ గణపతులపైనను, నవగ్రహములపైనను, మేళకర్తరాగ సంప్రదాయముననుసరించి కీర్తనలు రచించిరి. వీరి రచనలు అనులోమ, విలోమ, చిట్ట స్వరములు, గోపుచ్ఛ యతి, స్రోతోవహయతి, యమక, శ్లేషాలంకారములతో గూడియుండును. వీరు అనుపల్లవితో మధ్యమకాల సాహిత్యమును

చేర్చి, కీర్తన రచనలను రక్తికట్టించిరి. వీరి కీర్తనలలో రాగమును, చంధస్సును, మనోధర్మమును నిక్షింప్తించిరి. అనేక ఘన రాగములలోను, సంపూర్ణ, అసంపూర్ణ, వివాది మేళకర్తలలోను కృతులు రచించిరి. వీరి ముద్ర 'గురుగుహ'. వీరు క్రీ.శ. 1835వ సంవత్సరమునందు పరమపదించిరి.

కొన్ని రచనలు: నవావరణ కృతులు, షోడశగణపతులు కృతులు, పంచలింగ కృతులు, నవగ్రహ కృతులు మిక్కిలి వన్నెతెచ్చినవి.

9) శ్యామశాస్త్రి

(1762-1827)

నేటి తమిళనాడు రాష్ట్రములోని తంజావూరు జిల్లాలోని 'తిరువారూరు' గ్రామమున క్రీ॥శ. 1762వ సంవత్సరమున మేషరాశి కృత్తికా నక్షత్రమునందు వెంగలక్ష్మి - విశ్వనాధశాస్త్రి గార్లకు జన్మించెను. వీరి పూర్వీకులు కర్నూలు జిల్లా కంభం వాస్తవ్యులుగా, తమిళ దేశమునకు వలస వెళ్ళిన వడదేశస్తు వడమాళ్ అను బ్రాహ్మణ శాఖకు చెందినవారు. శ్యామశాస్త్రి అసలుపేరు వేంకటసుబ్రహ్మణ్యం. వీరి ముద్దుపేరు శ్యామక్రిష్ణ, కాలానుగుణములో శ్యామశాస్త్రిగా స్థిరపడినది.

వీరు సంగీత శాస్త్రమందును, సంస్కృతాంధ్ర జ్యోతిష్య శాస్త్రము నందును అపారమైన ప్రజ్ఞా పాటవములను సంపాదించిరి. వీరి ఇంటికి వేంచేసిన యతీంద్రుల కోర్కె మేరకు, పచ్చి మిరియం ఆది అప్పయ్యగారి దగ్గర శిష్యరికము చేసిరి. శ్యామశాస్త్రి కామాక్షి దేవి ఉపాసకులు. వీరి రచనలు గొప్ప పాండిత్యముతోనుండి సామాన్యులు పాడుకొనుటకు వీలుగా యుండదు. మధురలోని మీనాక్షీదేవిని దర్శించి, నవరత్న మాలికయను 9 కృతులను రచించి, ఆ దేవికి సమర్పించిరి. వీరు రచించిన స్వరజతులు అతి ప్రసిద్ధమైనవి. తోడిరాగమందలి రావే హిమగిరి, భైరవి రాగమందలి, 'కామాక్షి', యదుకుల కాంభోజి యందలి కామాక్షి నీపాదయుగము మిక్కిలి ప్రసిద్ధి గాంచినవి. భైరవిరాగమందలి 'కామాక్షి' స్వరజతిలోని 8 చరణములు సరిగమపదనిస ప్రారంభ స్వరములగా రచించిరి. ఈ మూడు స్వరజతులు 'రత్న త్రయము'గా ప్రసిద్ధి నొందినవి. వీరి తాళ జ్ఞానప్రక్రియ మహోన్నతము. అందు ముఖ్యముగా చెప్పదగినది చాపుతాళ ప్రక్రియ. దీనిలో అక్షరకాలము 3+4=7. కాని వీరి 4+3=7 అక్షరకాలములో కూడ తాళ నడక చేయుట ప్రత్యేకత. దీనికితోడు, వీరి లయ సౌందర్యము వర్ణనాతీతము. ఇందు ఐదు అక్షరకాలము 'తధిగిణతోం' తో పాటు, కృతిని రెండు తాళములకు సరిపోవునట్లు రచించుట ఇంకొక సౌందర్యము. రచనలన్నియు అతీత, అనాహత గ్రహములలో సాగించుట, అనేకచోట్ల స్వరాక్షరములను నిక్షిప్తము చేయుటచే, వీరిని తాళబ్రహ్మయని కొనియాడిరి. వీరు 'భూలోక చాపచుట్టి' బిరుదాంకితుడైన బొబ్బిలి కేశవయ్యను మరియు అప్పకుట్టిని ఓడించిరి. వీరు బంగారు కామాక్షి ఉపాసకులు. కామాక్షీదేవిని వీరు తన సోదరిగా భావించి తన కీర్తనలలో 'శ్యామక్రిష్ణ సహోదరి'గా సంభోదించుట ఆనవాయితి. వీరి స్వనామముద్ర 'శ్యామక్రిష్ణ'ను ప్రతి కీర్తన చరణములందు చూడవచ్చును.

కొన్ని ప్రసిద్ధిగాంచిన రచనలు: సరోజదళ నేత్రి, దేవి మీన నేత్రి, మరివేరెగతి, నన్ను బ్రోవలలిత, మాయమ్మ, దేవి నీ పద సారస, మీనలోచన, రావే హిమగిరికుమారి, కామాక్షి అనుదినము, నీలాయతాక్షి, బిరాన వరాలిచ్చి, కనకశైలి విహారిణి, శంకరి శుంకురు చంద్రముఖి.

10 శ్రీ పచ్చిమిరియం ఆది అప్పయ్య

(1740-1833)

శ్రీ పచ్చిమిరియం ఆది అప్పయ్య గారు శ్రీ శ్యామశాస్త్రి గారు సమకాలికులు. ఆది అప్పయ్యగారు 1740-1833 కాలమునందు జీవించియుండినట్లు తెలుస్తుంది. వీరివద్ద శ్యామశాస్త్రి అనేక సంగీత మెళకువలు నేర్చుకొనిరి. ఒక శిష్యునిగా గాక, కామాక్షీదేవి ఉపాసకులుగా, ఆ దేవియే శ్యామశాస్త్రిని తనవద్దకు పంపినదిగా, అది అమ్మవారి అనుగ్రహముగా స్వీకరించిరి. వీరు సంస్కృతాంధ్రములందు మంచి ప్రవీణులు. అటతాళవర్ణముల రచనలో సిద్ధహస్తులు. వీరు రచించిన 'విరిబోణి' అటతాళ వర్ణము మిక్కిలి ప్రసిద్ధినొందినది. తానవర్ణ రచనలో వీరిని మించినవారు లేరని ప్రతీతి. వీరు మెరట్టూరు వీరభద్రయ్య గారి సంగీతశైలినే అనుసరించిరి. వీరివలన రాగాలాపన, మధ్యమకాల పల్లవి రూపుదిద్దుకొన్నవి. వీరిని 'తానవర్ణ మార్గదర్శి'యను బిరుదు వరించెను. వీరి చరణముద్ర 'శ్రీ వేంకటరమణ' వీరి రచనలలో కానవచ్చును. వీరు తంజావూరు ఆస్థాన విద్వాంసులుగా నుండిరి. వీరి ముఖ్య శిష్యులు శ్యామశాస్త్రి, పల్లవి శేషయ్యరు, ఘనం కృష్ణ అయ్యర్. ఇంతటి ఘనకీర్తి నొందిన ఆది అప్పయ్య గారు 1833 సంవత్సరమున పరమపదించిరి.

11) స్వాతి తిరునాళ్ మహరాజ్

(1813 - 1846)

నేటి కేరళరాష్ట్రములో, 1813వ సంవత్సరమున ఏప్రిల్ 16వ తేదీన తిరువనంతపురముననున్న శ్రీ అనంత పద్మనాభస్వామి కృపవలన మహారాణి గౌరి లక్ష్మీబాయికి రాజరాజవర్మ కోయితంపురన్‌కు కలిగిన మగ సంతానము. స్వాతి నక్షత్రమున జన్మించుటచే, వారి ఆచారముననుసరించి ఆ శిశువుకు 'స్వాతి తిరునాళ్' అని నామకరణము చేసిరి. అల్లారు ముద్దుగా పెరిగిన ఆ బాలుడు, సకలశాస్త్ర పారంగతుడై రాజ, యుద్ధ తంత్రములందు ఆరితేరిరి. వీరిని 16వ ఏటనే రాజ్యాభిషిక్తుని గావించిరి. రాచకార్యములను దీవాన్ కర్పించి, వీరు సంగీత సాహిత్యములలో అనేక కృతులను రచించిరి. వీరి చరణ ముద్ర 'పద్మనాభ' అంతేకాక, అబ్జనాభ, అంభోరుహనాభ, పంకజనాభ, పుండరీకనాభ, జలరుహనాభ వంటి అనేక ముద్రలను కూడ వాడిరి.

స్వాతి తిరునాళ్ బహుభాషాకోవిదులు, సంస్కృతము, తెలుగు, కన్నడ, తమిళ, మలయాళము, మరాఠి, పార్శి, హిందూస్తాని, ఆంగ్లము మొదలైన 13 భాషలలో నైపుణ్యము సంపాదించి యావద్భారతములో తలమానికముగా నుండిరి. వీరు చిత్రకళ, శిల్పకళ, మాంత్రికము, దేహాభ్యాసములలో కూడ నిపుణులే. వీరు అన్ని భాషలలోని సాహిత్యమునకు సంగీతమును సమకూర్చిన ఘనులు. వీరి

రచనలయందు కృతులు, కీర్తనలు, పదములు, తిల్లానాలు, జావళీలు, తానవర్ణములు, స్వరజతులు కూడా కలవు. హిందూస్థాని సంగీతములో దృపద్, టిప్పాలు, ఖ్యాలు, తుమ్రీలు కూడ రచించిరి. వీరు తమ రచనలలో సాహిత్యార్థము చెడకుండా పరభాషా పదములను చేర్చి రచనలు సాగించిరి. ఈ మణి ప్రవాళిక సాహిత్యమందు వీరు అందెవేసిన చేయి. వీరు శుద్ధ సంగీతము, ప్రయుక్త సంగీతమను రెండు రకముల రచనలు చేసిరి. ఇందు శుద్ధ, సూచిత, మిశ్ర, స్వరాక్షరాలంకారములు కలవు. వీరు 21 అటతాళ వర్ణములు రచించిరి. వీటిలో కొన్ని సరసిజనాభ (కాంభోజి), స్వామి నిన్నె నమ్మితిరా (యదుకుల కాంభోజి) మిక్కిలి ప్రసిద్ధములైనవి. వీరి రచనలు సుమారు 300 వరకు కలవు. అందులో నవరాగ మాలికలుగా సరస్వతి దేవి, పార్వతి దేవిలకు అంకితమివ్వబడెను. 'భావయామి' అను రామాయణ రాగమాలిక బహుప్రసిద్ధమైనది. కుచేలోపాఖ్యానము, అజామిళోపాఖ్యానము వంటి హరికథలుకూడా రచించిరి. వీరి రచనలు సంప్రదాయ సంగీత కచ్చేరిలకు మాత్రమేకాక, నృత్య సంగీతమునకు, భజనలకు కూడా అనువుగా నుండును.

వీరి సంగీత, సాహిత్య, భాషాపటిమ అనన్య సామాన్యము. పిన్న వయసులోనే విశ్వవిఖ్యాత పరిపాలకులుగా, కవిగా, కళాకోవిదులుగా, వాగ్గేయకారుడుగా ప్రభవించి, తన 34వ ఏట అనగా 1846 డిసెంబర్ 27న పరమపదించిరి. వీరి జ్ఞాపకార్థము తిరువాన్కూరు మహారాణి అయిన సేతు పార్వతి భాయి, స్వాతి తిరునాళ్ రచనలు ప్రచారము చేయుటకు "స్వాతి తిరునాళ్ అకాడమీ ఆఫ్ మ్యూజిక్" అనే సంస్థను స్థాపించి, దానికి ముత్తయ్య భాగవతార్‌ని ప్రధానోపాధ్యాయులుగా నియమించి మిక్కిలి సంగీత, సాహిత్య సేవ చేసిరి.

వీరి కొన్ని రచనలు: భావయామి రఘురామం, పన్నగశయన పాహిమాం, భోగీంద్ర శాయినం, వలపు తాళవశమా నాసామికి, కృష్ణచంద్ర రాధామన్‌మోహన, సరసిజనాభ మురారే, జయజగధీశ, గీత నదికు-తాకిట తకధుక (తిల్లాన), విశ్వేస్వర దరసన (ఖ్యాల్), జమునా కినారే ప్యారే (దృపద్), ఆటతో బైరాగిని బాయి (టప్పా), అలర్ శరపరి తాపం చొల్వతి (మణిప్రవాళ) మొదలగునవి.

12) సదాశివబ్రహ్మేంద్రస్వామి

(1830-1887)

నేటి తమిళనాడు రాష్ట్రమునందు కుంభకోణము వద్దకల "తిరువిశైనల్లూరు" అను గ్రామమునందు 18వ శతాబ్ధమునందు జన్మించిరి వీరి తల్లితండ్రులు పార్వతి-మోక్షసోమసుందర అవధానియను తెలుగు దంపతులు. తన పినతండ్రిగారి వద్ద విద్యాభ్యాసము నొనరించి, అనేక సంస్కృత కీర్తనలు రచించిరి. వీరు కోయంబత్తూరు జిల్లాలోని 'కొడుముడి'యను గ్రామమున దిగంబరులుగా తిరిగి, మౌనముద్రలో ధ్యానము చేసెడివారట. వీరు 1887వ సంవత్సరమున బ్రహ్మైక్యమునొందిరి.

వీరి ముఖ్య రచనలు: మానస సంచరరే, భజరేగోపాలం, నహిరే నహిశంకా, తుంగ తరంగే గంగే, చింతనాస్తికిల.

30. ఆరోగ్య పరిరక్షణలో రాగములు - వాటి ప్రాశస్త్యము

భారతీయ సంగీతము, పరిపుష్టి నొందిన ఒక మహోత్కృష్ట ప్రబంధముగా చెప్పవచ్చును. ఈ సంగీత ప్రక్రియ యందు 72 జనకరాగములు కలవు. వీటి జన్య రాగములు అనంతములు. ప్రతి జన్యరాగమునందు, షాడశస్వర స్థానములలో, కొన్ని స్థానముల సముదాయమును కల్పించి, ఒక రాగ ప్రక్రియను పెంపొందించియున్నారు. ఇటువంటి శబ్ద క్రియలు, మానవుని దేహమునందున్న నాడీవ్యవస్థను ప్రేరేపించి, రోగ కారకములను నశింప చేయును. మంచి సంగీతము మనసును ఆహ్లాదపరచి మానసిక ప్రశాంతతను చేకూర్చును. వివిధ స్వర స్థానముల ధ్వని తరంగములు, వివిధ దైర్ఘ్యములు ఒకదానినుండి ఇంకొకటికి మారుతున్నపుడు గాని, కొన్ని స్వరస్థానముల దైర్ఘ్యములు ఒకదానికొకటి ఇనుమడించి వాటి తీవ్రతనుపట్టి కూడా ఒకవిధమైన శక్తిని ప్రేరేపించి, శ్రోతల మనస్సును రంజింపచేయును. మానవ శరీరంలో శిరస్సుకు ఎంతో ప్రాధాన్యత నివ్వబడినది. ఈ శిరస్సులోనున్న మనసు, ఇంద్రియములు ఆరోగ్యముగానున్నప్పుడే, ఇతర శరీర భాగములు కూడా చాలావరకు చురుకుగా పనిచేయును. ఈ సంస్కృతిలో, ఈ రాగ తరంగముల వల్ల రోగ నివారణ చేయవచ్చునని అనేక యోగులు నిరూపించిరి. అటువంటి వారిలో మహోన్నత సేవ చేసినవారు పరమ పూజ్యులు గురుదేవులు శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామివార్లు.

ఈ క్రింది పట్టికలో మచ్చుకు కొన్ని రాగములు నియంత్రించు రోగములు ఇవ్వబడినవి.

రాగము	నియంత్రించు రోగములు
తోడి, భూపాలము, అహిర్, భైరవి	శిరస్సుకు సంబంధించిన జలుబు, దగ్గు, నొప్పి మరియు రక్తపోటు.
శివరంజని	మానసిక నిర్లిప్తత, కుంగుబాటుతనము.
భైరవి	నాశికారంధ్రముల బాధలు, జిహ్వ మరియు దంత బాధలు.
చంద్రకౌన్య	గుండెదడ, ఆయాసము.
దర్బారి కానడ	శారీరక అలసట, నిర్లిప్తత.
ఆసావేరి	తక్కువ రక్తపోటు.
హంసధ్వని	భయము, నరముల వొత్తిడి, ఇతర అనేక రోగములు.

31. భారతీయ సంగీతమునకు గల ప్రత్యేక విశిష్టత

సనాతన భారతీయ సంస్కృతిలో ప్రకృతిసిద్ధమైన ధ్వనులతోకూడినదై భారతీయ సంగీతము వేదకాలమునుండియు రాణించుచున్నది. సామవేదము మొత్తము రాగయుక్తమై అలరారుచున్నది. అటువంటి మహోత్తమమైన సంగీతము, స్మృతులుగాను, ఉపనిషత్‌లుగాను, మేళములుగాను, రాగజన్యములుగాను పరివర్తనముచెంది, కాలానుగుణముగా పండిత పామరులు మనసారా పాడుకొను రీతిలో పద్యములుగాని, జానపదములుగాని, తత్వములుగాని, నృత్య, నాటక, గేయ, సంగీతములుగా

రూపుదిద్దుకొంది. సనాతన ధర్మప్రచారకులైన ఆదిశంకరులుగాని, మధ్వాచార్యులుగాని, రామానుజాచార్యులుగాని భక్తిని సంగీత రూపముతో మేళవించి ప్రాచుర్యమును కలిగించిరి. అటువంటి హైందవ సంస్కృతిలో భారతీయ సంగీతము కడుసనాతనమైనది. ఈ సంగీతము 'మెలోడిక్' రీతులలో రాగ, తాళ, ప్రస్తారములతో అలరించుచున్నది. వేదకాలమునుండి పుట్టిన ఈ సంగీతము, సామవేదమున చెప్పబడిన 'సామసప్తకము'అనెడిది మొదటి మెట్టు. ఇది చక్కటి సంవాదికల మేళము. దీనినే షడ్జగ్రామమందురు. హైందవ సాంప్రదాయమున సంగీతము కేవలము లౌకికానందముకొరకు గాక, ఆధ్యాత్మికానందమునకు కూడ ఉపయోగపడుతుంది.

భారతీయ సంగీతమున 1) కళాత్మక సంగీతము 2) నృత్య సంగీతము 3) గేయనాటక 4) నృత్యనాటక 5) జానపద సంగీతమను ఐదు భాగములు కలవు. వీటితోపాటు పవిత్ర సంగీతము బాగుగా వృద్ధి చెందింది. తెలుగు, కన్నడ, తమిళ భాషలలో వీటిమీద అనేక గ్రంధములు కలవు.

వాయిద్యములు

ఈ సంగీతమున వాయిద్యములు బహుళ ప్రాచుర్యము పొందినవి. మెట్టు వాయిద్యములగు హార్మోనియము, పియోనా వంటి వాయిద్యములతో తతల, సుషిర, అవనద్ధ, ఘన, వాయిద్యములు వాడుకలోనున్నవి. 1) జలము - జలతరంగిణి 2) మృదము - మృదంగము, ఘటము 3) తోలు - మృదంగము, డోలు, డప్పు, డమరుకము 4) గాలి - వేణువు, సారంగి, నాదస్వరము, సెక్సాఫోను 5) తంత్రి - వీణ, వయోలిన్, మోర్సింగ్ 6) లోహ - తాళములు, మొవ్వలు, గంటలు 7) కర్ర - కోలాట కర్రలు, చిరుతలు మొదలగునవి. హిందు సాంప్రదాయ సంగీతకూటములను ''కుటపము''లందురు. అందు పాల్గొను వాయిద్య కారులనుబట్టి ఉత్తమ, మధ్యమ, కనిష్ఠ బృందములని విభజింతురు. స్వర సంకేతములయిన సరిగమపదని లను ప్రకృతిసిద్ధములైన పలు పక్షి, జంతు జాతులనుండి గ్రహించి దాదాపు 3000 సంవత్సరముల పైచిలుకేనని 'నారదపరివ్రాజక' ఉపనిషత్ నుండి తెలియుచున్నది.

తాళములు

రాగములవలె తాళగతులుకూడ పరిపక్వత చెందియున్నవి. లఘుజాతి భేదములవల్ల 35 తాళములు, గతి భేదములవల్ల 175 తాళములు కలవు. ఇన్ని తాళగతులు మరి ఏ సంగీతమునందును లేవు. అన్ని వాయిద్యములమీద ఈ తాళగతులను వాయించవచ్చును. తత్వములు పాడువారు, జానపదులు, బుడబుక్కలు, వీధి భాగవతార్లు, జంగమదేవర్లు, వారి వారి శృతులననుసరించి పాడే విధానముననుసరించి, తాళగతులను మార్చుకొని మనోరంజకముగా గానము చేయుదురు.

రచనల విశిష్టత

భారతీయ సంగీతము సుస్థిరమైనది. పరిపూర్ణమైనది. దానియందు మూర్ఛన, పల్లవి అను పల్లవి, ముక్తాయి, చరణములు, చరణ సాహిత్యము కలిగి విరాజిల్లుతున్నది. గాయకుని మనోధర్మము ననుసరించి రాగమును పలువిధములగా రాగధర్మము చెడకుండునట్లు పాడుటకు ఆస్కారము కలదు. ఆ విధముగా 72 మేళకర్తలు, వాటి జనకరాగములను, ఔడవ, షాడవ సంపూర్ణ భేదముతో పాడి రక్తి కట్టించవచ్చును.

4. భక్తి - వైరాగ్యములు

దేవాలయ సంగీతములలో, వాగ్గేయకారులు తమను స్త్రీ రూపముగాను, భగవంతుని పురుష రూపముగాను ఎంచుకొని అనేక శృంగార, వైరాగ్య, భోగాతీత రచనలు చేసి భారతీయ సంగీత విశిష్టతను పెంచినారు. జీవాత్మ-పరమాత్మ తత్వమును ఆదిశంకరులు సంస్కృతమున గానము చేయగా తదుపరి వారు సాంప్రదాయ పద్ధతిలోను, మారుతున్న కాలానుగుణముగా రచనలు చేసినారు. శృంగార నేపధ్యంలో జయదేవుని అష్టపదులు, భక్తిపరంగా త్యాగరాజస్వామి, సమర్పణ భక్తితో భోగభాగ్యములనొదలి విఠలునికి దాసుడైన పురంధరుడు, తన్మయత్వంలో తన్నుతాను సమర్పించుకొన్న మీరాబాయి, తరిగొండ వెంగమాంబ, గోదాదేవి రచనలుగాని, అనేక ధర్మ సూక్ష్మములు ప్రబోధించే అన్నమయ్య సంకీర్తనలుగాని తత్వజ్ఞానమును బోధించే తానీషా పదములుగాని, సూరదాసు, తులశీదాసుల భక్తి పరంపరల రచనలు గాని, నైరాశ్యమున వెడలిన వేమన పద్యములుగాని, క్షేత్రయ్య పదములుగాని, భర్తృహరి సుభాషితములు గాని, ఎన్నో లెక్కకుమించి భారతీయ సంగీత ప్రపంచమున గోచరించే మచ్చుతునకలు.

5. సంగీత పోషణ

దక్షిణాదిన చోళ, చాళుక్య, పల్లవ, విజయనగర సాంప్రదాయ దేవాలయములందు గల నృత్య-సంగీత వాటికలు బహు ప్రాచుర్యమును పొందినవి. నేటి శిధిలావస్థలోనున్న విజయనగర సామ్రాజ్యమున, ఈనాటికిని రాతి స్థంభాలపై సరిగమలు పలుకుట మనము వినుచున్నాము. రాతిమీద స్వరములను పలికించి, వాయిద్య ధ్వనులు కూడా పలికించుటలో ఆ ఆంధ్రభోజునకున్న సంగీత మక్కువ ఎనలేనిది. ఇది ఎక్కడకూడ కానరాని గుప్త సంగీత కళాత్మకఖండము. ఉత్తర భారతమున, తాన్‌సేన్, హరిదాస స్వామి, బిస్మిల్లాఖాన్, ఉస్తాద్ ఆలీఖాన్, భారతీయ సంగీతమునకు దాసులై పోషకులైనారు. దక్షిణాది - ఉత్తరాది సంగీతమునకు అంత సారూప్యము లేకపోలేదు. ప్రాచీన కాలమునుండి కాబూలు, కాంధహారు, లహోరు రాజ్యములతో సంస్కృతి ముడిపడి ఉన్నందున, రాచరిక వ్యవస్థలో సంగీత, నృత్యములు, ప్రధానమైయున్నందున, అనేక రాగముల కలయికై, భారతావని సంగీతపరంగా విశిష్టతను సంతరించుకొనినది.

32. లలిత కళలో ఒకటైన సంగీతమునకు, మానవ దైనందిన జీవితములో సంస్కృతిపరంగా, విజ్ఞానపరంగా, భావపరంగా, ఆధ్యాత్మికపరంగా గల విలువలు

అఖండ భారతావని అనాదిగా వేదశాస్త్రములకు పుట్టిల్లు. వేదములలోని సామవేదము సంగీత శాస్త్రమునకు వేదికవంటిది. శిసుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగానరసంఫణి అనే శ్లోకముద్వార శిశువులైన, పశువులైన, సర్పములైనను సంగీత మాధుర్యమునకు తలలు వంచి ఆడుతాయట. ఈ చతుషష్టి కళలందు సంగీతము మన దైనందిన కార్యములతో విడదీయని అనుబంధము కలిగియున్నది.

సంస్కృతిపరంగా ఆలోచించిన, భారతదేశము చరిత్రలో 'భక్తి' సాంప్రదాయమునకు తొలిమెట్టు అని చెప్పవచ్చును. భగవంతుని సేవించుటలోగాని, తరించుటలోగాని భారతీయ సంస్కృతిని ఆధారముగా చేసుకొని, అన్యమతములు, సంస్కృతులు వృద్ధి చెందినవి. ఆ దేవదేవుని, వైశిష్ట్యమును గొనియాడిన వాగ్గేయకారులెందరో తమ నిత్య భోగ భాగ్యములను విడనాడి, సంగీత ప్రాంగణమున చేరి, దైవ సాన్నిధ్యమునొందిన వారిలో జయదేవుడు, పురంధరుడు, అన్నమయ్య, త్యాగరాజు, రామదాసు,

క్షేత్రయ్య, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి మొదలగువారు. ఆ కోవకు చెందిన తరిగొండ వేంగమాంబ, సంఘ సంస్కర్తగానే గాక, భగవంతుని విశిష్టాద్వైతాన్ని ఇనుమడింపచేసిన వైతాళికురాలు. వీరందరు కూడా తమ జీవితములో వైభోగములను విడనాడి, సంగీతమును భావప్రాప్తికై సాధన చేసిన మహనీయులు. ఉత్తర భారతమునందు సూరదాసు, తులసీదాసు, తాన్‌సేన్, హరిదాసస్వామి మొదలగు వాగ్గేయకారులు సంగీతమునాశ్రయించి జన్మధన్యతను పొందినవారు. వీరందరు తమ దివ్యజ్ఞాన ప్రబోధములచే పండిత పామరులను భక్తిమార్గమున పయనింపచేసి ధన్యత పొందినారు.

సంగీత శాస్త్రమున కచేరి భవన నిర్మాణములు ప్రతిధ్వనులపరంగాను, ధ్వని తరంగముల కలయికలవల్ల వచ్చే మధురనాదములకు అనువుగా నిర్మాణశాస్త్రమున వివిగా వివరించబడినది. అంటే గృహనిర్మాణ శాస్త్రము - సంగీత శాస్త్రమునకు అనుబంధమైయున్నది.

భావావేశపరమైన సంగీతము 'ఈరంగమేళము, కవాతు మేళము, పదాతిదళముల మేళములు రణభేరులు. ఈ రకమైన భావపూరిత, ఉద్వేగభరిత మేళములు మనిషిలోని నిద్రావస్థను తరిమికొట్టి ధైర్యము నింపి, కార్యసిద్ధికొరకు ఉపయోగించపడుచున్నవి. క్షణికోద్రేకమైన నవనాడులు, సమరములందు మనిషిలో దాగియున్న నైపుణ్యమును వెలువరించి కార్యోన్ముఖుని గావించును. ప్రతి దేశమునకు వాటి దేశగీతములు కలవు.

అంతేగాక ఖగోళమునకు సంబంధించిన, వాతావరణ సంబంధమైన వేడి, వాన, చలి, మొదలగు వాటికి అనుగుణములైన రాగములను పాడి, పంచభూతములను నిర్దేశించినవారు కలరు.

'తెరతీయగరాదా' అంటూ త్యాగరాజస్వామి, వెంకన్న సన్నిధిలో పాటపాడగా, ఈనాటి ఎలక్ట్రానిక్ పరికరముతో పనిచేసినట్లు ఆనాడు ఆ తెర తొలగించబడినది. అంటే సంగీత శాస్త్రము ఏవిధంగా వృద్ధి చెంది మానవ జీవితమునకు దశ దిశ కలిగించినదో మనకు అవగతమౌతుంది. వివిధ దేశముల రాగములను కలిపి హిందూస్థాని సంగీతమును వృద్ధి పరచినట్లు, అనేక రాగములను కలిపి, రాగప్రక్రియను, రాగమాలికను పొందుపరచిరి.

సంగీతములోనుండు తరంగ శబ్ధములు అతిమంద్ర, మంద్ర, సాధారణ, తీవ్ర, అతి తీవ్రస్థాయిలలోనుండుటచే మానవ శరీరములో నుండే శక్తిని ప్రేరేపింపబడి, రోగకారకములను శబ్ధ పుంజకముల వలన నశింపచేయును. మనిషికి స్వస్థత చేకూరుతుంది. సంగీతమునందు కల 22 శృతులు దీర్ఘ-అల్పతరంగముల ధ్వని ప్రక్రియ. ఈ ధ్వనిని మన చెవులు గ్రహించి, మెదడుకు మోదము కలిగించుటచే, సెరిటోనిన్ అనే పదార్ధము ప్రేరేపింపబడి మనశ్శాంతి కలుగుచున్నది.

కంఠములోనుండు స్వరపేటిక, చెవులు, నాశికారంధ్రములు ఒకదానితో ఒకటి అనుసంధానించబడి యుండును. వీటి నిర్మాణ క్రమమునుగూడా సంగీత శాస్త్రమునందు వివరించిరి. నాదమువలన కంఠములోని కండరములు సంకోచ వ్యాకోచములనొంది వాయువును నాశికారంధ్రముల ద్వారా క్రమబద్ధీకరించుటచే విలోమ-అనులోమ ప్రక్రియకు అనుసంధానమై ధ్యాన ప్రవృత్తి కలదిగా ఆరోగ్యమును పెంపొందించును. శబ్ధతరంగ వ్యత్యాసముల వల్ల చెవిలోని ఎముకల గొలుసు, రససాంద్రత, గూబ పొర కదిలి చెవి వినికిడి శక్తిని మరింతగా పెంపొందించును.

సంగీతము ఒక పెద్ద గణితశాస్త్రము. ఎందుకనగా వికృతి స్వరములకు స్వరస్థానములు వేరుగా నుండి, వాటిని సెకండ్ల వ్యవధిలో ఆరోహణ-అవరోహణను లెక్కప్రకారముగా రాగమును నడిపించవలెను.

ఆ రాగప్రక్రియను అనేక సంగతులతో ముందుకు నడిపించి రాగమునకు ముక్తాయి పాడెదము. ఈ పరిధిలోనివే లఘువు, గురువు, ప్లుతము, దృతము, కాకపాదము మొదలైనవి.

సంగీతపరంగా ప్రసిద్ధినొందిన నగరములు

తంజావూరు, తిరువయ్యూరు, ఎట్టయాపురము, చెన్నై (మదరాసు), మైసూరు, శ్రీరంగము, తిరుపతి, పిఠాపురం, విజయనగరము, బొబ్బిలి, భువనేశ్వరము, వారణాసి, లక్నో, ఢిల్లీ, హంపి, తిరువనంతపురము, గ్వాలియరు, మొవ్వ మొదలగు నగరములు.

సంగీతమును పోషించిన మహారాజులు మరియు స్వామీజీలు

మహారాజులు : తులజాజి, శ్రీ జగధీశ్వర రామకుమార ఎట్టప్ప, స్వాతి తిరునాళ్, జయదేవుడు, పూసపాటి నారాయణ గజపతి, భోజరాజు, శ్రీకృష్ణదేవరాయలు, ఢిల్లీ సుల్తానులు, మైసూరు వడయార్లు, స్వాతి తిరునాళ్,

స్వామిజీలు : శ్రీశ్రీశ్రీ త్రిందండి రామానుజ చినజీయరు స్వామి మఠం, శీతానగరం, గుంటూరు.
గణపతి సచ్చిదానంద స్వామి, మైసూరు, కర్నాటక
సుందర చైతన్యానంద స్వామి, ధవళేశ్వరం, రాజమండ్రి
పెజావర్‌మఠ్, ఉడిపి, కర్నాటక

గాయకులు : డా॥ పట్టమ్మాళ్, ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, చంబై వైద్యనాధన్ భాగవతార్, శ్రీరంగం గోపాలరత్నం. ఎం.ఎల్. వసంతకుమారి, డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ

సినిమా (చలనచిత్రం) : ఘంటసాల వెంకటేశ్వరరావు, భానుమతి రామకృష్ణ, సుశీల, జిక్కి, పి.లీల, జానకి, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం

రాజులు : మైసూరు వడయార్ రాజులు, స్వాతి తిరునాళ్

హైందవ సంస్కృతిలో దేవతలు - వారి వాయిద్యములు :

శ్రీమహావిష్ణువు - శంఖము - సుషిర

పరమేశ్వరుడు - డమరుకము - తోలు

శ్రీకృష్ణుడు - వేణువు - సుషిర

సరస్వతిదేవి - వీణ - తంత్రి

హనుమంతుడు - వీణ - తంత్రి

నారదుడు - తంబూర - తంత్రి

తుంబురుడు - తంబూర - తంత్రి

33. స్వర ప్రస్తారము

విద్యార్థులకు స్వర జ్ఞానమును కలుగజేయుటకు స్వర ప్రస్తారములును అభ్యసింప చేయవలయును. కొన్ని ప్రస్తారములు మచ్చుగా నివ్వబడినవి. వీటిని ఆధారముగా జేసుకొని తక్కినవి పాడించవలయును. ఈ ప్రస్తారములు ఎంత ఎక్కువగా అభ్యసించిన, అంత సులభముగా వర్ణములు, కృతులు, కీర్తనలు మరియు తిల్లానాలు పాడవచ్చును. చతురస్ర, తిశ్రజాతులకు స్వరప్రస్తారము ఇవ్వబడినవి. అకార, ఇకార, ఉకారములతో అభ్యాసము చేయించవలెను.

చతురస్రజాతి

1 సరిగమ
రిగమప
గమపధ
మపధని

2 సగరిమ
రిమగప
గపమధ
మధపని

3 సరిగరి
రిగమగ
గమపమ
మపధప

4 సగరిగ
రిమగమ
గపమప
మధపధ

5 సమగరి
రిపమగ
గధపమ
మనిదప

6 సమగమ
రిపమప
గధపధ
మనిధని

7 సగమగ
రిమపమ
గపధప
మధనిధ

8 ససరిగ
రిరిగమ
గగమప
మమపధ

9 సరిరిగ
రిగగమ
గమమప
మపపధ

10 సరిగగ
రిగమమ
గమపప
మపధధ

11 సారిగ
రీగమ
గామప
మాపధ

12 సరీగ
రిగామ
గమాప
మపాధ

13 సరిగా
రిగమా
గమపా
మపధా

14 సమాగ
రిపామ
గధాప
మనీద

15 సగామ
రిమాప
గపాధ
మధాని

16 సారిగ
సరీగ
రీగమ
రిగామ

17 సరిగా
సారిగ
రిగమా
రీగమ

18 సారిగ
సరిగా
రీగమ
రిగమా

19 సరీగ
సారిగ
రిగామ
రీగమ

20 సరిగ
సరీగ
రిగమ
రిగామ

21 సారిగ
సరీగ
సరిగా
రీగమ
రిగామ
రిగమా
రీగమ

తిశ్రజాతి

1 సరిగ
రిగమ
గమప
మపద

2 గరిస
మగరి
పమగ
ధపమ

3 సరిగ
రిమగ
గపమ
మధప

4 గసరి
మరిగ
సగమ
ధమప

5 సరిగ
సగరి
రిగమ
రిమగ

6 సరిగ
గసరి
రిగమ
మరిగ

7 సరిగ
సారిగ
రిగమా
రిగామ
రీగమ

8 సరిగ
మరిగ
రిగమ
పమగ

9 సరిస
గరిస
రిగరి
మగరి

10 సరిరి
గరిస
రిగగ
మగరి

11 సరిస
సరిగ
రిగరి
రిగమ

12 సరీ
రిగా
గమా
మపా

13 సగా
రిమా
గపా
మధా

14 సారి
రీగ
గామ
మాప

15 సాగ
రీమ
గాప
మాధ

16 ససరి
రిరిగ
గగమ
మమప

17 సరిరి
రిగగ
గగమ
మపప

18 ససా
రరీ
గగా
మమా

19 సాస
రీరి
గాగ
మామ

20 సరిస
రిగరి
గమగ
మపమ

21 ససరి
సరిగ
రిరిగ
రిగమ

34. రచనలను స్వరపరిచి వ్రాయుపద్ధతి

ఉదా : కాలహరణమేలరా కృతిని స్వరపరిచి వ్రాయు పద్ధతి

రచయిత : త్యాగరాజు

కృతి పేరు : కాలహరణమేలరా తాళం : రూపక తాళం

మేళకర్త సంఖ్య : 28 అంగసంజ్ఞలు 0_2 1_4

క్రియలు : 2 + 4 = 6

మేళకర్త రాగము : హరికాంభోజి

జన్యరాగము : శుద్ధ సావేరి

మూర్ఛన :

ఆరోహణ : సరిమపద$\dot{స}$; అవరోహణ : $\dot{స}$దపమరిస

శృతులు : షడ్జమము, చ॥రి, శు॥మ, పంచమము, చ॥దైవతము.

రాగము : ఔడవ - ఔడవ రాగము, శుద్ధ మధ్యమ రాగము

గాంధారము, నిషాదముల వర్జ్యములు.

రిషభము మిక్కిలి ప్రాముఖ్యముగను, మధ్యమ దైవతములు రాగచ్ఛాయ స్వరములుగా నుండును.

తదుపరి, పల్లవికి ధాతువు మాతువు వ్రాయవలెను.

ఈవిధముగా అనుపల్లవి, చరణములకు కూడా వ్రాయవలెను. కొన్ని కీర్తనలలో, మధ్యమ కాల సాహిత్యమున్నను, లేక చరణ సాహిత్యములున్నను తప్పక వ్రాయవలెను. వీటి తరువాత, చిట్ట స్వరములున్నను తప్పక వ్రాయవలెను. తదుపరి రాగచ్ఛాయ స్వరములు, సంచార స్వరములు, వ్రాయవలెను. ఈ రాగముతో కల కొన్ని కృతులు లేక కీర్తనలు ఉదాహరణగా ఇవ్వవచ్చును. ఆ కీర్తనాచార్యుల పేర్లు, కృతి కర్త పేర్లనుకూడా ఉదాహరించిన మంచిది.

35. సంగీతమును ప్రధమముగా నేర్చుకొను విద్యార్థులు పాటించవలసిన నిబంధనలు

1. భాసింపెట్లు వేసుకొని నిఠారుగా కూర్చొనవలెను.
2. గోడకు ఆనుకొని కూర్చుండరాదు
3. నోరును తెరచి గురువుగారిని శ్రద్ధగా గమనించుచూ, ఆయన పాడిన విధముగనే పాడవలెను.
4. ఎక్కడో ఆలోచనలు చేయుచూ పాడరాదు. మనసును ఏకాగ్రతతో నుంచవలెను.
5. పాఠమును కంఠస్థము చేయవలెను. చూచి పాడరాదు.
6. కంఠమును, పండ్లను, పెదవులను బిగించి పాడరాదు.
7. పాడు సమయమున వెకిలి చేష్ఠలు చేయరాదు.
8. అక్షరములను స్పష్టముగా పాడవలెను.
9. పాడు సమయమున, గురువుగారు వేయు తాళమును శ్రద్ధతో గమనింపవలెను.
10. పాటలోని గమకములు గుర్తుంచుకొని గమకయుక్తముగా పాడవలెను.

పూలంగి సేవ

స్వీయ రచన

పూలంగి సేవంట సాయినాధునికి
ఊరిలో పూలన్ని కోయరారమ్మా ॥ 2 ॥

మల్లెపూల తోరణాలు - తెల్లనైన సాయికి
జాజిపూల హారాలు - ద్వారకామాయికి ॥ పూ ॥

బంతి పూల గంపలన్ని - ఆ సాయి నాధునికి
చేమంతి దండలన్ని - ఆ షిరిడి మారాజుకి ॥ పూ ॥

సంపంగి వాసనంత - ఆ సత్సంగధారికి
కనకాంబర రాసులంట - ఆ కాషాయధారికి ॥ పూ ॥

మందార గుత్తులంట - ఆ ముద్దనయ్యకి
కదంబాల మాలలంట - ఆ రాజయోగికి ॥ పూ ॥

ఊర ఊర తిరిగేటి - ఆ సాయినాధునికి
పూలన్ని సొంతమంట - ఆ దత్తసాయికి ॥ పూ ॥

జై సద్గురు

ప్రసిద్ధి చెందిన కొందరు గాయని - గాయకులు

డి.కె. పట్టమ్మాళ్

ఎం.ఎస్. సుబ్బులక్ష్మి

శ్రీరంగం గోపాలరత్నం

ఎం.ఎల్. వసంతకుమారి

టి.ఎన్. శేషగోపాలం

సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్

పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్

పాపనాశం శివన్

మహారాజపురం సంతానం

చెంబై వైద్యనాథ భాగవతార్

స్వాతి తిరునాళ్

మంగళంపల్లి బాలమురళీకృష్ణ

ఓం సాయి శ్రీ సాయి
జయ జయ సాయి